fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

29-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 239 పేజీలు: 10+4 వెల: 6.50

epaper.vaartha.com
WWW.VAARTHA.COM

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5 వికెట్ల తేడాతో దాయాదిపై భారత్ గెలుపు

చివరి నిముషం దాకా నరాలుతెగే ఉత్కంఠ

సంబురాల్లో మునిగితేలిన క్రికెట్ అభిమానులు

9వ సారి ఆసియాకప్ గెలిచిన టీమిండియా

**పాక్ 146 ఆలౌట్, భారత్ 150/5**





# జయహో భారత్

## ఆసియా కప్ ఫైనల్‌లో పాక్‌పై టీమిండియా గెలుపు

### టోర్నీలో మూడుసార్లు పాక్ ఓటమి

ఆసియా కప్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్థాన్ మూడు సార్లు పరాజయం పాలైంది. లీగ్‌లో ఓ సారి, సూపర్-4లో రెండోసారి, ఫైనల్‌లో మరోసారి చిత్తుగా ఓడింది. మొత్తంమీద పాకిస్థాన్‌పై తమదే పైచేయి అని మరోమారు టీమిండియా నిరూపించుకుంది.





ట్యాంక్‌బండ్‌పై అభిమానుల సంబురాలు

**దుబాయ్, సెప్టెంబర్ 28:** ఆసియా కప్‌ను మరోసారి టీమిండియా ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టి పాకిస్తాన్‌ను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో సఫలీకృతుడయ్యాడు. అనంతరం టీమిండియా 5 వికెట్లు కోల్పోయి ఇంకా రెండు బంతులు మిగిలి ఉండగానే, 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ గెలవడంతోపాటు ఆసియా కప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. తొమ్మిదోసారి చాంపియన్‌గా నిలిచి భారత జట్టు చరిత్ర సృష్టించింది.

ఇక మ్యాచ్ విషయానికొస్తే, టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోగా, పాక్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సహిబ్జాద పర్హాన్(57), ఫఖర్ జమాన్ (46) రాణించగా, మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలబడలేకపోయారు. సయీమ్ అయూబ్ 14, కెప్టెన్ సల్మాన్ అఘా 8, మొహమ్మద్ నవాజ్ 6, హారీష్ రవూఫ్ 6 పరుగులు మాత్రమే చేశారు. దీంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టగా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండేసి వికెట్లు >>2

## నాకు పదేళ్లు పవరిస్తే..


# న్యూయార్క్‌లా 'ఫ్యూచర్ సిటీ'

500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువుదీరుతాయి..

యేడాదిలోగా అద్భుతమైన సింగరేణి కార్యాలయం

బుల్లెట్ రైలుకు అనుమతించిన కేంద్రం

**కొత్త సిటీకి భూమి పూజ చేసిన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రులు**



ఫ్యూచర్ సిటీ నమూనాను పరిశీలిస్తున్న సిఎం రేవంత్, డిసిఎం భట్టి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :** భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని, పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరాన్ని నిర్మిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కందుకూర్ మండలం మీర్‌ఖాన్ పేటలో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాలను తలదన్నే విధంగా మన భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు కొనసాగుతాయని >>2

**విహెచ్ పేరుతో బతుకమ్మ కుంట**
ప్రారంభించిన సిఎం రేవంత్ 2

## స్థానిక సమరానికి

# 'అంతా' రెడీ

### నేడు షెడ్యూల్ ఖరారు!

3 దశల్లో పంచాయతీ ఎన్నికలు

**2 దశల్లో ఎంపిటిసి, జెడ్పీటిసి పోల్స్**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు28:** స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు 3 దశల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు రూ.350 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఇప్పటికే రూ.3.08 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. రాష్ట్రంలో 1,67,03,163 మంది గ్రామీణ ఓటర్ల ఎన్నికల్లో పాల్గొనన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు ప్రత్యక్షంగా, 565 మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు),31 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మొత్తం పంచాయతీల్లో వందశాతం ఎస్టీ లున్న పంచాయతీలు 1,248, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనివి 1,289, ఇతర ప్రాంతాల్లోనివి 10,223.రాష్ట్రంలో 11 గుర్తింపు పొందిన పార్టీలు, 31 నమోదు పార్టీలు తమ గుర్తులపై జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొంటాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం 1,67,03,168 మంది ఓటర్లలో 85,36,770 మంది మహిళలు, 81,65,894 మంది పురుషులు, 504 మంది ఇతరులు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 31,377 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.ఇందులో 8,123 సమస్యాత్మక, 8,113 అతి సున్నిత, 515 అత్యంత సున్నితమైనవి. 1,12,720 పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో 19,774 సమస్యాత్మకం, 21,093 అతి సున్నిత, 2,324 అత్యంత సున్నితమైనవి.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 37,652, పంచాయతీ ఎన్నికలకు 1,35,264 బ్యాలెట్ బాక్స్‌లు అవసరం కాగా >>2

## అక్టోబరు 2న

# ఖాదీ యే ధరించాలి

**మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** నిస్వార్థ సేవా స్ఫూర్తి, క్రమశిక్షణలే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నిజమైన బలాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఆర్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతీ పనిలోనూ 'నేషన్ ఫస్ట్‌కే' ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. 100వ వ్యవస్థాపక దినోత్సవాలను ఆర్ఎస్ఎస్ ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ ఆదివారం రోజు 126వ మన్ కీ బాత్‌లో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. విజయదశమి రోజునే ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం ఇంకొన్ని రోజుల్లో మనం విజయదశమిని జరుపుకోబోతు



న్నాం. ఓ కారణం వల్ల ఈసారి విజయదశమి చాలా స్పెషల్‌గా నిలువనుంది. సరిగ్గా 100 ఏళ్ల క్రితం విజయదశమి పండుగ రోజునే ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించింది. ఈ విజయదశమి రోజునే ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం కూడా జరగనుంది. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారని గుర్తు చేశారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ 11 ఏళ్లుగా మళ్లీ పెరుగుతోందని అన్నారు. స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా >>2



గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేస్తున్న టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం

# పోస్టులు: 783 ఎంపిక: 782

### గ్రూప్-2 ఫలితాలు విడుదల

**ఒక్కపోస్టును నిలిపి ఉంచిన టిజిపిఎస్సీ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 28:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ఆదివారం ప్రకటించింది. ఫలితాలను టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. మొత్తం18 ప్రభుత్వ శాఖల్లోని783 పోస్టులకు సంబంధించి.. >>2

## నేడు సరూర్ నగర్ స్టేడియంలో

# మహా బతకమ్మ



**హాజరుకానున్న సిఎం, మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో బతుకమ్మ కీర్తిని ప్రపంచానికి చాటేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఇందులో భాగంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో పదివేల మంది మహిళల సమక్షంలో అతి భారీ స్థాయిలో బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు.ఈ కార్యక్తమానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు జూపల్లికృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, హాజరుకానున్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై

# నేటి నుండి విచారణ

**కోర్టుగా మారిన స్పీకర్ కార్యాలయం, ఎమ్మెల్యేల తరపున అడ్వకేట్ల వాదనలు**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు28:** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై విచారణకు షెడ్యూల్ విడుదలైంది. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు విధించారు. పార్టీ పిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సోమవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖాముఖి విచారణ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు విధిస్తూ అధికారులు ఆదివారం ఒక బులెటిన్ విడుదల చేశారు. బులెటిన్ ప్రకారం.. అనుమతి లేనిదే అసెంబ్లీలోకి నో ఎంట్రీ.. విజిటర్లు, మీడియాతో పాటు మాజీ ఎమ్మెల్యేలకు,ఎమ్మెల్సీలకు ఆంక్షలు విధించారు. ముందస్తు అనుమతి ఉంటేనే అసెంబ్లీ భవనంలోకి ఎంట్రీ ఉంటుంది. అలాగే మీడియా పాయింట్ వద్ద ఎవరూ మాట్లాడొద్దని నిబంధనలు విధించారు. ట్రిబ్యునల్ ముందు హాజరయ్యే సభ్యులు (పిటీషనర్లు, రిస్పాండెంట్లు), వారి న్యాయవాదులు కోర్టు హాల్లో మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని ఆదేశించారు. ఎవరు మొబైల్‌తో రికార్డింగ్ లేదా ఫోటోలు/వీడియోలు తీస్తే, ఆ ఫోన్ స్వాధీనం చేసుకొని, ఆ న్యాయవాది కోర్టులో వాదన వినిపించే అవకాశం కోల్పోతారని రాష్ట్ర శాసనసభ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు బులెటిన్ విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణకు షెడ్యూల్ రిలీజ్ అయిన సంగతి విదితమే. సోమవారం ఉదయం 11 గంటలకు >>2

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ

# ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోయిస్టులు హతం**

**హైదరాబాద్,సెప్టెంబరు28, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో ఆదివారం భారీఎన్‌కౌంటర్ జరిగింది.ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులను ఏరివేయడమే లక్ష్యంగా కాంకేర్‌గారియాబంద్ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో భద్రతా దళాలు రాకను గుర్తించిన నక్సలైట్లు వారిపై ఎదురుకాల్పులకు దిగడంతో అప్రమత్తమైన భద్రతా దళాలు వెంటనే కాల్పులు ప్రారంభించారు.ఇద్దరి మధ్య గంటలపాటు ఎదురుకాల్పులు కొనసాగగా.. ముగ్గురు మావోయిస్టుల మృతి చెందారు.మృతి చెందిన వారిలో ముగ్గురిపై రూ.14 లక్షల రివార్డు ఉన్నట్టు భద్రతా దళాలు గుర్తించారు.మృతుల్లో మహిళ ఉంది. ఘటనా స్థలంలో వారి నుంచి భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకన్నారు. వాటిలో >>2



ఆదివారం భద్రాచలంలో 'ధర్మయుద్ధం' ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీలు

# ధర్మయుద్ధం సక్సెస్

### కదం తొక్కిన ఆదివాసీలు

**లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించే దాకా ఉద్యమిస్తాం: మాజీ ఎంపి సోయం బాపూరావు**

**భద్రాచలం, ప్రభాతవార్త :** గిరిజన జాబితాలో అక్రమంగా చొరబడ్డ లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ఆ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమిస్తామని మాజీ ఎంపి సోయం బాపూరావు అన్నారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టి జాబితా >>2



ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'పింక్' రన్‌లో పాల్గొన్న మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్

## బతుకమ్మ ఆడిన మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 28,ప్రభాతవార్త:** తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలోనే బతుకమ్మ సంబురాలో ప్రపంచ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సందడి చేశారు. మహిళలు, చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో మిస్ వరల్డ్ ఓపల్ సుచాత పాల్గొన్నారు.అందరితో కలిసి బతుకమ్మ ఆడి సందడి. చేశారు. బతుకమ్మ వేడుకలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఓపల్ సుచాత ఈసందర్భంగా అన్నారు. కాగా, బ్రెస్ట్ కాన్సర్స్ అవగాహన కార్యక్రమంలో పాలొందుకు నగరానికి వచ్చిన ప్రపంచ సుందరి బతుకమ్మ వేడుకలో సందడి చేశారు. మరోవైపు ప్రభుత్వం ప్రతిషాత్మకంగా నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ సంబరాలతో పాటు వివిధ కార్యక్రమాల్లో ప్రపంచ సుందరి పాల్గొనే అవకాశం ఉంనట్ల తెలిసింది.

## జూబ్లీహిల్స్ బైపోల్‌కు సెంట్రల్ అబ్జర్వర్ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు28:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, తెలంగాణతో పాటు ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారం నాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బిహార్‌లోని నియోజకవర్గాలతోపాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్), ఘాట్‌సిలా (జార్ఖాండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), దంపా (జార్ఖండ్), నువాపడా (ఒడిశా)లో పని చేయనున్నారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల్లో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. కాగా,తెలంగాణలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో బై ఎలక్షన్ అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ స్థానానికి బిఆర్ఎస్ నుంచి గోపినాథ్ సతీమణి సునీత పోటీ చేయనుండగా ఇతర పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నేటి నుండి విచారణ

>> రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ పార్టీ మార్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ దాఖలు చేసిన పిటిషన్ పై, మధ్యాహ్నం 12 గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరపనున్నారు. మధ్యాహ్నం 1 గంటలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై చింత ప్రభాకర్ రెడ్డి, మధ్యాహ్నం 3 గంటలకు గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై పల్లా రాజేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అడ్వకేట్లతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఫిర్యాదు దారుల అడ్వకేట్ల మధ్య వాదనలు జరగనున్నాయి. పార్టీ ఫిరాయింపుల పిటిషన్ల విషయంలో స్పీకర్ కు సుప్రీంకోర్టు విదించిన గడువు వచ్చే నెల 30తో ముగియనుంది. మొత్తం 10 మంది ఎమ్మెలేలకు పార్టీ పిరాయింపు నోటీసులు స్పీకర్ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేలు ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శికి తమ వివరణలను అఫిడవిట్ రూపంలో అందజేశారు. అనర్హత పిటిషన్లపై సోమవారం నుంచి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేయనున్నారు. ఈ సందర్భంగా క్రాస్ ఎగ్జామినేషన్ దశలో న్యాయవాదులు కీలక వాదనలు వినిపించనున్నారు. అక్టోబర్ 1 వరకు అదే కేసులపై విచారణలు కొనసాగనున్నాయి. పిటిషనర్‌లు, ప్రతివాదుల తరఫున న్యాయవాదులు ప్రత్యక్ష వాదనలు వినిపిస్తారు.

## జయహో భారత్

>> తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 147 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి భారత్, ఓపెనర్ అభిషేక్ శర్మ(5) నిరాశపరిచాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1) మరోసారి నిరుత్సాహపరిచాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (12) ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. 4 ఓవర్లకే 3 కీలక వికెట్లు జారవిడుచుకుని భారత జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ జట్టు స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. అభిమానుల్లో సంతోషం నింపాడు. సంజూ శాంసన్‌తో, శివమ్ దూబెతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్ గెలుపులో బౌలింగ్‌లో కుల్‌దీప్ యాదవ్, బ్యాటింగ్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబె అద్భుత ప్రదర్శనే కీలక పాత్ర పోషించింది.



## ఎన్‌కౌంటర్

>> ఎస్ఎల్ఆర్ రైఫిల్, 303 రైఫిల్, 12 హ్యాండ్ గన్‌లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. మృతి చెందినవారు సర్వాన్ మడ్కంపై రూ.8లక్షల రివార్డు, రాజేష్ అలియాస్ రాకేష్ హేమ్లాపై రూ.5లక్షల రివార్డు, బసంతి కుంజమ్‌పై రూ.1లక్ష రివార్డు ఉన్నట్టు అధికారులు తెలిపారు.సర్వాన్ మావోయిస్టు కోఆర్డినేషన్ ఏరియా కమిటీ కార్యదర్శి కాగా..మరొకరు రాజేష్ నగరి ఏరియా కమిటీ గోబ్రా కమాండర్ ఉన్నారు. కాల్పుల ఘటనపై బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ స్పందించారు. మావోయిజం అంతరించిపోయే దశలో ఉందనే వాస్తవాన్ని మావోయిస్టు కార్యకర్తలు అంగీకరించాలని అన్నారు. ప్రభుత్వ పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకుని హింసమార్గాన్ని విడిచిపెట్టి జనజీవనస్రవంతిలో చేరాలని అన్నారు.

## ఎంపిక: 782

>> ఎంపికైన 782 మంది జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఛైర్మన్ తెలిపారు.783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించిన కమిషననఒక వెకెన్సీని విత్ హెల్డ్‌లో పెట్టినట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండోసారి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. సుమారు 5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థులకు సంబంధించిన మార్కులు, జనరల్ ర్యాంక్ లిస్ట్‌ను ఈ ఏడాది మార్చి 11న టీజీపీఎస్సీ విడుదల చేయగా.. వివిధ కోర్టు కేసుల అనంతరం ఆదివారం గ్రూప్-2 తుది ఫలితాలను టీజీపిఎస్సీ ప్రకటించింది.

## సమరానికి 'అంతా' రెడీ

>> 1,18,547 సిద్ధం చేశారు. జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 651 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు 2,337 మంది ఆర్వోలు, 2,340 మంది ఏఆర్‌వోలు, 39,533 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,58,725 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 4,956 మంది ఆర్వో మొదటి దశ, 14,407 మంది ఆర్వో రెండో దశ, 79,798 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,03,318 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు.

## వారం - వర్జ్యం

29-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి సా.4.28
మూల పూర్తి
వర్జ్యం : రా.4.32-6.17
దు.మ.12.23-1.11,
2) మ.2.47-3.35
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన పెట్టుబడులలో నిదానం అవసరం.

**వృషభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. వాహనసౌఖ్యం.

**మిథునం:**ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మరిచిపోయే అవకాశం ఉంది.

**కర్కాటకం:**హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు.

**సింహం:**ఉద్యోగయత్నాలు ముమ్మరం చేసి సానుకూల ఫలితాలను సాధిస్తారు.

**కన్య :** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయంలో కొంత అశాంతికి లోను అవుతారు.

**తుల :**శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తిచేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**వృశ్చికం:**భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**ధనుస్సు:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది, జాగ్రత్త.

**మకరం:** బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** పాత బాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి.

**మీనం :** ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆరోగ్య సమస్యలు కొంత మెరుగుపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విహెచ్ పేరుతో బతుకమ్మ కుంట

**తన జీవితాశయంగా పోరాటం చేశారు..**

**అగ్గువకు వస్తుందని సర్కార్ భూములు ఎవరూ కొనొద్దు**

**మూసీ పునరుజ్జీవనానికి అంతా కలిసిరావాలి**

**బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్**



ఆదివారం బతుకమ్మకుంటలో నిమజ్జనం చేస్తున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వాములను చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిండుదనం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం.. చెరువులో బతుకమ్మలు వదిలి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..మాజీ ఎంపీ వి.హనుమంతరావు తన జీవితాశయంగా బతుకమ్మ కుంట కోసం పోరాడారని కొనియాడారు. హైడ్రా ఏర్పాటు చేసినప్పుడు కొంతమందికి దాని ఉద్దేశం అర్థం కాలేదని.. మరికొందరు అర్థమైనా కబ్జాలను కాపాడుకునే ప్రయత్నం చేశారని తమ ప్రభుత్వంపై చాలా విమర్శలు వచ్చినప్పటికీ ఒడిదుడుకులను సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లామన్నారు. కోవిడ్ తరువాత వాతావరణంలో విపరీతమైన మార్పులు వచ్చాయని, ఒకేసారి కుంభవృష్టి కురుస్తున్న పరిస్థితుల్లో, భవిష్యత్ లో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒకప్పుడు జీవధారగా ఉన్న మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారిందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను విడిపించడం, నాలాలను విస్తరించడం, మూసీ పునరుజ్జీవనం చేయడం తమ ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు తెలిపారు. "రాజకీయాలకు అతీతంగా మూసీ పునరుజ్జీవానికి అందరూ కలిసి రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కొంత మందికి పేదరికం ఎక్స్‌కర్షన్ లాంటిది కానీ, తమకు అలా కాదని, పేదరికం విలువ ఏమిటో తనకు తెలుసునని సీఎం అన్నారు. వర్షం వస్తే గంటలో మూసీ పరివాహక కాలనీలు జలమయం అవుతున్నాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. అలాగే అంబర్‌పేట మూసీ పరివాహక ప్రాంతాల పేదలకు పునరావాసం కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేటను అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే "మాయగాళ్ల మహానగరంలో చాలామంది ఉంటారు. వాళ్ల ముఠా నాయకుడు ఇంకొకరు ఉండొచ్చు. మాయమాటలు చెప్పి ప్రభుత్వ భూములను అగ్గువ సగ్గువకు అమ్మితే కొనకండి" అని పేదలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తమది ప్రజా ప్రభుత్వం అని, ప్రజలెవరినీ కష్టపెట్టపెట్టబోమని, తమ పేదలకు అండగా నిలబడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. వి. హనుమంత రావు.. మాట్లాడుతూ" నేను అంబర్పేట్ లోనే పుట్టిన అంబర్‌పేట్‌లోనే పెరిగినా.. ఈ కుంటలో నా చిన్నప్పుడు బతుకమ్మ ఆడేది.. నేను ఈత కూడాకొట్టాను.. కానీ కొందరు ఈ కుంటను కబ్జా చేసి 30 ఏళ్ల గోస పెట్టారు..హైడ్రా వచ్చాక కబ్జాకారుల నుంచి విడిపించి బతుకమ్మ కుంటకు పునరుజీవ పోశారు. ఈ బాధ్యతను ముఖ్యమంత్రి డైనమిక్ ఆఫీసర్ రంగనాథ్‌కు అప్పచెప్పారు.. పదిహేను వేల కోట్ల విలువగల బతుకమ్మ కుంటను రంగనాథ్ కాపాడారు.. కిషన్ రెడ్డి ఎంతసేపు ఇక్కడే ఉంటాడు కానీ ఈ ప్రాంతాన్ని పట్టించుకోడు. దేశంలో కులగణన చేసిన మొదటి వ్యక్తి రేవంత్ రెడ్డి..కానీ బడుగు బలహీన వర్గాలు పైకి రాకుండా ప్రత్యర్థులు కోర్టుకు వెళుతున్నరు.. మూసి విస్తరణలో కొందరు ఇండ్లు పోతున్నాయి.. వారందరికీ కూడా ముఖ్యమంత్రి న్యాయం చేయాలని విజ్ఞప్తి" అని హనుమంతరావు పేర్కొన్నారు.

**బతుకమ్మకుంటకు వి.హనుమంతరావు పేరు**

బతుకమ్మ కుంటకు వి. హనుమంతరావు పేరు పెట్టాలని స్థానిక బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించగా ..తమకు పేరు పెట్టడానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆనాడు హనుమంతరావు సూచన మేరకే ప్రగతి భవన్ పేరును జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా మార్చామని, ఆయన గౌరవానికి భంగం కలగకుండా వారి సలహాలు సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క,జూపల్లి కృష్ణారావు, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు పాల్గొన్నారు.

**హైడ్రా పని తీరును చాటి చెబుబతూపాట ఆవిష్కరణ**

హైడ్రా కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పాట బతుకమ్మకుంట వద్ద మారుమోగింది. ఆదివారం బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పాటను విడుదల చేశారు. భూ కబ్జాదారుల భరతం పడుతూ హైడ్రా చేపడుతున్న చర్యలను ఈ పాట కళ్లకు కడుతోంది. నగర భవిష్యత్తుకు బాటలు వేసేలా చేపడుతున్న చర్యలను ఈ గీతం వివరించింది. ముఖ్యమంత్రి ర‌వంత్ రెడ్డి దిశానిర్దేశంలో హైడ్రా చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు అద్దం పట్టింది.

**మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి**

అంబర్‌పేట్‌లో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ)ని సీఎం రేవంత్రెడ్డి ప్రారంభించారు. నగరవ్యాప్తంగా రూ.4,739 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం 45 ఎస్టీపీల నిర్మాణం చేపడుతోంది. ఈ మేరకు డీపీఆర్ లు రూపొందించింది. ఇప్పటికే పూర్తయిన ఆరు ఎస్టీపీలను సీఎం రేవంత్రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మరో 39 కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మురుగునీటి శుద్ధి వ్యవస్థ గురించి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సీఎంకు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





సొంతూళ్లకు వెళ్లడానికి ఆదివారం జూబ్లీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

## న్యూయార్క్‌లా 'ఫ్యూచర్ సిటీ'

>> అందుకనుగుణంగా మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన అంతర్జాతీయ విమానాశ్రయం, సారవంతమైన భూములు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు ఈ సిటీకి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాడు 436 సంవత్సరాలక్రితం కులీ కుతుబ్ షా ఎంతో అద్భుతంగా మన హైదరాబాద్ నగరానికి శ్రీరాకం చుట్టారని గుర్తుచేశారు. సికింద్రాబాద్ ను నాటి 220 సంవత్సరాల క్రితం నిజాం నవాబ్ నిర్మించిన విషయాలన్ని ఆయన గుర్తుచేశారు. నవాబ్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌లను నిర్మిస్తే నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిలు సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్ ఔటర్ రింగు రోడ్డుల నిర్మాణంతో మన హైదరాబాద్ కు ఒక గుర్తింపును తీసుకువచ్చారని, అందులో బాగంగానే భవిష్యత్ కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం భారత ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని నాలుగు కోట్ల జనాభాలో అనేక మంది ఇతర దేశాల అద్భుతాలు, ఆ నగరాల మౌలిక సదుపాయాలను గుర్తుచేస్తూ అమ్మో... అయ్యో , దేవుడా అంటూ సింగాపూర్, దుబాయ్, జపాన్ ను జర్మని ఇలా అనేక దేశాల గురించి వర్ణించడం చూస్తున్నామని భవిష్యత్ లో మన ఫ్యూచర్ సిటీని ప్రపంచ దేశాలలోని అందరు కూడా మన ఫ్యూచర్ సిటీ అద్భుతాలను, అందమైన రోడ్లను, మౌలిక సదుపాయాలను వర్ణించే విధంగా తీర్చిదిద్దేందుకు మరో 10 సంవత్సరాలు అవకాశమివ్వాలని రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ గొప్ప నగరానికి అన్ని హంగులతో కూడిన రహదారులు, విద్యుత్, మెట్రో రైళ్ల తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రధాన జంక్షన్ నుండి బెంగుళూర్ వరకు రోడ్డు నిర్మాణంతో పాటు బుల్లెట్ రైలు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, అమరావతి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి అక్కడి నుండి మద్రాస్ నుంచి మరో బుల్లెట్ రైలును అనుసందానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. దక్షి ణ భారత దేశంలో పోర్టు అందుబాటులో లేని రాష్ట్రం ఒక తెలంగాణానే ఉందని, ఇక్కడి నుంచి ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి మీదుగా మచిలీ పట్నం పోర్టు వరకు రైలు మార్గాన్ని సైతం ఏర్పాటు చేయడానికి కేంద్రం నుండి అనుమతులు వచ్చాయని తెలిపారు.

**ఫ్యూచర్ సిటీ నాకోసం కాదు భవిష్యత్ తరాల కోసమే.**

తనకు ఇక్కడ భూములున్నందు వల్లే ఫ్యూచర్ సిటీ కడుతున్నారని అంటున్నారని పేర్కొన్నారు. తన కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని వివరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాఖాన్ పేటలో ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ(ఎఫ్సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయి. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలి. చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నాళ్లు న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం.. మనం కూడా అలా తయారు కావాలి కదా. నాకు పదేళ్ల సమయం ఇవ్వండి.. న్యూయార్క్ మరిపించే నగరం కడతామని తెలిపారు. 70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచం మాట్లాడుకునే పనులు చేయొద్దా? భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ? అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్(వయా అమరావతి)కి కేంద్రం ఒప్పుకొంది. ఇక్కడ 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది నా స్వప్నం. హైదరాబాద్లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటాం. ఈ విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం. దక్షి ణ భారతంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నాం. ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్సీడీఏ నుంచే చేపడతాం. సింగరేణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ ఆదారిటీ భవనాన్ని డిసెంబర్‌లోగా ప్రారంభిస్తామని, తాను నెలకు రెండు లేదా మూడు సార్లు ఇక్కడి భవనం నుంచి రాష్ట్ర పాలన వ్యవహారాలను కొనసాగిస్తానని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి, జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్ బాబులు ఫూచర్ సిటీ వ్యవహారాలను పరిశీలిస్తుంటారని ఆయన రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక్కడ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సముచిత న్యాయం కల్పిస్తామని, వారికి ప్లాట్లు ఇతర నష్టపరిహారాన్ని అందించడానికి మహేశ్వరం ఇంచార్జి కెఎల్ఆర్, ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, స్థానికంగా ఫ్యూచర్ సిటీ రైతుల సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని, వారికి అందుబాటులో ఉంటూ వారికి చేయూతనివ్వాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో భూములను కల్పోయిన రైతులకు పట్టాలు, ప్లాట్లు పంపిణీ చేయడం జరిగిందని, వారికి ఇందిరమ్మ పథకం క్రింద ఇండ్లు నిర్మించేందుకు సైతం కృషి చేస్తామని తెలిపారు.ఈ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, కార్పోరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, రాంరెడ్డి, మాజీ శాసన సభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఫ్యూచర్ సిటీ డవలప్‌మెంట్ కమిషనర్ శశాంక, టీజీపీసీసీ చైర్ పర్సన్ నిర్మల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖాదీ యే ధరించాలి

>> విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని కోరారు. రానున్న రోజుల్లో వరుసగా పండుగలు ఉన్నాయి. ప్రతి పండుగకి మనం వస్తువులను కొనుగోలు చేస్తాం. ఈసారి జీఎస్టీ ఆదా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఒక బలమైన సంకల్పంతో పండుగలను మరింత ప్రత్యేకంగా మార్చొచ్చు. ఈ దఫా పండుగలను స్వదేశీ ఉత్పత్తులతోనే జరుపుకుంటామని నిర్ణయించుకుంటే, పండుగ తాలుకా సంతోషం మరింత రెట్టింపు అవుతుంది. షాపింగ్ చేసే సమయంలో ఒకల్ ఫర్ లోకల్ మంత్రాన్ని గుర్తుంచుకోవాలి. దేశంలో తయారైన వస్తువులనే కొనండి. చేనేత, హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులనే ఇంటికి తీసుకెళ్లండి. భారత పౌరులు కష్టపడితయారు చేసిన వస్తువులనే వినియోగించండి. అంతర్జాతీయ పండుగగా ఛట్ పూజ మారుతుంది. కొంతకాలం క్రితం మా ప్రభుత్వం చొరవ వల్లే కోల్‌కతా దుర్గాపూజను యునెస్కో జాబితాలో చేర్చారని మోడీతెలిపారు.

## ధర్మయుద్ధం సక్సెస్

>> నుండి తొలగించాలని కోరుతూ గోండ్, కోయ, నాయకపోడు, పర్ధాన్, కొలాం, ఆంధ్, తోటి, కొండరెడ్డి, చెంచు 9 తెగలు భద్రాచలంలో ఆదివారం చేపట్టిన ధర్మయుద్ధం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు సుమారు 50వేల మందికి పైగా తరలివచ్చారు. దీంతో పట్టణ పురవీధులన్నీ ఆకుపచ్చని జెండాలతో రెపరెపలాడాయి. డా.బిఆర్ అంబేద్కర్ తో పాటు ఆదివాసీ నాయకులైన కొమరం భీమ్, గంటం దొర, మల్లు దొర, అల్లూరి సీతామరాజు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైధానంలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో వేలాదిగా ఆదివాసీలు కదిలివచ్చారు. సభ ప్రారంభ సూచితకంగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో బాపూరావు మాట్లాడుతూ... లంబాడీలు దొడ్డిదారిలో గిరిజన జాబితాలో వచ్చి చేరి నిజమైన ఆదివాసీల హక్కులను, రాజ్యాంగం ప్రకారం అందాల్సిన ఫలాలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. లంబాడీలు గిరిజనులుగా చెలామని అయ్యేందుకు ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవని, దీనిని కోర్టులో సవాల్ చేయగా వాదోపవాదాలు సాగుతున్నాయని చెప్పారు. వాస్తవిక ఆధారాలతో ఆదివాసీ నాయకులు న్యాయ పోరాటాలు సాగిస్తున్నారని, ప్రధాని నరేంద్రమోడి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజాలను చిత్తశుద్ధితో కోర్టుకు సమర్పించాలని కోరారు. మాజీ ఎంపి సీతారామ్ నాయక్ అవకాలు చెవాకులు పేలుతున్నాడని, అడ్డదారిలో తమ హక్కులను అనుభవిస్తూ ఇష్టాను సారంగా పేలితే ఆదివాసీ జనాభా ఇక చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఆదివాసీల్లోనే లంబాడీలకు కోవర్టులుగా పనిచేసే ద్రోహులు ఉన్నారని, అలాంటివారితో తస్మత్ జాగ్రత్త అన్నారు. భద్రాచలంలో మొదలైన ధర్మయుద్ధం లంబాడీల గుండెల్లో గుబులు పుట్టిస్తోందని, సమస్య పరిష్కారం కాకుంటే ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మేడారం, హైదారాబాద్ లో పది లక్షల మందితో సభలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, రేగా కాంతారావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఆదివాసీలు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇదే విషయాన్ని చర్చిస్తామని పొదెం, బిఆర్ఎస్ అధిష్టానం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు రేగా స్పష్టం చేశారు. అనంతరం ఉస్మానియా విద్యార్థి జేఏసి నాయకుల మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... అసలైన ఆదివాసీల ఉద్యోగ ఉపాధి అవకాశాలను దొడ్డిదారిన లాక్కుని అనుభవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పొడియం బాలరాజు, కల్లూరి జయబాబు, కొర్సా జేజే రాంబాబు, పూనెం శ్రీనివాస్, తెల్లం వెంకటేశ్వర్లు, తెల్లం రమణయ్య, ముర్రంవీరభద్రం, ముర్ల రమే,వ, కోవా దలవత్ రావు, తెల్లం సీతమ్మ,పూనెం శ్రీను, పూనెం కృష్ణ దొర తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌డిఎఫ్‌సి డిఐఎఫ్‌సి శాఖపై ఆంక్షలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకుకు దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ ఊహించని షాకిచ్చింది. హెచ్‌డిఎఫ్‌సీ దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ (డీఐఎఫ్‌సీ) బ్రాంచ్‌పై ఆంక్షలు విధించింది. ఈ శాఖలో కొత్త కస్టమర్లను చేర్చుకోవడని నిషేధం పెట్టింది. 2025, సెప్టెంబర్ 25 నాటికి కస్టమర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన వారు మినహా ఆ తర్వాత కొత్తగా కస్టమర్లను చేర్చుకోవడానికి అనుమతి లేదని తెలిపింది. ఈ మేరకు డీఎఫ్‌ఎస్‌ఏ అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అక్కడి బ్రాంచ్‌లో కొత్త రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. 'హెచ్‌డీ ఎఫ్‌సీ బ్యాంక్ దుబాయ్‌లోని డిఐఎఫ్‌సీ బ్రాంచిలో కొత్తగా ఆర్థిక ఉత్పత్తులపై సలహా లివ్వడం, ఇన్వెస్ట్‌మెంట్ డీల్స్, క్రెడిట్ సలహాలు ఇవ్వడం, కస్టడీ సర్వీసుల వంటి ఆర్థిక సేవలు వెంటనే ఆపే యాల్సి ఉంటుంది. బ్యాంక్ ఆర్థిక ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొనడానికి వీలు లేదు. అయితే, ఇప్పటికే ఖాతా ఉన్న కస్టమర్లకు మాత్రం యథావిధిగా బ్యాంకింగ్ సేవలు కొనసాగించవచ్చు. గతంలో సేవలు పొంది, పూర్తిగా రిజిస్టర్ కాని ఖాతాదారులకు సైతం బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి. కానీ కొత్త కస్టమర్లకు మాత్రం ఎలాంటి సేవలు ఉండవు. డీఎఫ్‌ఎస్‌ఏ ఆదేశాలు బ్యాంక్ ఆర్థిక స్థితిపై పెద్దగా ప్రభావం చూపవనిహెచ్‌డీఎఫ్‌సి పేర్కొంది. ఈ శాఖ వ్యాపారం తమ బ్యాంక్ మొత్తం వ్యాపార కార్యకలాపాల్లో చాలా చిన్న భాగమని వెల్లడించింది. 2025 సెప్టెంబర్ 23 నాటికి ఈ శాఖలో1,489 మంది కస్టమర్లు రిజిస్టర్ అయ్యారని వివరించింది. డీఎఫ్‌ఎస్‌ఏ ఆదేశాలు ఈనెల 26వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. డీఎఫ్‌ఎస్‌ఏ లిఖితపూర్వకంగా ఆదేశాలు సవరించే వరకు లేదా రద్దు చేసే వరకు ఆంక్షలు కొనసాగు తాయి. కస్టమర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమ స్యలు, సరిగ్గా రిజిస్టర్ కాని కస్టమర్లకు సేవలు అందించడం వంటి కారణాలతో డీఎఫ్‌ఎస్‌ఏ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీపై నలుగురు ప్రవాస భారతీయులు తమ ఫిక్సెడ్ డిపాజిట్లను సదరు బ్యాంకు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదు చేశారు. నాగ్‌పూర్, చండీగఢ్, గుర్గావ్‌లో ఆయా ఫిర్యాదులు ఫైల్ అయ్యాయి. క్రెడిట్ స్యూస్ అదనపు టైర్ వన్ బాండ్లకు చెల్లించేందుకు బ్యాంకు మిడిల్ ఈస్ట్ రూ. 2530 కోట్ల డిపాజిట్లు దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. జూలైలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాతే డీఎఫ్‌ఎస్‌ఏ సైతం చర్యలు తీసుకోవడం గమనార్హం.

## అమెరికాను అతలాకుతలం చేస్తున్న 'స్ట్రాటస్' వైరస్

**న్యూయార్క్, సెప్టెంబరు 28:** ప్రపంచాన్ని అతలా కుతలం చేసిన కోవిడ్19 మహమ్మారి మళ్లీ కలవరపెడుతోంది. కొత్తగా ఎక్స్‌ఎఫ్‌జి వేరి యంట్ ఉద్భవించింది. దీనికి స్ట్రాటస్ అని పేరు పెట్టారు. ఇదే ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. ఈ వేరియంట్ ఈ సంవత్సరం జనవరిలో తొలిసారిగా ఆగ్నేయాసియాలో వచ్చింది. ఇప్పుడు ప్రపంచంలోని అనేక దేశాలకు వ్యాపించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ఓ) ప్రకారం, ఇది జూన్ నాటికి 38 దేశాలకు వ్యాప్తి చెందింది. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భారత దేశంతో సహా ప్రపంచ వ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చ రిస్తున్నారు. స్ట్రాటస్ వేరియంట్ తీవ్రస్థాయిలో వ్యాప్తిచెందుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు. గతంలో వచ్చిన నింబస్ వేరియంట్ (ఎన్‌బీ 1.8.1) చాలా వేగంగా వ్యాపించి, గొంతు నొప్పిని తీవ్రంగా కలిగించింది. ఇప్పుడు స్ట్రాటస్ వేరియంట్ కూడా వేగంగా వ్యాపిస్తూ భిన్న రూపాల్లో లక్షణాలను చూపుతోంది. అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ, మిచిగాన్, వైస్కాన్సిన్, మిన్నెసోటా, డెలవేర్, వర్మోంట్, ఉత్తర డకోటా, దక్షిణ డకోటా వంటి 9 రాష్ట్రాల్లో కోవిడ్19 కేసులు ఆకస్మాత్తుగా



పెరిగాయని యుఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసిపి) తెలిపింది. ఈనెల 25 నాటికి, స్ట్రాటస్ (ఎక్స్‌ఎఫ్‌జి) అమెరికాలో 78%కేసులకు కారణంగా ఉంది. ఇది ఎల్ఎఫ్.7, ఎల్పీ.8.1.2 అనే రెండు ఓమిక్రాన్ సబ్‌వేరియంట్‌ల రీకాంబినేషన్ (హైబ్రిడ్) రూపం. ఈ మ్యుటేషన్లు స్పైక్ ప్రోటీన్‌లో జరిగాయి. శ్వాస ఆడకపోవడం లేదా ఛాతీ బిగుతుగా అనిపించడం, గొంతు నొప్పి [illegible] గొంతులో అనిపించడం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, కడుపు నొప్పి, వాంతులు లేదా విరోచనం, మానసిక అలసట, ఏకాగ్రత లోపం, రుచి లేదా వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. నింబస్‌లా గొంతు నొప్పి మరింత తీవ్రంగా ఉండవచ్చు. అయితే, సిడి సిపి, డబ్ల్యుహెచ్ఓల ప్రకారం ఇతర వేరి యంట్‌లతో పోలిస్తే ఇందులో ప్రత్యేక లక్షణాలు లేవు. చాలా కేసులు స్వల్పస్థాయిలో ఉన్నాయి. ముఖ్యంగా వ్యాక్సిన్ వేయించుకున్న వారికి లక్షణాలు పెద్దగా కనిపించట్లేదు. మరణాలకు దారి తీసే స్థాయిలో ఇది లేదు. కానీ ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్ట్రాటస్ 22.7% సీక్వెన్స్‌లకు కారణమ వుతోంది.

# వానలతో దెబ్బతిన్న పంటలు..

### సోయా పెట్టుబడి సైతం పోయె..

### కోతకుముందే సోయలో మొలకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** తెలంగాణలో కురుస్తున్న అధిక వర్షాలతో వరి పంటలు మినహా మిగితా పంటలు వ్యవసాయక్షేత్రాల్లోనే దెబ్బ తింటు న్నాయి. తెలంగాణలో ఈ యేడు జూన్, జూలై నెలలో అతితక్కువ వర్షపు రోజులు నమోదు కాగా ఆగస్టు సెప్టెం బరు నెలలలో అత్యధిక వర్షపు రోజులు నమోదైనాయి. తెలంగాణలో సగటున 77 వర్షపురోజులు ఉంటే అందులో సగానికిపైగా ఆగస్టు,సెప్టెంబరులోనే నమోదయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఇంకా మూడు వారాల్లో చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడుతుండటంతో పత్తి చేలలో నీరు చేరి ఎర్రబడిపోతున్నది. అంతే కాదు అనేక రకాల తెగుళ్ళు పంటలకు పడుతున్నాయి. పత్తి కాయలపై నల్లటి బూజు కూడా వస్తోన్నది. తెలంగాణలో ఖరీఫ్‌లో వరి 65లక్షల ఎకరాలలో, పత్తి 45లక్షల ఎకరాలలో, మొక్కజొన్న ఐదులక్షల ఎకరాలలో,కందులు ఐదులక్షల ఎకరాలలో సోయా మూడున్నరలక్షల ఎకరాలలో సాగుచేశారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామా బాద్ జిల్లాలో ప్రధానంగా ఈ పంటను సాగుచేశారు. వరుసగా పడుతున్న భారీ వర్షాలకు సోయ పంట పూర్తిగా ధ్వసమైంది. సోయకు మద్దతు ధర రూ 5328 ఉన్నప్పటికి మంచిగా కాలం అయినప్పుడుకూడా వ్యాపారులు సరైన ధర పెట్టరు. ఇప్పుడు సోయా గింజలకు మొలకలు వస్తున్నాయి. పంట చేతికి వచ్చే తరుణంలో మొలకలు రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బీమా జాడ లేదు. అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.తెలంగాణ లో వరి,పత్తి, కందులు తరువాత అత్యధికంగా సోయా సాగు చేస్తారు. ఆది లాబాద్ జిల్లాలో ఈ ఏడాది 60వేల ఎకరాల్లో, నిజా మాబాద్‌లో 70వేల ఎకరాలకు పైగా సాగయింది. గతంతో పోలిస్తే సాగును తగ్గించారు. సీజన్ ప్రారం భంలో అనుకూలంగా వర్షాలు కురియడంతో పంట ఏపుగా పెరిగింది. కాత బాగుండటంతో ఆశించిన దిగు బడి వస్తుందని రైతులు ఆనంద పడ్డారు. కోత దశలో కురిసిన వర్షాలు రైతులను నిండా ముంచాయి. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ ఏడాది సాగు చేసిన సోయాలో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.తెగుళ్ల గుర్తిం చడంలో జాప్యంతెలంగాణ వ్యాప్తంగా వానాకాలం సీజన్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయింది. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోని 14 మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదు కావడంతో పంటలను పలు రకాల తెగుళ్లు ఆశించాయి. సోయాకు కొత్త తెగులు ఆశించింది. దాన్ని గుర్తించడంలో రైతులు జాప్యం చేయడంతో నష్టం అప్పటికే జరిగిపోయింది. ప్రస్తుతం సోయా కాత దశలో ఉంది. ఆదిలాబాద్, నిజామాబాద్ జగిత్యాల జిల్లాలలో వారం రోజుల్లో కోతలు పూర్తయ్యేవి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటకు భారీ నష్టాన్ని చేకూర్చాయి.

# నటితో నిశ్చితార్థం.. ఇన్‌స్టాలో వీడియో పోస్ట్‌చేసి యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ముంబై నటితో నిశ్చితార్థం చేసు కున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ముంబైకి చెందిన నటి సోహానికుమారి జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో నివసిస్తుంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన సావాయి సింగ్‌తో స్నేహంపెరిగి ప్రేమగా మారగా ఇద్దరు జూలైలో నిశ్చితార్థం చేసుకున్నారు. కాగా శనివారం ఉదయం సమీప ప్రాంతంలో నివసించే సావాయిసింగ్ ఆమె నివాసానికి రావడంతో ఇద్దరు కలిసి కాఫీ తాగారు. తర్వాత ఇద్దరు తమతమ కార్యాలయాలకు వెళ్లారు. సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి వచ్చిన సోహాని తలుపుతీసి లోపలికి వెళ్లగా డైనింగ్‌హాల్‌లో సావాయిసింగ్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఉదయం 11.47 గంటలకు సావాయి సింగ్ వెనుక ద్వారం ద్వారా ఇంట్లోకి వెళ్లినట్లు గుర్తించారు. అంతకుముందు అతని ఇన్‌స్టాగ్రామ్ పేజీలో 'నేను జీవితంలో చాలాతప్పులు చేశాను, ఇకముందు అలాంటి తప్పులు చేయన్న' అంటూ విడియోను పోస్ట్‌చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాగా మాజీ స్నేహితురాలితో ఉన్న ఆర్థిక సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. సోహా ని ఫిర్యాదుమేరకు పోలీసులు ప్రాథమికంగా అనుమానస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ఆన్‌లైన్ వేదికగా కలిగిన సంస్థ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే వైద్యుడిగా పోలీసులు గుర్తించారు.

# ఎదుగుదల లేని పంటలు

### యూరియా కొరత ఎఫెక్ట్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజను ప్రారంభం నుండే ఇటీవల వరకూ యూరియా కొరతతో అన్నదాతలు సతమతమవుతున్నారు. సకాలంలో సరిపడా యూరియా అందకపోవడంతో ఆశించిన మేరకు పంట దిగుబడులు రాకపోవచ్చని రైతాంగం ఆందోళన చెందుతోంది. యూరియా సాగు మొదలై మూడు నెలలు అయినా పంట ఎదుగుదల లేదని రైతులు వాపోతున్నారు. నానో యూరియా పిచికారి చేసినా ప్రయోజనం ఉండటం లేదంటున్నారు. పచ్చదనం వస్తుందే తప్ప పైరు ఎదుగుదల కనిపించడం లేదని చెబుతున్నారు. యూరియా సరిపడా ఇస్తేనే పంట దిగుబడులు వస్తాయని, సకాలంలో వేయాల్సిన ఎరువులు అందుబాటులో లేక వరి చేన్లు ఎర్రబారుతున్నాయి. మొక్కజొన్న ఎదుగుదల లేదు. కంకి గింజలు సరిగ్గా రావటం లేదు. యూరియా వేయకపోవడంతో బలం లేక కంకులు సరిగ్గా పడటం లేదు. పత్తి పరిస్థితి కూడా ఇంతే ఉందని రైతుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1.33 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. దీనిలో వరి అత్యధికంగా 67 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు.

అలాగే, పత్తి 50 లక్షల ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇంత వరకూ 46 లక్షల్లో, మొక్కజొన్న 5.40 లక్షలకు 123.15 శాతం మేర 6.42 లక్షల ఎకరాల్లో, కంది 5.10 లక్షలకు 4.92 లక్షల ఎకరాలో ఇంత వరకూ సాగైంది. ఇక మిరప 1.90 లక్షలు, సోయాబీన్ 4.10లక్షలు, పెసలు 65వేలు, మినుములు 28వేల ఎకరాల్లో సాగవుతున్నట్టు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీటిలో మూడు నెలల్లో మొక్కజొన్న చేతికందాల్సి ఉండగా ఎదుగుదల లేక కొంత ఎత్తులోనే తల వెన్ను దశకు చేరుకుంది. అక్కడక్కడా పీచులు తీయగా కంకిలో నాణ్యత లేదని రైతులు చెబుతున్నారు. ఇక వరి పొలాలు సైతం యూరియా అందక ఎర్రబారుతున్నాయని వాపోతున్నారు. పొట్ట దశకు వచ్చే సరికి రెండు దఫాలుగా యూరియా వేయాల్సి ఉంటుంది. కానీ దుక్కి మందుతోనే రైతులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇక పూత దశకు చేరాల్సిన పత్తి చేలు ఎదుగుదల లేక అడుగు మేరనే పెరిగాయి. ఎక్కువ కాత రావడం లేదు. ఇప్పుడిప్పుడే మిర్చి నాటుతున్నారు. యూరియా కొరత కారణంగా ఎకరానికి ఒక్క బస్తా కూడా వేయలేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. పోడు వ్యవసాయం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. యూరియాకు బదులు నానో యూరియా పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ అంటుండగా, రైతులు మాత్రం అందుకు ముందుకు రావడం లేదు. నానో యూరియా పిచికారి చేస్తే పచ్చదనం వస్తుందే తప్ప ఎదుగుదల లేదంటున్నారు. ఇప్పటికే అదను దాటి పోతోందని, ప్రయివేటుగా కూడా యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా సేద్యంపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఈసారి ఆశించిన పంట దిగుబడులు రావేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# గణనీయంగా తగ్గిపోయిన మూసీ వరద

### 33 వేల క్యూసెక్కుల నుంచి 3 వేలకు తగ్గిన వరద

### ఊపిరి పీల్చుకుంటున్న పాతబస్తీ ప్రజలు

**హైదరాబాద్ (నార్సింగి), సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్ లలో చేరింది. ఈ రెండు జలాశయాలలో నీటి మట్టం అంతకంతకు పెరిగిపోవడంతో జల మండలి అధికారులు గంట గంటకు గేట్లను ఎత్తుతూ పోయారు. శుక్రవారం రాత్రి 8.గంటలకు గండిపేట వద్ద ఉన్న మొత్తం 15.గేట్లను 9.ఫీట్ల మేర, హిమాయత్ సాగర్ వద్ద 11.గేట్లు 6.ఫీట్ల మేర ఎత్తి మొత్తం 33.వేల క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదిలిపెట్టారు. దీంతో మూసీ నది మహోగ్ర రూపం దాల్చి, తన పరివాహక ప్రాంతాలలో ఉన్న ఇళ్లు, గుళ్ళు, బ్రిడ్జిలు, స్మశాన వాటికలు, దోభీఘాట్‌లు, అన్నదాన సత్రాలు ఇలా అన్నింటిని ముంచెత్తింది. శుక్ర వారం రాత్రంతా వరదనీరు ఇళ్లలోకి వచ్చిన వందలాది మంది ప్రజలు జాగారం చేశారు. మంచిరేవుల, బైరాగిగూడ, లంగర్‌హౌస్, కార్వాన్, గిర్కాపల్లి, జియాగూడ, పురాణాపూల్ ప్రాంతాలలోని ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికారు. శుక్రవారం రాత్రి 8.గంటల నుంచి శనివారం ఉదయం 9.గంటల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగింది. శనివారం వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు జంట జలాశయాల గేట్లను క్రమంగా మూసివేస్తూ వచ్చారు. ఆదివారం వర్షం కురువకపోవడంతో గండిపేట వద్ద 4.గేట్లను 2.ఫీట్ల మేర ఎత్తి 920.క్యూసెక్కులు, హిమాయత్ సాగర్ వద్ద 2.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి 1981.క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదులుతున్నారు. శుక్రవారం రాత్రి 33.వేల క్యూసెక్కులతో ఉగ్ర రూపం దాల్చిన మూసీ నది ఆదివారం కేవలం 3.వేల క్యూసెక్కుల నీటితో పారు తుంది. ఏకంగా 30.వేల క్యూసెక్కుల నీరు తగ్గడంతో సాధారణ స్థితిలోనే మూసీ పారుతుంది. దీంతో పాతబస్తీ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం

### శ్రీశైలం డ్యాంకు 5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

### 10గేట్లు 23 అడుగులు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల

### 882.70 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

### జూరాలకు భారీ వరద.. 39 గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మకు వరద ఉధృతి పెరుగుతున్నది. నది ఉగ్రరూపం దాల్చుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్నప ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. ఆదివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 882.70అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 202.9673టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 5,20,552క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 79268క్యూసెక్కులు,హంద్రీ నుంచి 27000క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 64,759క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 23అడుగులు ఎత్తి 5,18,650క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 5,93,680క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.

జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల గేట్లు ఎత్తివేశారు. జూరాల ప్రాజెక్టుకు 5,05,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా, 39గేట్లు ఎత్తి దిగువకు 5,17,473క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 2.755టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అవుట్‌ఫ్లో 5,17,495క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

# బీహార్‌లో జరిగిన ఓటర్ల తొలగింపు, ఓటు దోపిడీ ఘటనలతో ఇసిపై అపనమ్మకం

### సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** బీహార్‌లో జరిగిన ఓటర్ రిమూవల్, ఓటు దోపిడీ ఘటనలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం రోజురోజు తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నా యని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆది వారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం (టిఎస్‌డిఎఫ్), జాగో నావ తెలంగాణ ఆధ్వ ర్యంలో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడు కుందాం' సేవ్ డెమోక్రసి) సదస్సు ఘనంగా



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్

జరిగింది. స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్‌కు ప్రధాన కమిషనర్ నియామక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, మరీ ముఖ్యంగా న్యాయమూర్తులు పదవివిరమణ తర్వాత పదవులు పొందడం వలన స్వతంత్రంగా వ్యవహరించక పోవడంతో పాటు ప్రజల హక్కులను కాపాడలేక పోతున్నారని అన్నారు. న్యాయస్థానాల్లో కోర్టుల సంఖ్య పెరగాలని, జ్యుడీషియల్ అపాయింట మెంట్ కమిషన్ అవసరమని చెప్పారు. దేశాన్ని శాస్త్రీయ దృక్పథం లేకుండా పూర్తిగా అంధ విశ్వాసాలతో నింపుతున్నారని అన్నారు. సిపిఐ జాతీయ నేత, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ స్వాతంత్రం కాపాడటం అత్యవసరం, అలాగే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వలన మాత్రమే మతోన్మాద శక్తులను ఎదుర్కొగలమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు ఐక్యంగా కలిసి పోరాడితేనే మార్పు సాధ్యమని, ప్రస్తుతం లేబర్ చట్టాలలో జరుగుతున్న ప్రతికూల మార్పులు కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నందువల్ల ఐక్య పోరాటం తప్పనిసరి అని అన్నారు.

# ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణ వాయిదా వేయండి

### స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేసిన విహెచ్‌పి

**హైదరాబాద్,సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఉదయం 10 గంటలకు జరనున్న శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తెలంగాణ విశ్వహిందూ పరిషత్ కోరింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి విహెచ్‌పి జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్,తెలంగాణ విహెచ్‌పి కార్యదర్శి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సోమవారం సద్దుల బతుకమ్మ ఉన్నందున ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు.


## AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK

(షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

నమోదిత కార్యాలయం : 19-ఎ, ధులేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా)

(CIN : L36911RJ1996PLC011381)

అనుబంధం IV (నియమం 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

ఇది ఇలా ఉండగా, "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002" కింద షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ అయిన AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002తో చదవబడే సెక్షన్ 13 కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని దిగువ సంతకందారు 17.05.2025 తేదీన Ref నెం.: CB/SAR/13-2/BB/MAY-2025/12 ద్వారా డిమాండ్ నోటీసు జారీ చేశారు. లోన్ ఖాతా నం. 6666666666180813 రుణగ్రహీత/గ్యారంటర్లు/తనఖాదారులు SLN ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా దీని డైరెక్టర్లు శ్రీ మోడిగిరి ఓబులేష్ & శ్రీ మోడిగారి వెంకటేశ్వర్లు (రుణగ్రహీత) శ్రీ మోడిగిరి ఓబులేష్ S/o. శ్రీ ఓబులేష్ మోడిగిరి (హామీదారు/తనఖాదారు) శ్రీమతి మోడిగిరి అనురాధ W/o. శ్రీ మోడిగిరి ఓబులేష్ (హామీదారు/తనఖాదారు) శ్రీ మోడిగిరి వెంకటేశ్వర్లు S/o. శ్రీ మోడిగిరి ఓబులేష్ (హామీదారు) శ్రీ మోడిగారి వెంకటేశ్వర్లు S/o శ్రీ ఓబులేష్ మోడిగారి (హామీదారు). గతంలో శ్రీ లక్ష్మీ నరసింహా ఏజెన్సీలుగా పిలువబడే SLN ప్రాజెక్ట్స్, దాని భాగస్వాములు శ్రీ మోడిగిరి ఓబులేష్ & శ్రీమతి మోడిగిరి అనురాధ (గ్యారంటర్/తనఖాదారు) ద్వారా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని రుణం కోసం తిరిగి చెల్లించాల్సిందిగా పిలుపుఇవ్వడమైనది. ఖాతా నంబర్: 6666666666180813 రూ.24,17,97,406/- (రూపాయలు ఇరవై నాలుగు కోట్ల పదిహేడు లక్షల తొంభై ఏడు వేల నాలుగు వందల ఆరు మాత్రమే) 17.05.2025 నాటికి మొత్తం బకాయిలు (ఇందులో అసలు, వడ్డీ, జరిమానాలు మరియు అన్ని ఇతర ఛార్జీలు ఉన్నాయి) మరియు నోటీసు తేది/అందుకున్న తేదీ నుండి 60 రోజుల్లోపు పూర్తిగా చెల్లించే వరకు వడ్డీ మరియు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

రుణగ్రహీత/తనఖాదారుడు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, 2025 సెప్టెంబర్ 24వ తేదీన, పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) మరియు నిబంధనలలోని నిబంధన 8 కింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద వివరించిన ఆస్తిని కింద సంతకందారుడు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీత/తనఖాదారునికి మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడుతోంది.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది. ముఖ్యంగా రుణగ్రహీత/గ్యారంటర్/తనఖా పెట్టినవారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క రుణ మొత్తానికి ఛార్జీకి లోబడి ఉంటాయి. ఖాతా నంబర్. 6666666666180813. 23 సెప్టెంబర్ 2025 నాటికి రూ.25,85,70,799/- (రూపాయలు ఇరవై ఐదు కోట్ల ఎనభై ఐదు లక్షల డెబ్బై వేల ఏడు వందల తొంభై తొమ్మిది మాత్రమే) మరియు పూర్తి చెల్లింపు వరకు దానిపై తదుపరి వడ్డీ మరియు ఖర్చులు ఉంటాయి.

స్థిరమైన ఆస్తుల వివరణ

1. ఆస్తి యొక్క మొత్తం స్వంత ఇల్లు/విల్లా నెం. 19, 483.33 చదరపు గజాలు కలిగి ఉంది. విల్లా/ప్లాట్ నెం. 19 కలిగి ఉంది, ఇది "సైప్రస్ పామ్స్" అని పిలువబడే గేటెడ్ కమ్యూనిటీలో భాగం, ఇది సర్వే నెం. 80/Aలో ఉంది, ఇది తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, హాఫీజ్‌పేట్ గ్రామంలో ఉంది. శ్రీ మోడిగిరి ఓబులేష్ & శ్రీమతి మోడిగిరి అనురాధ స్వంతం. సరిహద్దులు క్రింది విధంగా :

తూర్పు: విల్లా నెం. 18, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: విల్లా నెం. 20.

2. ఆ ఆస్తి అంతా, స్వంత ఇల్లు/విల్లా నం. 84, 429.16 చదరపు గజాలు కలిగి, గేటెడ్ కమ్యూనిటీలో భాగంగా ఉంది, దీనిని "సైప్రస్ పామ్స్" అని పిలుస్తారు, సర్వే నం. 80/Aలో, హాఫీజ్‌పేట్ గ్రామంలో ఉంది, ఇది తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం. శ్రీ మోడిగిరి ఓబులేష్ & శ్రీమతి మోడిగిరి అనురాధ స్వంతం.

తూర్పు: విల్లా నెం. 79, పడమర: రోడ్డు, ఉత్తరం: విల్లా నెం. 85, దక్షిణం: విల్లా నెం. 83

3. ఆ ఆస్తి యొక్క మొత్తం ఫ్లాట్ నం. 1504, 1695 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిన ప్రాంతం. టవర్ నం. 18, 15వ అంతస్తు/ 15వ స్థాయిలో "ప్రజయ్ మెగాపోలిస్" అనే పేరు మరియు శైలిలో ఉన్న భవనం, సర్వే నం. 78, హాఫీజ్‌పేట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, GHMC శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో, తెలంగాణ, రంగారెడ్డి జిల్లా. శ్రీ లక్ష్మీ నరసింహ ఏజెన్సీస్ యాజమాన్యంలో ఉంది, ప్రస్తుతం మెస్సర్స్. SLN ప్రాజెక్ట్స్ అని పిలుబడును.

తూర్పు: బహిరంగ ప్రదేశం. పడమర: కారిడార్ & బహిరంగ ప్రదేశం. ఉత్తరం: బహిరంగ ప్రదేశం. దక్షిణం: బహిరంగ ప్రదేశం.

4. ఆ ఆస్తి యొక్క మొత్తం ఫ్లాట్ నం. 104, మొదటి అంతస్తు/2వ స్థాయిలో 1695 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టవర్ నం. 18 భవనం "ప్రజయ్ మెగాపోలిస్" అని పేరు మరియు శైలిలో ఉంది, ఇది సర్వే నం. 78, హాఫీజ్‌పేట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, GHMC శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో, తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, శ్రీ లక్ష్మీ నరసింహ ఏజెన్సీస్ యాజమాన్యంలో ఉంది, ప్రస్తుతం మెస్సర్స్. SLN ప్రాజెక్ట్స్ అని పిలుబడును.

తూర్పు: బహిరంగ ప్రదేశం. పడమర: కారిడార్ & బహిరంగ ప్రదేశం. ఉత్తరం: బహిరంగ ప్రదేశం,దక్షిణం: బహిరంగ ప్రదేశం.

తేదీ: 24/09/2025 అధీకృత అధికారి


స్థలం: రంగారెడ్డి జిల్లా, తెలంగాణ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# మావోయిస్టులతో కాల్పుల విరమణ ప్రసక్తే లేదు

### ఆయుధాలు వీడి లొంగిపోతే ఒక్క బుల్లెట్ కూడా పేల్చరు

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** మావోయిస్టులతో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని, ఆయుధాలు వీడాల్సిందేనని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఆయుధాలు వీడితే ఒక్క పోలీసు బుల్లెట్‌ను కూడా పేల్చమని చెప్పారు. ఢిల్లీలో ఆదివారంనాడు 'నక్సల్ ముక్త్ భారత్' పై సెమినార్ ముగింపు సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, మావోయిస్టులు లొంగిపోతే స్వాగతిస్తామని, వారికి పునరావాసం కల్పిస్తామని అన్నారు. ఇటీవల కొంత గందరగోళం సృష్టించేందుకు ఒక లేఖ రాశారు. ఇంతవరకూ జరిగిందంతా పొరపాటని, లొంగిపోవాలని తాము అనుకుంటున్నందున కాల్పుల విరమణ ప్రకటించాలని అందులో కోరారు. దానికి నేను చెప్పే సమాధానం ఒకటే. కాల్పుల విరమణ ప్రసక్తే లేదు. లొంగిపోవాలని అనుకుంటున్నప్పుడు



కాల్పుల విరమణ అవసరం ఏముంది మీరు ఆయుధాలు వదిలి రండి. పోలీసులు ఒక్క బుల్లెట్ కూడా పేల్చరు అని అమిత్‌షా స్పష్టం చేశారు. మావోయిస్టుల కాల్పుల విరమణ ఆఫర్‌ను స్వాగతిస్తున్న వారిపై అమిత్‌షా మండిపడ్డారు. వామపక్ష తీవ్రవాదంపై చేపట్టిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను ఆపేయాలని ఇటీవల వామపక్షాలు ముఖ్యంగా సీపీఐ, సీపీఐఎంలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయని చెప్పారు. మావోయిస్టులను ఎందుకు రక్షించాలని వాళ్లు అనుకుంటున్నారు గిరిజన బాధితుల మానవ హక్కుల పరిరక్షణకు ఎన్జీవోలు ఎందుకు ముందుకు రావడం లేదు ప్రభుత్వానికి సుదీర్ఘ లేఖ రాసిన వాళ్లు ఎప్పుడైనా గిరిజన బాధితులపై ఒక ఆర్టికల్ రాయడం కానీ, ప్రభుత్వానికి సలహా కానీ ఇచ్చారా అని ప్రశ్నించారు. 2026 మార్చి 31 కల్లా వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా దేశాన్ని నక్సల్స్ బెడద నుంచి విముక్తి కల్పిస్తామని అమిత్‌షా పునరుద్ఘాటించారు. అయితే నక్సలిజంతో ప్రమేయమున్న వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేంత వరకూ నక్సలిజంపై పోరాటం కొనసాగుతుందని చెప్పారు. నక్సలైట్లను అరెస్టు చేసేందుకు, లొంగిపోయేలా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తాము తీసుకున్నామని, ఒక అవకాశం కూడా ఇచ్చామని చెప్పారు. లొంగిపోతే పునరావసం కల్పించే పాలసీని కూడా తెచ్చామని చెప్పారు. అయినప్పటికీ ఆయుధాలు తీసుకుని అమాయక ప్రజల ప్రాణాలు తీస్తామంటే భద్రతా దళాలకు వారిని మట్టుబెట్టడం మినహా మరో మార్గం ఉండదన్నారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం ఇస్తామని స్పష్టంచేశారు.

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# గుణపాఠం ఇంకెప్పుడు?

జనం పోగుబడినచోట రద్దీ ఏర్పడుతుంది. అలాంటిచోట గందరగోళం, తొక్కిసలాటకు ఆస్కారం ఉంటుంది. హడావుడి, ఆందోళనల మధ్య తొక్కిసలాటలు సర్వసాధారణం. అలా అని సరిపెట్టుకోవడం కన్నా గత అనుభవాల బేరీజుతో మరో దుస్సంఘటన జరగకుండా చూసుకోవడం విజ్ఞుల లక్షణం. ప్రతి దుస్సంఘటన మరో కొత్తదారికి మలుపు కావాలి. ఈ మధ్యకాలంలో సందర్భం, సమయం ఏదైనా ఇలాంటి సంఘటనలు జరిగి దాని వైఫల్యాలను పూస గుచ్చినట్లు బహిర్గతపరిచాయి. అన్ని సంఘటనల్లోనూ విషాదాన్ని. ముఖ్యంగా ప్రాణనష్టాన్ని చవిచూసాము. అవన్నీ మానవ తప్పిదాలు కారణంగా, నిర్వాహకుల నిర్లక్ష్యం వలన సంభవించినట్లు నిరూపితమయ్యాయి. దేవాలయాలు, జాతరలు, ఎన్నికల ప్రచారర్యాలీలు, సెలబ్రిటీలు హాజరయ్యే వేడుకల సందర్భంగా జనం పోగుబడినప్పుడు, అలాంటి ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగం మీద ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలు, జనసమ్మోహన యాత్రలు, రాజకీయ పక్షాల రకరకాల విన్యాసాలకు జనాల రద్దీని బట్టి పోలీస్ అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమిళనాడు కరూర్‌లో టీవీకె పార్టీ అధినేత సినీ యాక్టర్ విజయ్ ర్యాలీ సందర్భంగా కనీసం 40 మంది మృతి చెందారు. ఇక్కడి విషయం గురించి చర్చించుకోవాలంటే వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న వివరాలను బట్టి ఆ పార్టీ తమ ర్యాలీకి కేవలం 10 వేల మందిని వస్తారని అనుమతి తీసుకోగా, 27 వేలమంది జనం పిల్లాపాపలతో తరలివచ్చారు. అనుమతులిచ్చిన పోలీసు యంత్రాంగం కూడా స్వీయ అంచనాలు వేసుకునీ మరీ అనుమతులు ఇవ్వాలి. అవసరమైన భద్రత కల్పించాలి. అవన్నీ చేయకుండా వాళ్ల అంచనా మేరకు భద్రత కల్పించామని తేలికగా తీసిపడేయడం పోలీసు విధి, నిర్వహణ అనిపించుకోదు. విషాద ఘటనల నేపథ్యం, జనఅంచనాలు, ఏర్పాట్లు గురించి సమీక్షించి విశ్లేషిస్తే నేతలు, అధికారులు ఎవరికివారు తాజా దుస్సంఘటనకు తాము బాధ్యత కాదంటే తాము బాధ్యత కాదనే ధోరణితో ఉన్నారు. ప్రాణనష్టం సంభవించినపుడు కేవలం సంతాపాలు వ్యక్తం ఊరుకోగలరే తప్ప మరో ప్రమాదాన్ని నివారించే ప్రయత్నాలు చేయలేకపోతున్నారు. కనీసం వ్యవస్థను, ఆ వ్యవస్థలోని బాధ్యతారాహిత్యాన్నీ కూడా మందలించలేకపోతున్నారు. ఇదీ కలియుగ ధర్మం. మరోసారి అలాంటి దుస్సంఘటనలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న విషయంపై పర్యవేక్షణ లేక కనీసం సమీక్షలు జరిపిన సందర్భాలు కూడా కానరావు. తమిళనాట ఎంజీ రామచంద్రన్, కరుణానిధి, జయలలిత, రజనీకాంత్, కమల్ హాసన్, తాజాగా ఇప్పుడు దళపతి విజయ్‌లకు చెప్పుకో దగినంతమంది అభిమానులున్నారు. వారంతా రాజకీయ ప్రవేశమున్నవారే. పైగా వారివారి రాజకీయ ప్రచా రసభలకు భారీ బందోపస్తు అలవాటు పడినవారే. వారిని చూడగలగడం తమ అదృష్టమని, పూర్వజన్మ సుకృతమని భావించే అభిమానులే ఎక్కువమంది ఉన్నారు. రాజకీయాల్లోకి వచ్చే కథానాయకులకు ఆ మాత్రం ఫాలోయింగ్ ఉండడం కొత్తేమీ కాదు. అలాంటి రాష్ట్రంలో ప్రజాదరణ ర్యాలీ నిర్వహించుకోవల్సినప్పుడు ఆయా పార్టీ నిర్వాహకులకు, ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి బాధ్యత ఉంటుంది. వారు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఏమాత్రం ఆదమరచి ఉన్నా అనుకోని సంఘటనలు జరిగే వీలుంది. ఇప్పుడదే జరిగింది. కరూర్ ర్యాలీకి విజయ్ ఉదయం 12 గంటలకు వస్తారని ప్రకటించగా దాదాపు 7 గంటలు ఆలస్యంగా హీరో చేరుకున్నారు. వారానికి 2 రోజులు ప్రజల్ని కలిసేందుకు విజయ్ పర్యటన ప్రణాళిక ప్రకారమే ఈ కార్యక్రమం మొదలైంది. ఏమైతేనేం రాత్రి 7.20కి బస్ కరూర్‌చేరుకోగా విజయ్ ప్రసంగం ప్రారంభిస్తుండగానే, అంతవరకు వేచివున్న జనం తమ హీరోను చూడాలని ముందుకు కదిలారు. అందులో చిన్నపాప తప్పిపోయిందన్న మాటలు వినిపించగా జనంలో అలజడి బయలుదేరి తొక్కిసలాట జరిగింది. అప్పటికే నిరాహారంగా, కనీసం మంచినీళ్లు కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్న అభిమానులు స్పృహతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో విజయ్ మాట్లాడుతూ రేపటి అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే, డిఎంకెల మధ్యనే పోటీ ఉంటుందని, బీజేపీకి ఓటు వేయొద్దని, డిఎంకె, బీజేపీల మధ్య రహస్య ఒప్పందాలున్నాయని అన్నారు. ఇలాంటి రాజకీయ ప్రసంగంతో అలజడి పెరిగింది. తొక్కిలాస మొదలైంది. దాంతో ఊపిరాడక పదహారు మంది స్త్రీలు, ఎనిమిది మంది చిన్నారులు మృతి చెందారు. దాదాపు వంద మంది క్షతగాత్రులయ్యారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆ తర్వాత మరికొందరు చనిపోవడంతో ఆదివారం నాటికి మృతుల సంఖ్య నలభైకి పెరిగింది. సమయం, సన్నివేశం ఏదైనా అది దుర్ఘటనలకు దారి తీసిన సందర్భాలకు మసిపూసి మారేడుకాయ చేసినట్లుండకూడదు. దీని వలన ప్రజలకు కానీ, దుఃఖిత కుటుంబాలకు కానీ మేలు చేకూరదు. గతంలో ఎన్టీఆర్ వంటి అగ్రనేతలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ ప్రకటించి తెలుగునాట పల్లె పల్లెకూ రథయాత్ర చేసినప్పుడు కూడా మచ్చుకు ఒకటైనా దుస్సంఘటన నమోదు కాలేదు. కాగా నేడు టివికె పార్టీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం చెందినందునే చేదు అనుభవాన్ని ఎదురుచూడాల్సి వచ్చింది.

# ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి

*అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు. ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం. అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూపోయే కంపెనీలకు రాయితీలు ఇవ్వాలి. ఎక్కువ మందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానం కావాలి. యువతకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటు ప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి.*

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**

నేడు దేశంలో ఉత్పాదక రంగం కుదేలై ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వలన మేకిన్ ఇండియా లాంటి పథకాలు సఫలీకృతం కానందున అటు చైనా ఇటు అమెరికా నుంచి అనేక యంత్రాలు, యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోక తప్పడం లేదు. పారిశ్రామిక రంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడం వలన సరళీకృత ఆర్థిక విధానాల వలన జరిగిన ఫలితమిది. కుదేలైన తయారీ రంగం ఒకవైపు ఉండగా నేడు దేశానికి దిక్కుగా సేవల రంగం మాత్రమే ముఖ్యంగా ఐటీరంగం వలన మనం ప్రపంచంలో అగ్రదేశాల సరసన ఉన్నాం. ప్రపంచ దిగ్గజ కంపెనీలలో సైతం మన ఐఐటీ,ఎన్ఐటి,ఐఎంలలో చదివిన మన దేశపు విద్యార్థులే సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచ సాఫ్ట్వేర్ రంగంలో రాణించడం మనకు గర్వకారణం. దీని పునాదులు ఆనాడు ప్రభుత్వమే ఐఐటీలను ఎన్ఐటీలను స్థాపించి ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడం వలననే జరిగిందనేది మరువరాదు. ఐఐటీలలో ఎన్ఐటీలలోనూ చదువుకున్న యువత ప్రపంచ పెట్టుబడిదారుల దేశాలలో ఉద్యోగాలు పొందేందుకు వలసపోయి వీరంతా అమెరికా,బ్రిటన్, ఆస్ట్రేలియా, యూరప్, దేశాలలో ఆర్థికాభివృద్ధికి గణనీయమైన కృషిచేస్తున్నారు. ప్రపంచ అగ్రగామి కంపెనీలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, వంటి వాటి సీఈవోలుగా మనవారు ఉండటం సంతోషించదగ్గ విషయమే. కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో భారతదేశం ఒక కీలకమైన మలుపుదగ్గరఉన్నది. ఐటీ శక్తిగా మనదేశానికి ఎంతో ఖ్యాతి విశాలమైన సాంకేతిక ప్రతిభ ఉన్నప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇంకా సొంతంగా ఏఐ ప్లాట్ఫామ్లను అభివృద్ధి చేయలేదు. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. కానీ ఓపెనల్ నుంచి విడుదలైన చాట్‌జిపిటికు లేదా చైనాకు చెందిన డీప్సీక్ సమానమైన సొంత ఏఐ ఉత్పత్తులను మనం ఇంకా తయారు చేయలేదు. ఈ లోటు ఇప్పుడు మన ముందు ఒక పెద్ద సవాల్ నిలబెట్టింది. పెట్టుబడి పరిశోధనలతోపాటుప్రభుత్వ ప్రైవేటు సంస్థల మధ్య మరింత సమగ్ర సహకారం అవసరం. సరియైన మౌలిక సదుపాయాలు నిధులు లేకుండా స్వదేశీ ఏఐ అభివృద్ధి అసాధ్యం. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌పై మన దేశం స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం కన్నా తక్కువగానే ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. అంటే ఇక ఏఐ ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ రంగంపై విదేశీయులపై ఆధారపడలేం కదా? చైనా అయితే తన స్థూల జాతీయుత్పత్తిలో 2.43 శాతం కృత్రిమ మేధాపైన ఖర్చు చేస్తున్నది. చైనా కృత్రిమ మేధా రంగంలో అమెరికాతో దాదాపు సమాన స్థాయిని పొందడానికి రెండు అంశాలను కారణాలుగా చెప్పవచ్చు. మొదటిది వాణిజ్య సైనిక అనువర్తల అప్లికేషన్లో సెమీ కండక్టర్లను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు, పరికరాలు ఏఐ ప్రాసెసర్ల నుంచి హార్డ్వేర్ ఉత్పత్తులు ఏఐ మోడల్స్‌వరకు మొత్తం డిజిటల్ టెక్నాలజీ రంగంలో అవసరమైన అన్నిటిని విషయంలో స్వయం సమృద్ధిని, సాంకేతిక ఆధిపత్యాన్ని చేరుకోవడానికి చురుకైన స్థిరమైన జాతీయ విధానం కలిగి ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో మనదేశం కృత్రిమ మేధా అభివృద్ధికి చేపట్టవలసిన వ్యూహం ఇంతవరకు లేకపోవడం శోచనీయం. నేడు దేశంలో కృత్రిమమేధా ఆధారిత కంపెనీలలో ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. ఉద్యోగస్తులను తొలగిస్తున్నారు. కృత్రిమ మేధా అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఇటీవల టాటా కన్సల్టెన్సీ కంపెనీలో 12వేలమంది ఉద్యోగస్తులను తొలగించినారు. టెక్నాలజీ ఆధారిత కార్పొరేట్ సంస్థలు ఉపాధి అవకాశాలు కల్పించగలవా? మన యువతకు ఆ సాంకేతిక పరిజ్ఞానం



లేదుకదా? మూలధన సాంద్రత, ఉత్పత్తి పద్ధతుల ద్వారా కాకుండా శ్రమ సాంద్రత అంటేఎక్కువగా ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు పాలకులు ఎందుకు పోవడం లేదు. వీరికి దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య తెలియదా? ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలు ఇస్తామని కదా ప్రధానమంత్రి అయింది. ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా ప్రజల ఆదాయాలు పెంచడం ఇష్టం లేదా? కంపెనీల ఆదాయాలు పెరిగితే పాలకులకు ఎంత లాభాలు గిట్టుబాటు లభిస్తుందో తెలియదుగానీ ప్రజలకు మాత్రం వాళ్ల భూములు ఖనిజ సంపద, అటవీ సంపద పోగొట్టుకోవడం తప్పనిసరి అయింది. ఏఐ ఆధారిత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఎవరు వ్యతిరేకులు కారు. ఈ టెక్నాలజీని మన నిరుద్యోగులకు అందించితే తప్ప ఏఐ ఆధారిత కంపెనీలో ఏ ఒక్కరికి ఉద్యోగ కల్పన చేయలేవు. యువత నిరాశ నిస్పృహలతో పని, పాటలేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యంచేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతు న్నారు. అటు ఆర్థికాభివృద్ధికి ఇటు సామాజిక భద్రతకు నష్టం వాటిల్లేది యువతలోఅశాంతి హెచ్చరిల్లడంవల్లే కదా? యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలోమమేకం చేయగలిగితే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకక కనీస సంపాదనకు సైతం నోచుకోక దుర్భర పరిస్థితిలో మన యువత ఉండటం శోచనీయం. డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం చాలావేగంగా అభివృద్ధి చెందడం, జాబ్ మార్కెట్ కూడా సాంకేతిక విద్య అభివృద్ధి చెందడం వలన యువతకు అనుకూలమైన కావలసిన నైపుణ్యాలను కల్పించగలిగితే సాంకేతిక సాధికారికతతో దేశం మెరిసిపోతుంది. ఎందుకనగా ఇంజినీరింగ్ పట్టభద్రులు కూడా సగానికి పైగా నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో అత్యంత అల్ప స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలను కలిగిన దేశం మనది. మొత్తం శ్రామికులలో కేవలం 4.69 శాతం మాత్రమే శ్రామికులకు ఎంతో కొంత నైపుణ్యం కలిగి ఉన్నారు. మొత్తం శ్రామికులలో చైనాలో 24శాతం, అమెరికాలో 52శాతం, యునైటెడ్ కింగ్డమ్ 68శాతం, జర్మనీలో 75 శాతం, జపాన్‌లో 80శాతం, సౌత్ కొరియాలో 96శాతం శ్రామికులకు పూర్తి నైపుణ్యాలతో ఆర్థిక అభివృద్ధికి ఆయా దేశాలలో సహాయపడుతున్నారు. మన దేశంలో మాత్రమే అత్యంత తక్కువ స్థాయిలో నైపుణ్యం కలిగిన శ్రామికులు ఉన్నారు. కావున మనదేశంలో శ్రామికుల నైపుణ్య శాతం పెంచాలి. ముఖ్యంగా యువత సాంకేతిక నైపుణ్యాన్ని పెంచగలిగితే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుంది. దేశాభివృద్ధికి జనాభా నిధిగా ఉండటం మూలాన ఉపాధి అవకాశాలు కల్పించ లేనందువలన ఉపాధి రంగంలో వీరిశాతం కేవలం జనాభాలో రెండు శాతం మాత్రమే. వీరు మాత్రమే నైపుణ్యాలు అభివృద్ధి శిక్షణపొంది ఉన్నారు. కావున యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం తక్షణ ఆవశ్యకత ఉన్నదని గమనించాలి. అప్పుడే మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చెందగలదు. యునెస్కో లెక్కల ప్రకారం మన దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యాథమెటిక్స్ కోర్సులు చేస్తున్నవారు ప్రపంచంలోనే ఎక్కువ. సేవల రంగాలకు సంబంధించిన విద్యా సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుంటున్నవారు మనదేశంలో 26 మిలియన్లు దాటారు. తద్వారా దేశంలో ఎలక్ట్రానిక్స్ తదితర ఉత్పత్తులను చేయవచ్చును. అలా చేయకుండా మన ప్రభుత్వం ఈ వస్తువులను ఎక్కువగా విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. అధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రోత్సాహకాలు పారిశ్రామిక రంగానికి కల్పించాలి. 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25శాతానికి తగ్గించారు. ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడి పెట్టాలన్నది దీన్ని ఉద్దేశం అయితే జరిగిందేమిటి ఉద్యోగ కల్పన కల్పించలేదు. ఉద్యోగులను ఎంతమంది నియమించుకుంటారో కంపెనీలు ప్రభుత్వానికి ముందుగా తెలియజేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఉద్యోగాలను పెంచుకుంటూ పోయే కంపెనీలకు రాయితీలుఇవ్వాలి. ఎక్కువమందిని నియమించండి తక్కువ పన్ను చెల్లించండి అనేది ప్రభుత్వ విధానంకావాలి. యువతకు కావాల్సినసాంకేతిక పరిజ్ఞానాన్ని అటు కంపెనీలు ఇటుప్రభుత్వాలు కల్పించాలి. పాలకులు ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ●

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణుకువతో మెలగాలి.



రామకృష్ణ పరమహంస

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు, మరికొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.



ఫ్రాంక్లిన్

# ప్రజావాక్కు



## పిల్లల భవిష్యత్తుకు అల్పాహార పథకం

తెలంగాణ ప్రభుత్వం తమిళనాడు ఉదయం అల్పాహార పథకాన్ని ఆదర్శంగా తీసుకోవడం శుభపరిణామం. పేద కుటుంబాల పిల్లలు తరచుగా ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు వెళ్తారు. దాంతో చదువుపై ఏకాగ్రత తగ్గి, హాజరు కూడా ప్రభావితమవుతుంది. అలాంటి పరిస్థితుల్లో పాఠశాలలోనే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందిస్తేవిద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా చదువుకోవచ్చు. తమిళనాడులో ఈ పథకంమంచి ఫలితాలు ఇచ్చినట్లు అనుభవం చెబుతోంది. అదే మార్గంలో తెలంగాణ కూడా అడుగులువేయడం, పిల్లల భవిష్యత్ పట్ల ప్రభుత్వ కట్టుబాటును సూచిస్తుంది. పథకం విజయవంతం కావాలంటే వంట నాణ్యత, పర్యవేక్షణ, పారదర్శకత కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## జనరిక్ మందులపై అవగాహన అవసరం

జనరిక్ మందులవినియోగాన్ని ప్రోత్సహించడం నేటి సమాజానికి, ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల వారికి అత్యంత కీలకం. బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యతతో, 30నుంచి 80తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ప్రజల ఆరోగ్యహక్కును సాకారం చేయగలవు. జనరిక్ ఔషధాలు ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగాతయారవుతాయి. బ్రాండెడ్ కంపెనీలు మార్కెటింగ్, బ్రాండింగ్‌ల కోసం చేసే అనవసర ఖర్చులు జనరిక్ మందులకు ఉండవు. అందుకే అవి తక్కువ ధరకే అందుబాటులోకి వస్తాయి. జనరిక్ మందుల వాడకం పెరిగితే, వైద్య ఖర్చులు తగ్గుతాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రకృతిని కాలుష్య రహితం చేద్దాం

అప్పట్లో వర్షాలు పడి వరదల్లో కొట్టుకు వచ్చిన మురికి నీరు చెరువుల్లోకి చేరికాలుష్యంగా మారడంతో ఆ మురికి నీటిని స్వచ్ఛమైన నీరుగా మార్చడానికి పెద్దలందరూ ఔషధ గుణాలు కలిగిన అరుదైన పువ్వులతో శాస్త్రీయంగా భక్తితో బతుకమ్మ పండుగను జరుపుకుని నీటిని కాలుష్య రహితంగా చేసేటోళ్లు.. ఈ రోజుల్లో తంగేడు, గునుగు పువ్వులు కరువయ్యి. కాగితపు పూలకు కలర్లు అద్ది శాస్త్రీయపూలను మరిచి వ్యాధుల బారిన పడేలా చేస్తున్నారు. ఇకనైనా ప్రకృతి పూలను తెచ్చి పేరుద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

## లడఖ్‌లో అశాంతి

లడఖ్‌లో లేహ్ పట్టణంలో కొనసాగుతున్న నిరసనలు హింసాత్మక రూపుదాల్చడం, నలుగురి మృతికి దారితీయడం ఆందోళనకరం. కర్ఫ్యూ విధించడం ద్వారా ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చినా, దీర్ఘకాలిక పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది. జమ్మూ కాశ్మీర్ నుండి వేరుగా కేంద్ర పాలిత ప్రాంతంగా 2019లో లడఖ్ ఏర్పడినప్పుడు అక్కడి ప్రజల్లో సంతోషం వ్యక్తమైంది. తమ చిరకాలపుకోరిక ఒకరాష్ట్రంగా ఏర్పడడం అన్నది సాధ్యం కావడానికి మొదటి మెట్టుగా భావించారు. ఆ తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం, స్థానికంగా లేహ్ ప్రాంతానికి, కార్గిల్ ప్రాంతానికి చెరొక అభివృద్ధి మండళ్ల ఏర్పాటు ద్వారా పాలనసాగిస్తోంది. ఈశాన్యంలో అమలవుతున్న ఆరవ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలకు స్వయం పాలన కోరుతూవస్తున్నారు. ఆదిశగా నిరసనలు, నిరహార దీక్షలు జరుగుతున్నా పెద్ద స్థాయిలో హింస ప్రబలడం ఇదే మొదటిసారి.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ప్రాజెక్టులు నిర్మించాలి

తెలంగాణ పురోగమిస్తుంది రాష్ట్రంవిడిపోతే స్వయం సమృద్ధత సాధిస్తాం అని చేసిన పోరాటం గొప్ప మార్పును తెస్తుంది. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం సాధించింది. దానికి ప్రధానకారణం చెరువులు కుంటలు మాత్రమే. ఒకనాడు పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే అని పాటపాడుకున్న ఈ నెల ఇవ్వాళ మహబూబ్‌నగర్‌లో కూడా పచ్చటిపొలాలు కనిపిస్తున్నాయి. వాటికి ప్రధాన కారణం కల్వకుర్తి బీమా నెట్టెంపాడ్ కోయిల్ సాగర్ లాంటి ప్రాజెక్టులు ప్రధాన కారణం అయితే ఇప్పుడు ఇది అంత ఎందుకంటే మిషన్ కాకతీయ పథకం ద్వారా పూడిక తీత పనులు జరిగి నీటి నిల్వ సామర్థ్యం బాగా పెరిగింది. తద్వారా జనగామ భద్రాద్రి కొత్తగూడెం మహబూబ్ నగర్ లాంటి కరువు ప్రాంతాలు సైతం జలాన్ని ఒడిసిపట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

- భారత అవినాష్, జనగామ

## నిబంధనలు మార్చాలి

భారత దేశంలో ఎన్నికల నిర్వహణలోఎలెక్షన్ కమిషన్ కొన్ని మార్పులు తీసుకురావలసిన ఆవశ్యకతఉంది. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు దేశం మొత్తం ఒకేసారి నిర్వహించాలి. అలాగే ముందస్తు ఎన్నికలు నిషేధించాలి. దీనివల్ల ప్రజాధనం వృధా కాకుండా చూడవచ్చు. అలాగే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణలో లోసుగులను సరి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

# నదుల పరిరక్షణతోనే మానవాళి మనుగడ

**డా.బుర్ర మధుసూదన్ రెడ్డి**

భూగ్రహ జీవనాడులుగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం ఏరులై పారుతూనే ఉన్నాయి. పర్యావరణంలో అతి ప్రధానమైన వనరులుగా జీవ నదులు ప్రాణికోటికి విశిష్ట సేవలను అందిస్తున్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్యనదులు ధరణికే ప్రాణమిచ్చేవరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీతీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతోపాటు సంరక్షణ బాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్యభూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదావరి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి. ఏ దేశం లోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల జలశక్తి మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేసి పలు నదుల పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదుదశాబ్దాలుగా మంచి నీటివనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83శాతం వరకు కనుమరుగయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞానికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తలనొప్పి, నదీజలాలదుర్వి నియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, ప్రణాళిక రహిత పట్టణీకరణ, నదీజలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదీ జలాలు పలుచబడడం లేదా గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది. నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1980 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ నాలుగవ ఆదివారం, అనగా 28 సెప్టెంబర్ 2025 రోజున ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ నదుల దినం' లేదా 'వరల్డ్ రివర్స్ డే' వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2025 ప్రపంచ నదుల దినం ఇతివృత్తంగా 'ఆరోగ్యకరమైన నదులు, ఆరోగ్య వంతమైన భవిష్యత్తు' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటికాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగామార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డకట్ట వేయడం, శుద్ధజలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్‌షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవవైవిధ్యాలను కాపాడడంలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జరజరా వాగులై, ఏరులై, నదులై నవ్వుతూ ప్రవహిస్తాయి. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యత తో మానవహారం పడితేనే శుద్ధ నదీజలాల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళి మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి. కాలుష్య నదీజలాలు జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి. ●

# ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లును ఉపసంహరించాలి!

**బొల్లిముంత సాంబశివ రావు**

చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం 16 నెలలుగా ప్రజావ్యతిరేక, రైతాంగవ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరుపుతూ ఉంది. అందులో భాగమే ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టసవరణ బిల్లు. ఇదికార్మిక, శ్రామిక వ్యతిరేకబిల్లు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల, వాణిజ్య సంస్థల చట్ట సవరణ బిల్లు 2025ను కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ 2025న శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదంతెలిపింది. సవరణబిల్లు ప్రకారం దుకాణాలు, వాణిజ్యసంస్థల్లో పనిచేసే రోజువారీ వేలలు 8నుండి 10 గంటలకు, ఫ్యాక్టరీ కార్మికుల రోజువారి పనిగంటలు 9 నుండి 10గంటలకు పెరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు పనిచేసేందుకు బిల్లులో ఆమోదం తెలపటం జరిగింది. గతంలో మూడు నెలల్లో75 గంటలుగా ఉన్న ఓవర్టైమ్పునిబిల్లు ద్వారా 144 గంటలకు పెంచారు. బిల్లులో సవరించిన అంశాలన్నీ1948 ఫ్యాక్టరీల చట్టంలో పేర్కొన్న కార్మిక హక్కులకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. సవరణబిల్లు కోసం ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని అనేక నిబంధనల్లో మార్పుల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ముసాయిదా బిల్లును విడుదలచేసింది. ఈ ముసాయిదా బిల్లునే ఇప్పుడు శాసనసభ, శాసనమండలి ఆమోదించాయి. చట్టంలోని సెక్షన్ 54 అనేది కార్మికుల పని గంటలకు సంబంధించినది. కార్మికుడు రోజుకు, వారానికి ఎన్నిగంటలు పనిచేయాలి అనేది ఈసెక్షన్ పేర్కొంటుంది. దీని ప్రకారం కార్మికుడు రోజుకి8.30గంటలు పనిచేయాలి. ఇందులో భోజన విరామం 30నిమిషాలు ఉంటుంది. చట్టంలోనిసెక్షన్ 54లో మార్పులు చేసిరోజుకి 10.30 గంటలు పనిచేయాలని, అందులో భోజన విరామం అర్థగంటగా బిల్లులో పేర్కొనటం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న 9గంటలకన్నా అదనంగా గంటపనిచేయాలి. దుకాణాల్లో పనిచేసే వారు అదనంగా రెండుగంటలు పనిచేయాలి. ఈసవరణతో ఎటువంటి వేతనం లేకుండా కార్మికుని అదనపు శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టిలాభాలు పొందుతారు. అదనపు శ్రమ చేయటంవల్ల కార్మికుడు దోపిడీకిగురౌతాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని చంద్రబాబు చెప్పటం అంటే కార్మికులను శ్రమదోపిడీకి గురిచేసి జీవితాలను అంధకారంలోకి నెట్టి, యజమానులు లాభాలుపెంచటమా! చట్టసవరణ బిల్లులో వారానికి 48 గంటల పని యథాతథంగా ఉంటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉంది. రోజుకి 10 గంటల ప్రకారం వారంలో60 గంటలు పనిచేయాలి. అలాంటప్పుడు 48 గంటలు ఎలా అమలు జరుగుతుంది. అందుకు సంబంధించిన వివరాలు ఏమీచెప్పలేదు. పనిదినాలు తగ్గితేనే అది సాధ్యం అవుతుంది. ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లుకు ముందు ప్రతి మూడు నెలలకు 50నుండి75 గంటలు కార్మికుని



వ్రాతపూర్వక అనుమతితో అదనంగా ఓవర్టైమ్పని చేయించవచ్చు. సవరణల బిల్లులో దాన్ని144 గంటలకు పెంచారు. దీనివల్ల విశ్రాంతిలేకుండా కార్మికులపై పనిభారంతో వత్తిడికిలోనై, ప్రమాదాలు, ఆరోగ్యసమస్యలు ఏర్పడతున్నాయి. ఓవర్టైమ్పని చేసినందుకు ఇచ్చేవేతనంలో కూడా వ్యత్యాసం ఉంది. ఇద్దరు చేయాల్సిన పనిని ఒకని చేత చేయిస్తారు. దీనివల్ల ఫ్యాక్టరీ యజమాని అదనంగా కార్మికులను నియమించుకునే అవసరంలేకుండా అధికలాభాలు పొందితే, మరోపక్క ఉపాది. లేమితో నిరుద్యోగం పెరుగుతుంది. చట్టసవరణలకు ముందు అత్యవసర సర్వీసుల్లో సమ్మె చేయాలంటే 14 రోజుల ముందు సమ్మెనోటీసు ఇవ్వాలి. దీన్ని అత్యవసరంకాని సర్వీసులకు కూడా సవరణల తర్వాత వర్తింపచేశారు. ఫలితంగా అత్యవసరం కాని సర్వీసుల్లో నోటీస్ ఇవ్వకుండానే సమ్మె చేసే హక్కును కార్మికులు కోల్పోతారు. చట్టఉల్లంఘనపైన, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలపైనా యాజమాన్యం చిన్నపాటి నష్టపరిహారంతో తప్పించుకునేందుకు చట్టంలోసవరణ చేయటం జరిగింది. దీన్ని అవకాశంగా తీసుకుని యాజమాన్యం ప్రమాదాల బాధ్యత నుంచి, చట్టఉల్లంఘనల నుంచి శిక్షను తప్పించుకునే అవకాశం ఏర్పడింది. ప్రమాదాలకు గురైయ్యే కార్మికులకులభించే పరిహారం నిరుపయోగంగా మారుతుంది. ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం మహిళాకార్మికులతో రాత్రి ఏడు గంటల తర్వాత ఉదయం 6 గంటలలోపు పనిచేయించకూడదు. దీన్ని సవరిస్తూ బిల్లులో మహిళలు రాత్రిపూట కూడా పనిచేయవచ్చని పేర్కొనటం జరిగింది. ఇది మహిళలకు సమానహక్కు కల్పించటంగా పేర్కొంది. వాస్తవంలో తక్కువ వేతనంతో మహిళల శ్రమశక్తిని యజమానులు కొల్లగొట్టే అవకాశం బిల్లుద్వారా కల్పించటమే. భారత సామాజిక వ్యవస్థ అర్థభూస్వామ్య సంస్కృతిని కొనసాగిస్తున్నది. ఫలితంగా పురుషాధిక్యత కొనసాగుతూ స్త్రీని విలాస వస్తువుగా చూస్తున్నది. స్త్రీలపై నిరంతరం అనేక అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయి. ఫ్యాక్టరీల్లో పట్టపగలే స్త్రీలు బలవంతపు అత్యాచారాలకు గురౌతున్నారు. అలాంటి పరిస్థితుల్లో రాత్రిపూట పనిచేసే మహిళా కార్మికులకు భద్రతఎలా ఉంటుంది. యజమానులు కల్పించే మహిళాభద్రత ఎలాంటిదో స్త్రీలకు, ప్రజలకు తెలిసిన విషయమే. 2022లో కేంద్రంలోని మోడీప్రభుత్వం, ఎన్నోపోరాటాలు చేసిసాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఏకీకృతం చేయటం పేరుతో కార్మిక హక్కులను హరిస్తూ నాలుగులేబర్ కోడ్‌లుగా మార్చివాటిని చట్టాలుగా మార్చేందుకు పార్లమెంట్లో ప్రవేశపెట్టినప్పుడు టిడిపి పార్టీ దానికి మద్దతు తెలిపింది. అప్పుడే తన కార్మిక వ్యతిరేకతను చాటుకుంది. కార్మికవ్యతిరేక విధానాలు అమలు జరపడంలో మోడీవిధానాలనే చంద్రబాబు ప్రభుత్వంఅమలు చేస్తున్నది. ఏపీఫ్యాక్టరీల చట్టసవరణబిల్లు ద్వారా పరిశ్రమల, సంస్థలపై ప్రస్తుత చట్టంవల్ల కలిగే విధానపరమైన ఇబ్బందులు తొలగించేందుకు చేసిందిగా కూటమి ప్రభుత్వం చెప్పటం ద్వారా పరిశ్రమల, ప్రయోజనాల ప్రయోజనాలుకాపాడి, కార్మికహక్కులను కాలరాయటంఅన్నకూటమిప్రభుత్వవిధానం బయటపడింది. చంద్రబాబు ఆలోచనలు, విధానాలు పెట్టుబడిదారుల, ఫ్యాక్టరీల యజమానుల చుట్టూ తిరుగుతూ, కార్మిక హక్కులను హరించేవిగా ఉంటాయి. అందులో భాగమే ఫ్యాక్టరీలచట్ట సవరణబిల్లు. ఈబిల్లునువెంటనేఉపసంహరించాలి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోర రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బీహార్‌లో నితీశ్‌కు ఎదురుగాలి!

### ఈసారి మహాఘట్ బంధన్‌కు అవకాశం

### నిరుద్యోగం, శాంతిభద్రతలే ప్రధానాంశాలు

### ఎన్డీఏ సర్కార్‌పై పెరిగిన వ్యతిరేకత


### ఆర్జేడీకి ఒబిసి, ఇబిసిల మద్దతు

### కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశం

### 105-114 సీట్లకే ఎన్డీఏ పరిమితం

### ఎంజీబీకి 118-126 స్థానాలు పక్కా

### లోక్ పాల్ ప్రి-పోల్ సర్వేలో వెల్లడి






**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో షెడ్యూల్ విడుదల కానుంది. ఇప్పటికే అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌లు ఎన్నికల ప్రచారాన్ని అనధికారికంగా ప్రారంభించాయి. పార్టీల మధ్య, నేతల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బీహార్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో బీహార్ ప్రజలు ఏమనుకుంటున్నారు? అని 'లోక్ పోల్' అనే సంస్థ ప్రి-పోల్ సర్వే చేపట్టింది. మూడు వారాలపాటు రాష్ట్రమంతా కలియతిరిగి ఓటర్ల అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వే వివరాలను 'ఎక్స్' వేదికగా విడుదల చేసింది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ- జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 38-41శాతం ఓట్లతో 105 నుంచి 114 సీట్లు మాత్రమే వచ్చే అవకాశముంది. అలాగే ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమికి 39-42శాతం ఓట్లతో 118 నుంచి 126 స్థానాలు కైవసం చేసుకోనుంది. ఇతరులు, ఇందులో ప్రధానంగా ప్రశాంత్ కిశోర్ పార్టీకి 12 నుంచి 16శాతం వరకు ఓట్లు రావచ్చని, అయితే 2 నుంచి 5 సీట్లు మాత్రమే గెలవగలుగుతాయని సర్వే తేల్చింది. అసెంబ్లీలో 243 స్థానాలుండగా, 122 స్థానాలు సాధించిన పార్టీ లేదా కూటమి అధికారం చేజిక్కించుకోనుంది. అయితే, ఎన్నికలకు ముందు ఓటింగ్ జరిగే సమయానికి బట్టి అంచనాలు తారుమారు అయ్యే అవకాశముందని 'లోక్ పోల్' సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్‌లో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, వలసలు ఈసారి ఎన్నికల్లో ప్రధాన అంశాలు కానున్నాయి. నితీశ్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత పెరిగిందని సర్వేలో వెల్లడైంది. ఆరోగ్య సమస్యలు, అవినీతి, క్షీణిస్తున్న శాంతిభద్రతల ప్రభావం నితీశ్ పాలనపై పడిందని చెబుతోంది. గతంలో ఎన్డీఏకు వెన్నుదన్నుగా నిలిచిన ఓబీసీ, ఈబీసీలు ఈసారి ఆర్జేడీ- కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు. కాంగ్రెస్ కులగణన సహాయంతో ఎస్సీలు, ఈబీసీల్లో ఉదా-చమర్, ముసాహర్, మల్లా తదితర కులాల్లో ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశముంది. జేడీయూ బలమైన ఓటు బ్యాంకు కూడా ఈసారి ఆర్జేడీకి మద్దతివ్వనున్నారు. ముస్లింలు- యాదవుల ఏకీకరణ దేశాన్ని బలోపేతం చేస్తోందని ఆయా వర్గాల్లో నమ్మకం పెరుగుతోంది. దీంతో జేడీయూ ప్రభావం క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. బీజేపీ ఓటు బ్యాంకుకు జాన్ సూరజ్ పార్టీ గండికొట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. బీజేపీకి బనియాల కులం మద్దతు ఉంది. అయితే, జాన్ సూరజ్ పార్టీ ఉన్నత కులాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుంది. ఫలితంగా బీజేపీకి ఆయా కులాల నుంచి నెగెటివ్ ఫలితాలు వచ్చే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది. మై బెహన్ మాన్ యోజన, ఉచిత విద్యుత్ వంటి పథకాల కారణంగా మహిళా ఓటర్లు మహాఘట్‌బంధన్ వైపు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఓట్ల దొంగతనం కూడా ప్రభావం చూపే అవకాశముంది. రాహుల్ గాంధీ ఇమేజ్ మెరుగుపడిందని, ఓటర్ల కోసం ఆయన చేసిన యాత్ర, ప్రజా సమస్యలపై దృష్టి సారించిన నాయకుడిగా ఇమేజ్ పెరుగుతున్నట్లు పేర్కొంది. ఉత్తర ప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని స్థానాలలో బీఎస్పీ ప్రభావం క్షీణించడంతో మహాఘట్ బంధన్‌కు అవకాశాలు పెరిగే అవకాశముంది.

## బీహార్ ఎన్నికలకు

### 470 మంది పరిశీలకులు!

**పాట్నా, సెప్టెంబరు 28:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరంచేస్తోంది. ఈ క్రమంలో 470 మంది పరిశీలకులను నియమించింది. వీరిలో 320 మంది ఐఎఎస్‌లు కాగా 60 మంది ఐపిఎల్‌లతోపాటు మరో 90 మంది ఇతర ఉన్నతాధికారులున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మరో ఏడు స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీ అవుతోంది. ఎన్నికల సమయంలో అవకతవకలకు తావులేకుండా చూడటం, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాత పోటీ వాతావరణం కల్పించాలని జనరల్, పోలీసులు ఖర్చుల పరిశీలకులను నియమిస్తున్నది.

అక్టోబరు తొలివారంలోనే బీహార్‌లో ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించనున్న ఈసీ అంతకుముందురోజే పరిశీలకులకు దిశానిర్దేశం చేస్తోంది. మొత్తం 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీ గడువు నవంబరు 22తో ముగియనుంది. ఇందుకోసం ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకుఈసీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తిచేయగా ఇందుకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.



# భారత్ విషయాల్లో జోక్యం చేసుకోం

### రష్యా అధ్యక్షుడు పుతిన్


**న్యూయార్క్, సెప్టెంబరు 28:** ఈ యేడాది చివర్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. తర్వాత భారత విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ యేడాదిలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని తెలిపారు. వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యుఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.

## భారత్‌పై నోరుపారేసుకున్న అమెరికా మంత్రి లుట్నిక్




**వాషింగ్టన్, సెప్టెంబరు 28:** అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచిందని లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై మోడీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరు పారేసుకున్నారు.

## బ్యూనస్ ఏరీస్‌లో ముగ్గురు యువతుల దారుణ హత్య



**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 28:** అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎరీస్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు యువతులను చిత్రహింసలు పెట్టి హత్య చేయడమే కాకుండా, ఈ ఘోరకృత్యాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పాశవిక చర్యకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులతో కలిసి పార్లమెంట్ వరకు భారీర్యాలీ నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యూనస్ ఏరీస్ శివారు ప్రాంతానికి చెందిన మోరెనా వెర్డి (20), బ్రెండా డెల్ కాస్టిల్లో (20), లారా గుటియెర్రెజ్ (15) అనే ముగ్గురు అమ్మాయిలు ఈ నెల 19న అదృశ్యమయ్యారు. ఐదు రోజుల తర్వాత,ఒక ఇంటి పెరట్లో వారి మృతదేహాలను పోలీసులు పాతిపెట్టిన స్థితిలో కనుగొన్నారు. డ్రగ్స్ ముఠాతో ఉన్న విభేదాలే ఈ హత్యలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పార్టీ పేరుతో యువతులను ఒక వ్యాన్‌లోకి ఎక్కించుకుని, ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు హత్యను ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ అకౌంట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు వెల్లడించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 45మంది ఈ లైవ్‌ను చూసినట్లు అధికారులు తెలిపారు. నా దగ్గర డ్రగ్స్ దొంగిలిస్తే ఇలాగే జరుగుతుందని ఒక ముఠా నాయకుడు వీడియోలో హెచ్చరించినట్లు సమాచారం. నిందితులు బాధితుల వేళ్లను నరికి, గోళ్లను పీకి, తీవ్రంగా కొట్టి ఊపిరా డకుండా చేసి చంపారని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్పం దించిన జాతీయ భద్రతా మంత్రి పాట్రిసియా బుల్రిచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలతో సహా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఐదో నింది తుడిని బొలీవియా సరిహద్దు నగరమైన విల్లాజోన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ హత్యలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న 20 ఏళ్ల పెరూ దేశస్థుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు, ఈ లైవ్ స్ట్రీమింగ్ తమ ప్లాట్‌ఫామ్‌పై జరిగిందనడానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దారుణమైననేరంపై దర్యాప్తు చేస్తున్న అధికారులకు తాముపూర్తిగా సహకరిస్తున్నామని మెటా ప్రతినిధి చెప్పారు.నిరసనలో పాల్గొన్న బాధితుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. జంతువులతో కూడా ఇంత క్రూరంగా ప్రవర్తించరు. మాకు న్యాయం జరగాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇద్దరు వ్యక్తులపై కాంగ్రెస్ నాయకుడి దాడి



**భోపాల్, సెప్టెంబరు 28:** కాంగ్రెస్ నేత కుమారుడు ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడంతోపాటు వారిని బెదిరించాడు. నగరంలోని సగం మంది తన పేరు వింటే భయపడతారని వారితో అన్నాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బాధిత వ్యక్తుల ఫిర్యాదుతో కాంగ్రెస్ నేత కుమారుడిపై కేసు నమోదైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 3న అనికేత్ బైరాగి తన బావమరిది నీరజ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి కుమారుడు నీర్ ప్రజాపతి ఇంటికి వెళ్లి కలిశాడు. ఆయన మేనల్లుడు అమిత్ ప్రజాపతి, నీరజ్ మధ్య జరిగిన వివాదాన్ని ప్రస్తావించాడు. కాగా, వివాదాన్ని పరిష్కరించడానికి బదులు అనికేత్, నీరజ్‌ను నీర్ ప్రజాపతి దుర్భాషలాడాడు. వారిద్దరిని కొట్టాడు. 'భోపాల్‌లో సగం మంది తన పేరుకు భయపడతారు' అని బెదిరించాడు.



## నటి సంజనకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** డ్రగ్స్ కేసులో సినీ నటి సంజనా గల్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో సంజనా సంబంధాలపై ఆరోపణలు, 2020నాటి డ్రగ్స్ కేసులో నటి సంజనా గల్రానీకి కర్ణాటక హైకోర్టు మార్చి 25, 2024 క్లీన్ చిట్ ఇస్తూ తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ కేసులో సుప్రీంకోర్టు తాజాగా నటి సంజనా గల్రానీతోపాటు మిగతా వారికి నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ పంపిణీ, విక్రయం ఆరోపణలతో సంజనా గల్రానీ గతంలో అరెస్టయ్యారు. ఈ కేసును విచారించిన కర్ణాటక హైకోర్టు.. ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, విచారణలో సంజనా ఫోన్ కాల్స్ డాటా, ఇతర వివరాలు, నగదు లావాదేవీలతోపాటు నైజీరియన్ డ్రగ్ పెడ్లర్‌తో ఆమెకున్న సంబంధాలను కర్ణాటక హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ అమన్ పన్వర్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దీంతో నటి సంజనా సహా డ్రగ్స్ కేసులో గతంలో హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన వారికి జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌వాల్యా బాగ్చి సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

## సోనమ్ దిష్టిబొమ్మలు దగ్ధంచేయకుండా చర్యలు తీసుకోండి

### మధ్యప్రదేశ్ హైకోర్టు తక్షణ ఆదేశాలు



**భోపాల్,సెప్టెంబరు 28:** మేఘాలయలో హనీమూన్ సందర్భంగా కొత్తగా పెళ్లైన భర్తను హత్య చేసిన నిందితురాలు సోనమ్ రఘువంశీ దిష్టిబొమ్మను దసరా రోజున దహనం చేయడాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు నిషేధించింది. నిందితురాలు లేదా ఇతర వ్యక్తుల దిష్టిబొమ్మలను దహనం చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీకి సోనమ్‌తో పెళ్లి జరిగింది. అనంతరం కొత్త జంట హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లారు. అక్కడ ప్రియుడితో కలిసి భర్తను సోనమ్ హత్య చేసింది. ఈ కేసుపై దర్యాప్తు చేసిన పోలీసులు సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా, ఇతర నిందితులను అరెస్ట్ చేశారు. దసరా రోజున 'సుర్పణక దహనం' కోసం 11 తలల దిష్టిబొమ్మను సిద్ధం చేస్తున్నట్లు ఇండోర్‌కు చెందిన సామాజిక సంస్థ 'పౌరుష్' తెలిపింది. సోనమ్‌తో పాటు భర్తలు, పిల్లలు, అత్తమామలను దారుణంగా హత్య చేసిన నిందితులైన మహిళల చిత్రాలు ఉంటాయని పేర్కొంది. మరోవైపు సోనమ్ తల్లి సంగీత ఆ సంస్థకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ప్రణయ్ వర్మతో కూడిన సింగిల్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. అలాంటి దిష్టిబొమ్మ దహనానికి అనుమతి లేదని శనివారం తీర్పునిచ్చింది. పిటిషనర్, ఆమె కుమార్తె, కుటుంబం ప్రాథమిక హక్కులను ఇది ఉల్లంఘిస్తుందని పేర్కొంది. కాగా, 'భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్య ఆమోదయోగ్యం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేరు' అని కోర్టు స్పష్టం చేసింది. అలాంటి దిష్టిబొమ్మ దహనం జరగకుండా చూడాలని, మహిళా నిందితులు, వారి కుటుంబాల ప్రతిష్టను దెబ్బతీసే చట్టవిరుద్ధమైన లేదా రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను నిరోధించాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లను హైకోర్టు ఆదేశించింది.

# సంక్షిప్తంగా..

## విద్యార్థినులను వేధించిన స్వామీజీ అరెస్టు



**ఆగ్రా, సెప్టెంబరు 28:** విద్యార్థినులపై లైంగిక వేధింపులు, కోట్ల రూపాయల ఆర్థిక మోసం వంటి తీవ్ర ఆరోపణలతో కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వివాదాస్పద స్వామీజీ చైతన్యానంద సరస్వతిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఆగ్రాలోని ఓ హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన చైతన్యానంద (62) అసలు పేరు పార్థసారథి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) స్కాలర్‌షిప్‌పై చదువుకుంటున్న 17 మందికి పైగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని, వారిని తాకుతూ వేధించాడని, అసభ్యకర సందేశాలు పంపాడని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి తన గదికి రావాలని విద్యార్థినులను బలవంతం చేసేవాడని, వారి కదలికలను ఫోన్ ద్వారా నిత్యం గమనించే వాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

## నార్త్‌కరోలినా రెస్టారెంట్‌లో కాల్పులు: ముగ్గురు మృతి



**నార్త్‌కరోలినా, సెప్టెంబరు 28:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. నార్త్ కరోలినాలో ఓ దుండగుడు వినూత్న రీతిలో రెస్టారెంట్‌పై దాడికి పాల్పడ్డాడు. బోటులో వచ్చి జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. విల్మింగ్టన్‌కు సమీపంలోని సౌత్ పోర్ట్ యాట్ బేసిన్ ప్రాంతంలో ఉన్న 'అమెరికన్ ఫిష్ కంపెనీ' అనే రెస్టారెంట్‌లో శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. రెస్టారెంట్ సమీపంలోని నీటిలో ఒక బోటు వచ్చి ఆగింది. అందులో ఉన్న ఓ వ్యక్తి ఒక్కసారిగా రెస్టారెంట్‌లోని వారిపై తుపాకీతో కాల్పులు జరపడం ప్రారంభించాడు. అనంతరం అదే బోటులో వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనలో మొత్తం ఏడుగురిపై బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## ప్రపంచ దేశాల్లో 80% సమస్యలన్నీ వృద్ధనేతల వల్లనే..

### అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా




**శ్రీనగర్, సెప్టెంబరు 28:** ప్రపంచదేశా ల్లో 80శాతం మంది వృద్ధనేతలు అధికారం పట్టుకుని వేలాడుతుండటంవల్లనే సమస్యలు పెరుగుతున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. పిరమిడ్లతో సహ ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కడం వంటివాటివల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. 77 ఏళ్లవయసులో అగ్రరాజ్యానికి అధ్యక్షుడుగా ఉన్న ట్రంప్‌ను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేసారని అంతా అనుమానిస్తున్నారు. లండన్‌లో జరిగిన ఒక ఈవెంట్‌లో ఒబామా మాట్లాడుతూ ప్రపంచ సమస్యల్లో 80శాతం మరణానికి భయపడే వృద్ధులు అధికారాన్ని పట్టుకుని వేలాడుతుండటంవల్లనేనని చెప్పడం సముచితం. వారు ఏదీ వదులుకోరు. వారు పిరమిడ్‌లను నిర్మిస్తారు. ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కించుకుంటారని అన్నారు. బ్రిటిష్ చరిత్రకారుడు డేవిడ్ ఒలుసొగాతో జరిగిన ముఖాముఖిలో ఈవ్యాఖ్యలు చేసారు. 2017నుంచి 2018 వరకూ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బరాక్ ఒబామా 2019లో కూడా సాధారణంగా వృద్ధులు ముఖ్యంగా బాగా ముదిమి వయసు బారిన పడినవాళ్లు అధికారం అనే మార్గంనుంచి బయటకు రారని అన్నారు. పారాసిటమాల్ వాడితే గర్భస్థశిశువుల్లో ఆటిజం పెరుగుతుందన్న ట్రంప్ వ్యాఖ్యలపైనా ఒబామా విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలు సత్యదూరమని ఒబామా కొట్టిపారేసారు.

## సెక్యూరిటీ దళాల దాడుల్లో 17 మంది పాక్ తాలిబన్‌లు మృతి



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 28:** పాకిస్తాన్ వాయవ్యప్రాంతంలో ఆదేశ భద్రతా దళాలు జరిపిన మెరుపుదాడుల్లో సుమారు 17 మంది పాకిస్తానీ తాలిబన్ యోధులు మృతిచెందారు. ఖైబర్ ఫఖ్తూన్‌క్వా ప్రావిన్స్‌లోని కరక్ ప్రాంతంలో ఈ దాడులు జరిపారు. ప్రాంతీయ పోలీస్ చీఫ్ షెహబాజ్ ఇలాహి వివరాలప్రకారం ఈ దాడుల్లో ముగ్గురు పోలీస్ అధికారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇవ్వని చీఫ్ వీరిని ఖ్వార్జి అని మాత్రమే చెప్పారు. వీరంతా పాకిస్తాన్ తాలిబన్‌కు చెందినవారని తెలిపారు. ఇటీవలి కాలంలో టిటిపై ఆకస్మికదాడులు, ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వాయవ్య ప్రాంతంలోనే డేరా ఇస్మాయిల్‌ఖాన్ జిల్లాలో 13 మంది టిటిపి ఫైటర్లు చనిపోయారు. ఇటీవలికాలంలో పాకిస్తాన్‌లో మిలిటెంట్ హింసపెరిగిపోయింది. వేర్పాటువాదుల దాడులు ఎక్కువయ్యాయి. పాకిస్తానీ తాలిబన్ కూడా ఈ దాడులు నిర్వహించింది. ఈ సంస్థనే తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ లేదా టిటిపి అని కూడా పిలుస్తారు. అఫ్ఘన్ తాలిబన్లతో సంబంధాలు ఎక్కువ ఉన్న టిటిపి పాక్ ప్రభుత్వ దళాలపై మెరుపుదాడులు చేస్తోంది. 2021లో ఆఫ్ఘన్ తాలిబన్ అధికారం లోకి వచ్చినప్పటినుంచి టిటిపి మిలిటెంట్లు, కమాండర్లు ఆఫ్ఘనిస్తాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు.


## సోషల్ నెట్‌వర్కింగ్‌లో నంబర్ వన్ 'అరట్టై'..



**చెన్నై,సెప్టెంబరు 28:** చెన్నైకి చెందిన జోహో కార్పొరేషన్ అభివృద్ధి చేసిన 'అరట్టై' యాప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. యాపిల్ యాప్ స్టోర్‌లో సోషల్ నెట్‌వర్కింగ్ విభాగంలో ఇది నంబర్ వన్ స్థానంలో నిలిచింది. 'అరట్టై' అంటే తమిళంలో "మాట్లాడటం" అని అర్థం. టెక్స్ట్ మెసేజ్‌లు,వాయిస్/ వీడియోకాల్స్, ఫొటోలు, వీడియోలు, డాక్యు మెంట్లు పంపడం, స్టోరీస్, ఛానల్స్ క్రియేట్ చేయడం ఇలా వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అవసరాలకు తగిన ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించారు. దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ యాప్‌ను కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రదాన్, అశ్వినీ వైష్ణవ్ ప్రోత్సహిస్తున్నారు. తాజాగా తాను జోహోకు మారుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.మైక్రోసాఫ్ట్ పవర్ పాయింట్ బదులుగా జోహోతోనే తాజా కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఆధార్ అప్‌డేట్‌కు ఇకపై రుసుముల బాదుడు

### కొత్తకార్డులు ఉచితమే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఆధార్ కార్డు సంబంధించిన వివిధ సర్వీసులకు ఇకపై అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఆధార్ సేవల యూజర్ ఛార్జీలను పెంచుతూ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఏఐడీఏఐ) ప్రకటించింది. అయితే, కొత్త ఆధార్ కార్డుల జారీ సర్వీసులు ఉచితంగానే అందిస్తామని తెలిపింది. కానీ, ఇప్పటికే జారీ చేసిన ఆధార్ కార్డుల్లో అడ్రస్ మార్చుకోవడం, నిర్ణీత వయసు వారు వేలిముద్రలను అప్డేట్ చేయడం వంటి సేవలకు ఛార్జీలు విడతల వారీగా పెంచుతున్నట్లు తెలిపింది. మొదటి విడతలో పెంచిన ఛార్జీలు అక్టోబర్ 1 నుంచే అమలులోకి తీసుకొస్తున్నారు. 17 ఏళ్ల వయసు దాటిన వారు తమ ఆధార్ కార్డులో వేలి ముద్రలను అప్డేట్ చేసుకోవాలంటే ప్రస్తుతం ఈ సర్వీసులకు రూ.100 వసూలు చేస్తున్నారు.అయితే, దీనిని రూ.125కు పెంచారు. ఇక అడ్రస్ మార్చుకునేందుకు ప్రస్తుతం రూ.50 మేర వసూలు చేస్తుండగా ఈ ఛార్జీలను రూ.75కు పెంచుతున్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచే పెరిగిన ఛార్జీలు అమలులోకి వస్తాయని యూఐడీఏఐ పేర్కొంది. ఈ మేరకు యూఐడీఏఐ హెడ్ ఆఫీసులోని డిప్యూటీ డైరెక్టర్ హిమాన్షు దేశంలోని అన్ని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయాలకు సమాచారం అందించారు. కొత్త ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఉచితంగానే ఉంటుంది. చిన్న పిల్లలు 5 సంవత్సరాల నుంచి 7 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయాల్సి ఉంటుంది. వారికి సైతం ఈ సేవలు ఉచితంగానే ఉంటాయి. అలాగే 15 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయసు వారికి సైతం ఎలాంటి ఛార్జీలు ఉండవు. 17 ఏళ్ల వయసు దాటిన వారికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. రెండో విడతలో ఈ ఛార్జీలు రూ.100, రూ.125గా నిర్ణయించారు. ఇవి అక్టోబర్ 1, 2028 నుంచి అమలులోకి వస్తాయి. ఇక మూడో విడతలో సెప్టెంబర్ 30, 2031 నుంచి రూ.90 నుంచి రూ.150గా ఉంటాయని యూఐడీఏఐ తెలిపింది. మరోవైపు 2026, జూన్ 14వ తేదీ వరకు మై ఆధార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ ఉచితంగా చేసుకోవచ్చని యూఐడీఏఐ తెలిపింది. ఆ తర్వాత ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇక ఆఫ్‌లైన్ ద్వారా ఆధార్ నమోదు కేంద్రాల్లో అయితే ఇప్పుడు కూడా ఛార్జీలు కట్టాలి. అయితే, ఆధార్ కేంద్రాల్లో ఇప్పటికీ రూ.50, రూ.100 పాత ఛార్జీలనే ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. కొత్త వాటిని అక్టోబర్ 1వ తేదీ తర్వాత ప్రదర్శించే అవకాశాలు ఉన్నాయి. పేరు మార్పు, చిరునామా మార్పు, ఫోన్ నంబర్ మార్పు, బయోమెట్రిక్ అప్డేట్ వంటి వాటికి కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. చిన్న పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కోసం యుఐడిఎఐ స్కూళ్లలోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది.

## బాలికపై ఆరునెలలుగా అత్యాచారం: నిందితుడి అరెస్టు

**లక్నో,సెప్టెంబరు 28:** ఒక వ్యక్తి బాలికను కిడ్నాప్ చేశాడు. ఒకచోట నిర్బంధించి ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు బాలికను నిర్బంధించిన ప్రాంతాన్ని పోలీసులు గుర్తించారు. ఆమెను రక్షించడంతోపాటు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక మార్చి 22న అదృశ్యమైంది. ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులపాటు అన్ని చోట్ల వెతికారు. కాగా, 21 ఏళ్ల ఆశిష్ కుమార్ సరోజ్ ఆ యువతిని మభ్యపెట్టి లోబర్చుకుని కిడ్నాప్ చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. ఆరు నెలల తర్వాత సెప్టెంబర్ 26న ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని సంగం రైల్వే స్టేషన్ సమీపంలో ఆ బాలికను రక్షించారు. ఆశిష్ కుమార్ తనను నిర్బంధించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

# హైసెక్యూరిటీ ప్లేట్లపై ఎలాంటి గడువు లేదు

## 30వ తేదీ గడువంటూ జరుగుతున్న ప్రచారంపై స్పష్టత ఇచ్చిన రవాణా శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్పీ) మార్చుకోవాలంటూ జరుగుతున్న ప్రచారంపై రవాణా శాఖ అధికారులు స్పష్టతనిచ్చారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఈ ప్లేట్లు బిగించుకోకపోతే జరిమానాలు తప్పవనే వార్తల్లో నిజం లేదని, వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కొన్ని రోజులుగా పాత వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ ప్లేట్లు తప్పనిసరి, నిర్దేశిత గడువు(సెప్టెంబర్ 30)లోగా మార్చుకోని వారిపై ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని రవాణా శాఖ అధికారులు ఖండించారు. పాత వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ ప్లేట్లు బిగించేందుకు ఇప్పటివరకు ఎలాంటి గడువు విధించ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి పాత వాహనాలకు నంబర్ ప్లేట్ల మార్పు అంశం ప్రభుత్వ పరిశీలన దశలోనే ఉందని అధికారులు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఆదేశాలు అందలేదని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వెలువడిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నంబర్ ప్లేట్ల మార్పుపై వస్తున్న వదంతులను నమ్మవద్దని, ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు ఎటువంటి చర్యలు ఉండవని.. అప్పటి వరకు వేచి చూడాలని రవాణా శాఖ ప్రజలకు స్పష్టం చేసింది.

# గల్ఫ్ వలస జీవులకు బతుకమ్మ భరోసా!

## దుబాయి బతుకమ్మలో వెన్నెల గద్దర్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ వలస జీవులకు బతుకమ్మ వంటి భరోసా ఇస్తున్నదని వెన్నెల గద్దర్ అన్నారు. గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్ పర్సన్ జి. వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగిత్యాల మునిసిపల్ తాజా మాజీ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, నిర్మల్ జిల్లావాసి అల్లూరి క్రిష్ణవేణి అతిథులుగా హాజరయ్యారు. దుబాయి, షార్జా లలో ఉన్న తెలుగు ప్రవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ తదితర దేశాలకు వలస వెళ్లిన, తెలంగాణ ప్రవాసులకు భరోసా ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని వెన్నెల గద్దర్ ఈ సందర్భంగా అన్నారు. జిటిఫ్ అధ్యక్షులు ఆకుల సురేందర్, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, దుబాయిలోని ఎన్నారై ప్రముఖులు బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు బుర్ర సతీష్, అష్ట గంగాధర్, పూజ నాగేశ్వర్ ఆహుతులను అలరించారు.

# సద్దులబతుకమ్మ, దసరా సందర్భంగా రవాణా ఇబ్బందులు రాకుండా చర్యలు

## ఆర్‌టిసి అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రతి బస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక అధికారిని నియమించాలని, రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డిఎంలతోపాటు ఉన్నతాధికారులందరూ క్షేత్రస్థాయిలోఉంటూ.. 97 డిపోలు 340 బస్‌స్టేషన్లు సమన్వయం చేసుకొని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు. దసరా పండుగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను టిజిఎస్‌ఆర్‌టిసి నడుపు తున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబరు 2న ఉన్నందున.. శనివారం నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచామని అధికారులు మంత్రికి వివరించారు.

# సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

## రూ.10.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు

## దేశంలో రెండోది సిఎం స్వగ్రామం



**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందనుంది. ఈ మేరకు పౌరసంబంధాల శాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న కొండారెడ్డిపల్లిలో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. రాష్ట్ర రెడ్కో ద్వారా రూ.10.53 కోట్లతో 514 ఇండ్లతో, పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికి 3 కెడబ్ల్యూ స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కెడబ్ల్యూ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థం 1,500 కెడబ్ల్యూగా ఉంది. మట్టి గోడలతో ఉన్న 34 ఇండ్ల కుటుంబాలు కూడా సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్ల పైన సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు రెడ్కో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె. మనోహర్‌రెడ్డి తెలిపారు. కొండా రెడ్డిపల్లి లో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.10.53 కోట్లు కాగా, అందులో రూ.7.96 కోట్ల వ్య యంతో సౌరవిద్యుత్ పరికరాలు ఏర్పాటుకు కేటాయిం చారు. సౌర విద్యుత్ నిమిత్తం కేంద్రం సబ్సిడీ కింద రూ.3.56 కోట్లు, ప్రైవేటు కంపెనీ నుండి కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా రూ4.092 కోట్లు భరించాయి. మరో రూ.2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేశారు. కాగా ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి (రోజుకు 120 యూనిట్లు) అవుతుంది. ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇంటి వినియోగానికి పోగా, మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. గ్రిడ్‌కు పంపే విద్యుత్ యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లించుటకు లబ్దిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ నెలలో విద్యుత్ గ్రిడ్‌కు గ్రామం నుండి సుమారు లక్ష యూనిట్ల విద్యుత్ ఎగుమతి అయింది. తద్వారా రూ.5 లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించినట్లు పౌరసంబంధాల శాఖ వెల్లడించింది.

# హారిస్‌బర్గ్ బతుకమ్మ సంబురాలు

## పాల్గొన్న ఎంపి చామల

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** పెన్సిల్వేనియాలో హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన బతుకమ్మ పండుగ సంబు రాలలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పెన్సిల్వేనియాలోని హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు మెకానిక్స్ బర్గ్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి చామల మాట్లాడుతూ,సప్త సముద్రాలు దాటి వచ్చినా తెలుగు కమ్యూనిటీ ఏకతాటిపై నిలిచి, మన సంస్కృతి– సాంప్ర దాయాలను ప్రపంచానికి చాటుతున్నారని అభినందించారు. అమెరికాలోని తెలుగు కమ్యూనిటీకి వారి సొంత ఊర్లలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు ఉన్న లోటును తీర్చేందుకు 'బ్రిడ్జి' వంటి వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని, దీని కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

# సిపిజెట్-2025లో మొదటి విడతలో 20,467 మందికి సీట్ల కేటాయింపు

## అక్టోబరు 8లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూని వర్సిటీల్లో పోస్టుగ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు(సిపిజెట్)–2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపును ఆదివారం చేశారు. 2025–2026 విద్యా సంవత్సరానికి పిజి మొదటి సంవత్సరంలో చేరడానికి వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 20,467 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు సిపిజెట్–2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి తెలిపారు. రాష్ట్రం లోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్న లాజికల్, మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్ స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవే శాల కోసం మొదటి దశ సీట్ల కేటాయింపును ప్రకటించారు. 28,145 మంది వెబ్‌ఆప్షన్లు చేయగా.. వారిలో మొదటి విడతలో 20,467 మందికి సీట్లు కేటాయించబడ్డాయి. సీటు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో అక్టోబరు 8లోగా చెల్లించి ఒరిజినల్ టిసితో ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని కన్వీనర్ ప్రకటనలో తెలిపారు.



ప్రసంగిస్తున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

# నాలుగు జిల్లాల్లో ధన, ధాన్య కృషి యోజన

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్రం తాజాగా ప్రకటించిన ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయనుంది. ఇందుకు రాష్ట్రంలోని 4 జిల్లాలను ఈ పథకంలో చేర్చింది. రాష్ట్రంలోని నారాయణపేట, గద్వాల, జనగామ, నాగర్‌కర్నూల్ జిల్లాలను కేంద్రం ఎంపిక చేసింది. కాగా దేశ వ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాల్లో రైతులకు చేయూతనిచ్చి దిగుబడులు పెంచడానికి కేంద్రం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం తాజాగా ప్రకటించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలు చేయనుంది. రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. తద్వారా దీనికింద 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించింది. పంటల మార్పిడి, సాగునీటి సౌకర్యాల కల్పన, నిల్వ సామర్థం పెంపు, విలువ జోడింపు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పూర్తిగా వర్షాలపై ఆధారపడిన తెలంగాణలోని 4 జిల్లాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ జిల్లాల్లో పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటోంది. వీటిని ధనధాన్య యోజనలో చేర్చితే ఆ జిల్లాల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందని సర్కార్ చెబుతోంది.

# రాష్ట్రంలో కొత్తగా 1,96,890 మంది రైతులకు బీమా

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్రంలో కొత్తగా 1,96,890 మంది రైతులకు బీమా అమలు కానుంది. ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో రైతులు ఈ పథకంలో చేరారు. రైతు బీమా కొత్త సీజన్ ఆగస్టు 14 నుంచి ప్రారంభమైంది. రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అందులో 1,96,890 మంది కొత్త రైతులు బీమాకు అర్హులని లెక్క తేల్చారు. గతంలో బీమా ఉన్న 40,19,958 మంది రైతుల బీమాను రెన్యువల్ చేశారు. దీంతో మొత్తం 42.16 లక్షల మంది రైతులకు 2026 ఆగస్టు 14 వరకు బీమా రక్షణ కొనసాగుతుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి అదనంగా 1,181 మందిని చేర్చారు. జూన్ 5, 2025 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల రైతులు ఈ పథకానికి అర్హులుగా పరిగణలోకి తీసుకున్నారు. కాగా గతంలో రూ.3,400 ఉన్న ప్రీమియం ఇప్పుడు రూ.3,225కి తగ్గింది. 2024–25 బీమా సంవత్సరంలో 25 వేలకు పైగా క్లైయిమ్‌లు నమోదయ్యాయి. దీని ద్వారా ఒక్కో క్లైయిమ్‌కు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1,300 కోట్లకు పైగా పరిహారం రైతు కుటుంబాలకు అందిందినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# రైతులకు శ్రీరామరక్షగా మనీలెండింగ్ యాక్ట్

## రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి రైతులను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చిందనీ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. అసలు, వడ్డీ కట్టలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంద ర్భాలు న్నాయని వివరించారు. రాష్ట్రంలో మనీ లెండింగ్ యాక్ట్ 1349 అమలు కావడం లేదని, ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని రెండు నెలల క్రితం ప్రభుత్వానికి ఆధారాలతో లేఖ రాసినట్లు కోదండరెడ్డి తెలిపారు. రైతు కమిషన్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్ 1349 ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ జారీ చేసిన ఈ ఉత్తర్వులు రైతులకు శ్రీరామరక్షగా ఉంటాయన్నారు. ప్రధానంగా సన్న చిన్నకారు రైతు లు, కౌలురైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతులో మోసపోయారని ఇక నుండి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆటలు సాగవని స్పష్టం చేశారు.

# నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

## ప్రొ. మణికొండ వేదకుమార్




మంజీరా నది తీరంలో ప్రపంచ నదుల దినోత్సవం వేడుకల్లో మాట్లాడుతున్న ఫోరమ్ ఫర్ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొ.మణికొండ వేదకుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** మంజీరానది తీరంలో ఏడుపాయల వద్ద ప్రపంచ నదుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, గవర్నమెంట్ సిటీ కాలేజీ బృంద సభ్యులు నదితో నడక కార్యక్రమన్ని చేపట్టారు. ఫోరమ్ ఫర్ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

నదులను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిదీ అన్నారు. నదులు నాగరికతకు మూలమని, కాలుష్యానికి దూరంగా నదులను స్వచ్ఛంగా కాపాడు కోవాలన్నారు. తర్వాత తరాలకు నదులను అందించాలనే గొప్ప సంకల్పంతో అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 100 దేశాల్లో జరుపుతున్న ఈ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయని గుర్తుచేశారు. ఈ ఏడాది మెదక్ జిల్లాలోని ఏడు పాయల వద్ద మంజీరా నది సమక్షంలో జరుపు కుంటున్నామని తెలిపారు. మంజీర నది తీరంలోని కొండల వరుసల రాక్ ఫార్మేషన్లు గురించి తెలిపారు. మంజీర నది మీద కట్టిన మొదటి ప్రాజెక్ట్ వన దుర్గాప్రాజెక్ట్ అని, ఈ ప్రాజెక్ట్ ఎంతో మంది రైతులకు వ్యవసాయానికి నీరు అందుతుందని తెలిపారు.

గ్రూప్1 అధికారి కరిపే రాజు,ఫోరం సభ్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ నది సంరక్షణ అంటే మన సంరక్షణ అని ప్రకృతిని మనం కాపాడితే మనల్ని ప్రకృతి కాపాడు తుందన్నారు.నీటి నిల్వ పద్ధతుల నిపుణులు సుభాష్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ కట్టేటప్పుడు వర దల సమయంలో తట్టుకునేలా అన్ని పద్ధతులు ఉపయో గించుకోవాలని తెలిపారు.

సూపరిం టెండెంట్ ఆఫ్ ఇంజినీర్ ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంజీర మీద కట్టిన ప్రాజెక్ట్స్ గురించి వివరించారు. నదిమీద పాట పాడిన అంబటి వెంకన్న నది గొప్పతనాన్ని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో చరిత్ర బృందం సభ్యుడు బుర్ర సంతోష్, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ ఎం.హెచ్.రావు, డా.రమా, డా.పద్మ, సుతారావు వెంకట నారాయణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలి


## లేకపోతే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తాం

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

**హైదరాబాద్ సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఇప్పటికైనా ఆమోదించాలని, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఇదే అసెంబ్లీలో ప్రవేశపెట్టి గవర్నరుకు పంపిస్తే అప్పుడు ఆమోదించిన గవర్నర్ ఇదే బిల్లు చట్టరూపంలో తీసుకువస్తే ఎందుకు ఆమోదించడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నేడు హైదరాబాదులోని సచివాలయం మీడియా పాయింట్ వద్ద బిసి సం ఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పెం చుతూ తీసుకువచ్చిన జిఓ నంబర్ 9ని సవాల్‌చేస్తూ రెడ్డి జాగృతికి చెందిన నాయకులు హైకోర్టులో పిటిషన్‌వేసి అడ్డుకోవాలని చూశారని బీసీల వైపు న్యా యం ఉన్నందునే హైకోర్టు బీసీ రిజర్వేషన్ల విషయంలో జోక్యం చేసుకోలేదని ఆయన తెలిపారు. బీసీ రిజర్వేషన్ల చట్టానికి తక్షణమే రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్నందున బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్రరావు తక్షణమే గవర్నర్‌ను కలిసి బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదించేలా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దండ్రు కుమారస్వామి, బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, బీసీ కల్చరల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు వరంగల్ శ్రీనివాస్,బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు మురళీకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్‌కు హరీశ్ పరామర్శ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎండి జహంగీర్ తండ్రి ఎండి ఖాసీం ఇటీవల మృతి చెందటంతో ఆయ నను (పితృవియోగంతో) మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు తుర్కపల్లికి విచ్చేసి పరామర్శించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆదివారం రాత్రి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో ఇటీవల మృతిచెందిన ఎండి ఖాసీం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



తుర్కపల్లిలో బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్‌ను పరా మర్శించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు

ఎండి జహంగీర్‌ను, బిఆర్ ఎస్ నాయకులు ఎండి యూసుఫ్‌బాబను ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఓదార్చి వారికి సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర అటవీ సంస్థ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్‌ఛైర్మన్ ఆర్. మధుకర్‌రెడ్డి, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, ఎండి అన్వర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిసిఎకు గుర్తింపు ఇవ్వండి

## బిసిసిఐ చైర్మన్‌కు జైషాకు టిడిసిఎ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి వినతి

**హైదరాబాద్, సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ)కు గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐ పెద్దలను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఆదివారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ కొత్త అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, కోశాధికారి ప్రభుతేజ్ సింగ్ భాటియాకు వెంకటేశ్వర్ రెడ్డి విజ్ఞాపన పత్రాలను అందించారు. హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 220 క్లబ్ టీమ్‌లు ఉంటే, మిగిలిన 32 జిల్లాలకు తొమ్మిది ఉమ్మడి జిల్లా జట్లే ఉన్నాయని, ఈ విధానంతో తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరుగుతోందని వెంకటేశ్వర్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాలుగా తీవ్రమైన అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన హెచ్‌సీఏపై పలు సీఐడీ, ఏసీబీ కేసులు ఉన్నాయని, హెచ్‌సీఏ పరిపాలకులకు అవినీతిపై ఉన్న శ్రద్ధ క్రికెట్ అభివృద్ధిపై లేదని లేఖలో ప్రస్తావించారు. మాజీ క్రికెటర్లు శివ్‌లాల్ యాదవ్, అర్షద్ అయూబ్ సహ 42 మంది హెచ్‌సీఏ పెద్దలపై ఏసీబీ కేసులు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌కే పరిమితమై పనిచేస్తున్న అవినీతి హెచ్‌సీఏతో తెలంగాణ గ్రామీణ క్రికెట్ అభివృద్ధి చెందదని, ఇప్పటివరకు తెలంగాణ క్రికెటర్లకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలంటే తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.

# రైతులకు సిఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయాలి

## రిలే దీక్షలకు తాత్కాలిక విరమణ : ఎంపి ఈటల



నిరాహారదీక్షలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు తప్పకుండా ఋణమాఫీ అమలు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ఉమ్మడి ఘట్‌కేసర్ మండల రైతుఋణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారంతో 19వ రోజుకు చేరు కున్నాయి. దీక్షలో కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, బొక్క రవీందర్‌రెడ్డి, సామల బాల్‌రెడ్డి, కట్ట మధుసూధన్‌రెడ్డి, కంట్లం శివకుమార్, పడమటి శ్రీనివాస్‌రెడ్డిలు కూర్చుకున్నారు. ఘట్‌కేసర్ మాజీ ఎంపిపిలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం మాజీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డిలు వచ్చి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వచ్చి దీక్షలో కూర్చొని రైతులతో మాట్లాడి దీక్షలను విరమింపజేశారు. ఘట్‌కేసర్ సొసైటీలో 1,189 మంది రైతులకు ఋణమాఫీ కాకపోవడం శోచనీయమన్నారు. రేవంత్‌రెడ్డి గతంలో మల్కాజ్‌గిరి నుంచి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారని ఇక్కడి రైతులను మరచిపోకుండా ఆయన సేవలు అందించాల్సిన అవసరముందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ పరిధిలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రైతులకు ఇంకా ఋణమాఫీ అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఘట్‌కేసర్ రైతులకు రుణమాఫీ కోసం రూ.8 కోట్లకు పైగా నిధులు అవసరమున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఋణమాఫీ చేసేందుకు చొరవ చూపాలన్నారు. రిలే నిరాహాదీక్షలకు తాత్కాలికంగా విరామం ఇవ్వాలని దసరా తర్వాత రుణమాఫీ చేయకుంటే పోరాటం మరింత ఉధృతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.

# ఘనంగా మేరా దేశ్ పెహలే.. సన్నాహక సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** మేరా దేశ్ పహలే – ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ నరేంద్ర మోడీ కార్యక్రమానికి సంబంధించిన ప్రిపరేటరీ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం అభివృద్ధిలో ముందుండే విధంగా నరేంద్ర మోడీ తీసుకొచ్చిన ఆవిష్కర ణాత్మక నిర్ణయాలను, వారి నాయకత్వంలోని అనేక ప్రయోజనకరమైన కార్యక్రమాలను వివరిస్తూ, ఈ వేడుక ద్వారా యువతకు స్ఫూర్తి కలగాలని ఆకాంక్షి ంచారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కార్పొరేటర్లు పాల్గొని నగర అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్యలు, జిఎస్‌టి తగ్గింపుతో జరిగే మేలు గురించి, తదితర విషయాలపై చర్చించారు. ఈ నెల 30న హైటెక్స్‌లో ఈ సమావేశం జరగనుంది. కాగా ఈ కార్యక్రమానికి సంబంధించిన పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం పరిశీలించారు.

# శాంతిభద్రతల్లో రాజీపడే ప్రసక్తే లేదు

## హైదరాబాద్ కొత్త కమిషనర్ వి.సి.సజ్జనార్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** లాఅండ్‌ఆర్డర్ విషయంలో ఎట్టి పరిస్థితిలో రాజీపడే ప్రసక్తే లేదని హైదరాబాద్ కొత్త కమిషనర్ వి.సి.సజ్జనార్ ఘాటుగా వ్యాఖ్యనించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎలా ఉన్నానో..అదే పంథాలో కొనసాగుతాను. నగరంలో చట్టవ్యవస్థ పరిరక్షణ కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. అదేవిధంగా సైబర్‌నేరాలే, ఆర్థిక నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు.ఇక రౌడీషీటర్లపై బలమైన చర్యలు ఉంటాయని, ఎవరైన హల్చల్ చేస్తే పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్‌మీడియాలో అనర్థాలకు దారితీసే పోస్టులు పెడితే భరతం పెడతామన్నారు. రాజకీయనాయకులు, అనుచరులు కూడా ఇలాంటి ప్రవర్తలను మానుకోవాలని పేర్కొన్నారు.ఎక్కడో జరిగిన సంఘటనను వక్రీకరిస్తే సమస్యలు తప్పవన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ ఒక పెద్ద సవాల్ అని, తగినగంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేస్తామని వివరించారు. ఫ్రీఫ్లో కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, శాంతిభద్రతలపై ఫోకస్ ఉంటుందని సజ్జనార్ వెల్లడించారు.



## చైనాలో మాజీ వ్యవసాయ మంత్రికి

# మరణశిక్ష

**బీజింగ్, సెప్టెంబరు 28:** అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం ప్రకటించింది. దేశ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధిస్తూ జిలిన్ ప్రావిన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సుమారు రూ.334 కోట్ల విలువైన లంచాలు స్వీకరించినట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించినందున శిక్ష అమలును రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొంది. టాంగ్ రెన్‌జియాన్ 2007 నుంచి 2024 మధ్య కాలంలో పలు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం, కాంట్రాక్టులు ఇప్పించడం, ఉద్యోగ నియామకాలు జరపడం వంటి పనుల కోసం భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు కోర్టు నిర్ధారించింది. మొత్తం 268 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.334 కోటు విలువైన నగదు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులను ఆయన లంచాల రూపంలో తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విచారణ సమయంలో టాంగ్ తన నేరాలన్నింటినీ అంగీకరించారు. మరణశిక్షతో పాటు, టాంగ్ రెన్‌జియాన్‌పై మరిన్ని కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది. ఆయన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా జీవితకాలం నిషేధం విధించింది. ఆయన వ్యక్తిగత ఆస్తులన్నింటినీ పూర్తిగా జప్తు చేయాలని, అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని స్పష్టం చేసింది.

# నిర్లక్ష్యమా! కుట్ర కోణమా?



### కరూర్ ర్యాలీ తొక్కిసలాటలో 40కి పెరిగిన మృతులు
### హైకోర్టును ఆశ్రయించిన విజయ్ టివికె పార్టీ
### ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏకసభ్యక మిషన్
### మృతుల కుటుంబాలకు విజయ్ రూ. 20 లక్షల సాయం

**చెన్నై, సెప్టెంబరు 28:** నటుడు టివికె విజయ్ కరూర్ రాలీకి సంబంధించి ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎవ్వరినీ ఉపేక్షించేదిలేదని చట్టప్రకారం వెళతామనిడిఎంకె ప్రభుత్వం ప్రకటిస్తే ఈ ర్యాలీలో కుట్రకోణం ఉందని, రాల్లురువ్వడంవల్లనే జరిగిందని విజయ్‌పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. మరోపక్క కేంద్ర హోంశాఖ కూడా ఈ దుర్ఘటనను తీవ్రంగా పరిగణిస్తోంది. సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. ర్యాలీలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మృతుల సంఖ్య 40కి పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు వదిలారని అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకూ 30 మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో 26 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 67 మంది వేరువేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్యమంత్రి సెంథిల్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టివికె విజయ్ నిర్వహించిన ర్యాలీసంఘటన ఇపుడు రాజకీయ పార్టీలను రగిలిస్తోంది. విజయ్ ర్యాలీకి ఏడు గంటలు ఆలశ్యంగా రావడంవల్లనే తొక్కిసలాట జరిగిందని తమిళనాడు డిజిపి స్వయంగా ప్రకటించడం మరింత రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ విషాదానికి కారణంగా నటుడు విజయ్ చేసిన సోషల్‌మీడియా ట్వీటేనని డిజిపి శంకర్‌జివాల్ వెల్లడించడంతో మరింత అసహనం పెరిగిందని వెల్లడించారు. ఎక్కువసేపు ప్రజలు వేచి ఉండటంవల్లనే జనం మరింతపెరిగి తొక్కిసలాటకు కారణం అయిందన్నారు. ఇదిలా ఉంటే టివికె విజయ్ ర్యాలీ సంఘటనకు సంబంధించి కేంద్ర హోంశాఖ సమగ్రనివేదికలు కోరింది. సంఘటన ఎలా జరిగింది, పూర్వాపరాలు, రాష్ట్రప్రభుత్వ చర్యలు వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మంత్రి ఉదయనిధిస్టాలిన్‌లు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనుకోకకుండా 30 వేలమందికిపైగా ఒక్కసారిగా వచ్చిపడటంతో తొక్కిసలాట జరిగింది. రాష్ట్రప్రభుత్వం మృతుల కుటుంబాలక పదిలక్షలు, బాధితులకు లక్షరూపాయలు చొప్పున పరిహారం ప్రకటిస్తే కేంద్రంనుంచి పిఎం సహాయనిధినుంచి మృతులకు రెండు లక్షలు, గాయపడినవారికి 50 వేల వంతున ఆర్థికసాయం ప్రకటించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలంటూ ఆదేశాలు జారీ చేసారు. ఇదిలా ఉంటే టివికె చీఫ్ విజయ్‌పై పోలీసులు కేసునమోదుచేసిన సంగతి తెలిసిందే. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, జాయింట్ సెక్రటరీనిర్మల్‌కుమార్‌లపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేసారు. ఎడిజిపి ఎస్ డేవిడ్‌సన్ ధృవీకరించారు. విజయ్ ఇద్దరు సహాయకులపైనా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసామన్నారు.

**మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షలు చొప్పన సాయం**

సంఘటన హృదయవిదారకంగా ఉందని, ఈ బాధ ఆకుటుంబాల్లో ఎన్నటికీ వీడనిదని టివికె చీఫ్ విజయ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షల వంతున ఆర్థికసాయం అందిస్తామని, గాయపడిన వారికి రెండు లక్షలచొప్పున సాయం చేస్తామనిప్రకటించారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబీకులందరికీ ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**తొక్కిసలాటపై కుట్రకోణం ఉంది..టివికె పార్టీ**

కాగా కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో కుట్రకోణం ఉందని, ర్యాలీలో గుర్తుతెలీని వ్యక్తులు రాళ్ల విసరడం, పోలీసులు లాఠీఛార్జిచేయడంవల్లనే తొక్కిసలాటపెరిగి ఈ ఘోరం జరిగిందని టివికె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. సిబిఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసి విచారణ జరిపించాలనికోరింది. టివికె తరపున న్యాయవాది ఎస్ అరివళగన్ ఈ పిటిషన్ దాఖలుచేసారు. హైకోర్టు చీఫ్‌జస్టిస్ దండపాణి నివాసానికి వెళ్లి విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేసామని సోమవారం మధ్యాహ్నం హైకోర్టులోని మధురైబెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని తెలిపారన్నారు.

**సంఘటనస్థలానికి ఏకసభ్య కమిషన్ ఛైర్మన్**

ఇదిలా ఉండగా ఆదివారం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ సంఘటన ప్రాంతాలను సందర్శించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కూడా పరామర్శించారు. రాష్ట్ర డిజిపి ఇతర రెవెన్యూ జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఇతర అధికారులనుంచి క్షేత్రస్థాయి నివేదికలు అందించాలని కోరారు.ఘటన పూర్వాపరాలు, బాధ్యతారాహిత్యం, బందోబస్తు వివరాలు మొత్తం కావాలని ఆమె అధికారులను ఆదేశించారు.

## రేవంత్ అహంభావం వల్లే రాష్ట్రానికి రూ.15వేల కోట్ల నష్టం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు28:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావం వల్లే తెలంగాణకు రూ.15వేల కోట్ల నష్టం వాటిల్లిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేతకానితనం, మితిమీరిన అహంభావం కారణంగా రాష్ట్ర అభివృద్ధి గాడి తప్పిందదన్నారు. ఈమేరకు ఆదివారం సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తన రియల్ ఎస్టేట్ అవసరాల కోసం, ఉనికిలో లేని నాల్గవ నగరం (ఫోర్త్ సిటీ) వైపు మళ్లించే నెపంతో, ఏకపక్షంగా ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్‌ను రద్దు చేశారని ఆరోపించారు. మేడిగడ్డ అంశంలో అక్రమ కేసులు పెడతామని ఎల్ అండ్ టీ వంటి భారీ కార్పొరేట్ సంస్థను బెదిరించారని ధ్వజమెత్తారు. ఇది కేవలం తన రాజకీయ ప్రయోజనాలు కమీషన్ల కోసమే ఎల్ అండ్ టీ ప్రతిష్టను దిగజార్చి, సంస్థను నాశనం చేయడానికి ప్రయత్నించారని కేటీఆర్ ఆరోపించారు. నేషనల్ టెలివిజన్‌లోనే స్వయంగా ఎల్ అండ్ టీ కంపెనీ సీఎఫ్ఓను జైల్లో పెట్టాల్సి ఉందిగా పోలీసులను కోరానని చెప్పారని గుర్తు చేశారు. అందుకే ఎల్‌అండ్ టీ సంస్థ తెలంగాణ నుంచి వెళ్లిపోతుందని చెప్పారు. సీఎం మితిమీరిన అహంభావం, గూండాగిరి కారణంగా రాష్ట్ర పన్ను చెల్లింపుదారులపై రూ.15,000 కోట్ల అప్పు భారం పడనుందన్నారు.

## పవన్‌కళ్యాణ్‌ను పరామర్శించిన ఎపి సిఎం చంద్రబాబు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** కొన్నిరోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్న జనసేన పార్టీ అధినేత, ఎపి డిప్యూటీసిఎం పవన్‌కళ్యాణ్‌ను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. జూబ్లీ హిల్స్‌లోని పవన్‌కళ్యాణ్ నివాసానికి వచ్చిన చంద్రబాబు ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. దాదాపు 3 గంటలకు పవన్ కళ్యాణ్ ఇంటికి వచ్చిన చంద్రబాబు గంటపాటు అక్కడే ఉన్నారు. విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కళ్యాణ్‌కు సూచించారు. కాగా ప్రస్తుతం జ్వరం తీవ్రతలేదని, దగ్గు ఎడ తెరిపి లేకుండా వస్తుందని పవన్ తెలిపారు. పరీక్షలుచేసి క్రానిక్ బ్రాంకైటిస్ కారణంగా దగ్గు ఎక్కువగా ఉందని, ఫలితంగా గొంతు దగ్గర నొప్పిగా ఉందని వైద్యులు చెప్పినట్లు పవన్ వివరించారు. మెగా డిఎస్సీ ద్వారా ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగ నియామకపత్రాలు అం దించే కార్యక్రమం ద్వారా యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబరు 4న 'ఆటో డ్రైవర్ల సేవల్లో' కార్యక్రమంపై చర్చించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విజయవంతంగా అమలుచేశామని, తద్వారా మహిళలకు ఆర్థికమైన వెసులుబాటు కలుగుతుందని ఎపి సిఎం చంద్రబాబు తెలిపారు. అక్టోబరు 16న ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయడంపై చర్చించారు.



చంద్రబాబుతో చర్చిస్తున్న పవన్‌కళ్యాణ్


# టి-చిప్‌తో గ్లోబల్ మ్యాప్‌పై తెలంగాణ

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు28:** టీ-చిప్ ద్వారా తెలంగాణను గ్లోబల్ మ్యాప్పై నిలిపేందుకు సందీప్ కుమార్ మక్తాలా చేస్తున్న కృషి అభినందనీయమని.. ప్రతిభ నుంచి ఫ్యాబ్‌ల వరకు సమగ్ర ఎకోసిస్టమ్ నిర్మించాలన్న ఆయన దృష్టి సమయోచితమైందని రాష్ట్ర ఐటీ, ఇండస్ట్రియల్ మంత్రి దుద్దిళ్ల శ్రీధరాబాబు అన్నారు. ఆదివారం టీ-చిప్ సెమీకాన్ కానిస్టిట్యూషన్ సమ్మిట్2025లో మంత్రి పాల్గొని మాట్లాడారు. టీ-చిప్ కోసం తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సమ్మిట్ ముగింపు సందర్భంగా టీ-చిప్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా మాట్లాడుతూ.. 18 విశ్వవిద్యాలయాలు ముందుకొచ్చి, గ్లోబల్ లీడర్స్ తమ మద్దతు తెలిపి, ఐఐటీ హైదరాబాద్ తొలి చిప్ ఆవిష్కరించడం గొప్ప పరిణామమని అన్నారు. సెమీకాన్ కానిస్టిట్యూషన్ ఇక ఆలోచన కాదని.. ఇది ఒక ఉద్యమమని వెల్లడించారు. తెలంగాణ ప్రారంభ వేదిక అని.. ఈ ప్రయాణం భారత్ నుంచి ప్రపంచానికి విస్తరించనుందని చెప్పారు. రెండు రోజులపాటు చర్చల్లో చిప్ టాక్స్, ఎంఓయూ సంతకాలు, అవార్డులు, నెట్వర్కింగ్ సెషన్లు జరిగాయి. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల సెమీకండక్టర్ నిపుణుల కొరత, అందులో భారత్లోనే 85 వేల మంది నిపుణులు అవసరమని అంచనాలు వెల్లడయ్యాయి. అంతేకాకుండా భారత్‌లో సెమీకండక్టర్ రంగ భవిష్యత్తుకు మార్గం చూపే మొదటి సెమీకాన్ రాజ్యాంగం రూపకల్పనకు ఈ సదస్సు వేదికైంది. ఇందులో టాలెంట్, డిజైన్, మాన్యుఫాక్చరింగ్, అప్లికేషన్స్ అనే నాలుగు స్తంభాల వ్యూహంతో సమగ్ర ఎకోసిస్టమ్ రూపొందించడానికి ప్రతిపాదనలు ఆమోదించారు. నేషనల్ యంగ్ మింగ్ చియావ్ టంగ్ యూనివర్సిటీ, తైవాన్ సెమీకండక్టర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ఏఆర్ఎం, జీయూసీ టెక్నాలజీ సీఈఓ సీసీ చాంగ్ తదితరులు పాల్గొని భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ స్వదేశీ చిప్పు ఆవిష్కరించింది. కాగా రెండో రోజు సమావేశానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సైతం హాజరయ్యారు.

# సుంకాలతో దేశీయ వృద్ధి తగ్గే ప్రమాదం

### క్రిసిల్ ఇంటెలిజెన్స్ వెల్లడి




**కోల్‌కతా, సెప్టెంబరు 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాలతో భారత్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. దేశీయ ఫార్మా ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లను విధిస్తూ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఫార్మా రంగ సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ఈ ప్రతీకార సుంకాలతో దేశీయ వృద్ధిరేటు కూడా ఢీలా పడే ప్రమాదం ఉన్నదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అనుబంధ సంస్థయైన క్రిసిల్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది. దేశీయ వినిమయం భారీగా పుంజుకున్నప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు ఢీలా పడే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. దేశీయ వస్తువులపై ట్రంప్ టారిఫ్ బాంబు వేయడంతో ఇప్పటికే ఢీలా పడిన పరిశ్రమ రంగాలు తాజాగా సుంకం విధించడంతో ఫార్మా రంగ సంస్థలపై తీవ్ర స్థాయిలో ప్రభావం చూపనున్నదని క్రిసిల్ తెలిపింది. దీంతోపాటు దేశీయంగా పెట్టుబడులు పెట్టేవారు వెనుకంజ వేసే అవకాశాలు కూడా ఉన్నా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, వడ్డీరేట్ల కోతల ద్వారా దేశీయ వినిమయం పుంజుకోనుండటంతో వృద్ధికి బాటలు వేయనున్నదని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత వృద్ధిరేటు ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 7.4 శాతం కంటే ఇది అధికం. ధరల సూచీ 3.5 శాతానికి తగ్గుముఖం పట్టడంతో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడానికి వీలు పడనున్నదని, దీంతో వృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశాలు కూడా ఉన్నాయని తన నివేదికలో వెల్లడించింది. అధిక వర్షపాతం ప్రభావాన్ని ఇంకా పూర్తిగా అంచనా వేయనప్పటికీ, ఆరోగ్యకరమైన వ్యవసాయ వృద్ధితో ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుందని భావిస్తున్నట్టు వెల్లడించింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, కమోడిటీ ఉత్పత్తులు కూడా చౌక కావడం కూడా కలిసిరానున్నదని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వుబ్యాంక్ రెండు సార్లు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని తెలిపింది. అమెరికా ఫెడరల్ రిజర్వు క్రమంగా వడ్డీరేట్లను తగ్గిస్తుండటంతో ఈ ప్రభావాన్ని తట్టుకోవడానికి ఆర్బీఐ కూడా వచ్చే సమీక్షల్లో పావు శాతం చొప్పున రేట్లను రెండుసార్లు తగ్గిస్తుందని ఆశిస్తున్నట్టు వెల్లడించింది. ఆ తర్వాతి రేట్లను ముట్టుకోకపోవచ్చని తెలిపింది.

## భారత్ ఫ్యూచర్‌సిటీ నుండి అమరావతి వరకు 8 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు 28,ప్రభాతవార్త :** భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి విజయవాడ (ఎన్‌హెచ్65) జాతీయ రహదారి 8లేన్ విస్తరణకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని 2026 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.హైదరాబాద్ నుండి విజయవాడ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండడమే కాకుండా యాక్సిడెంట్స్ ఎక్కువ జరుగుతున్న రహదారుల్లో ఒకటని మంత్రి అన్నారు. ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్లై ఓవర్లు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినప్పుడు ఈ అంశాన్ని గుర్తు చేశానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు యాక్సిడెంట్ ఫ్రీ రహదారిని అందుబాటులోకి తేనున్నామని, అధునాతన టెక్నాలజీతో,పూర్తి నాణ్యతతో హైదరాబాద్ నుండి విజయవాడకు రోడ్ నిర్మించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు.

# గరుడసేవకు పోటెత్తిన భక్తులు



## తిరుమల మొత్తం జనసంద్రం
### 3 లక్షల మందిపైగా రాక
### సౌకర్యాలు భేష్.. అయినా తప్పని తిప్పలు



**తిరుమల, సెప్టెంబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడవాహనసేవకు అత్యంత విశిష్టత ఉంది. గరుడునిపై ఏడు కొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే ముక్తికలుగుతుందని పురాణాల ఐతిహ్యం. అంతటి మహిమాన్వితమైన గరుడసేవ ఆది వారం రాత్రి తిరుమలేశుని వార్షిక బ్రహ్మో త్సవాల్లో జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఉదయంనుండే కలియుగవైకుంఠం తిరుమలభక్తజనసంద్రంగా మారింది. ఆదివారం ఉదయం మోహినీ అవతారం వాహనసేవ ముగియగానే ఎక్కడి భక్తులు అక్కడే అలాగే గ్యాలరీల్లో, మాఢవీధుల్లో కూర్చున్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.80లక్షలమంది భక్తులు వాహనసేవలు వీక్షించే సౌకర్యం కలిగింది. దసరా సెలవులు, పెరటాసిమాసంతోబాటు ఆదివారం రాత్రి జరిగిన బ్రహ్మోత్స వాల్లో గరుడవాహనసేవ వీక్షణకు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలనుండేగాక తమిళనాడు,కర్నాటక,మహారాష్ట్రల నుండి భక్తులు అనూహ్యంగా తిరుమలకు రావడంతో ఆదివారం ఉదయంనుండి కొండంతా భక్తజనసందోహంగా మారింది. ఉదయం 5గంటల నుండి ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి భక్తులు చేరారు. మధ్యాహ్నం 12గంటలకు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.30లక్షల మంది భక్తులు నిండిపోయారు. మిగిలినభక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడానికి పోలీసు లతో వాగ్వాదానికి దిగారు. ఎక్కడ భక్తులను అక్కడే నిలువరించారు. దాదాపు 50వేలమందివరకు భక్తులు తిరుమలలోనే పలు చోట్ల వెలుపల వేచివుండాల్సి న పరిస్థితి ఏర్పడింది.

మధ్యాహ్నం రెండుగంటల తరువాత భక్తులను గ్యాలరీలో ్లకి అనుమతించలేదు. ఆదివారం ఉదయం భక్తుల రద్దీ మరింత రెట్టింపయ్యింది. ఉదయం నుండే గ్యాలరీలో ్లకి చేరుకునే భక్తులసంఖ్య క్రమంగా పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకే తిరుమలలో ఆలయ తూర్పుమాఢవీధి, దక్షిణమాఢ,ఉత్తర పడమర వీధుల్లో గ్యాలరీలు పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 11గంటల నుండి నిరంతరాయంగా భక్తులకు 14రకాల వంటకాలు తయారుచేసి నిరంతరాయంగా అర్ధరాత్రి 12గంటల వరకు సాంబార న్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, చక్కెర పొంగలి, 4లక్షల మజ్జిగ ప్యాకెట్లు, పాలు, కాఫీ, సాయంత్రం సుండలు, అటు కలు తదితర అన్నప్రసాదాలు,తాగునీరు శ్రీవారి సేవకులు, టిటిడి ఉద్యోగులు పంపిణీచేశారు.ఎప్పటికప్పుడు తిరుపతి జిల్లా ఎస్పీ సిసికెమెరాల ద్వారా క్రౌడ్‌మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నారు. చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీగా 4వేలమంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు.

**తిరుమలలో 38 ఎల్‌ఇడి స్క్రీన్లు:**

సకల సౌకర్యాలు కల్పించినా మధ్యాహ్నం నుండి గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులకు గరుడవాహనసేవ వీక్షించేందుకు ఆలయ మాఢవీధుల్లో 22 ఎల్‌ఇడి స్క్రీన్లు ,భక్తుల రద్దీ వున్న ఇతరప్రాంతాల్లో 16కలిపి 38పెద్ద డిజిటల్ స్క్రీన్లపై వీక్షించారు.ఆదివారం ఒక్కరోజు భక్తులకు సంతృప్తికరంగా ఆనందనిలయుడ్ని దర్శనం కల్పించేందుకు,వాహనసేవ వీక్షణకు అన్ని దర్శనాలను రద్దుచేశారు. ఆదివారం మధ్యాహ్నం నుండి తిరుమలలోని అనేక ప్రాంతాలలో, మాఢవీధుల్లోని గ్యాలరీలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులు కలసి స్వయంగా ఎక్కడికక్కడే ఎప్పటికప్పుడు భక్తుల సౌకర్యా లపై ఆరాతీస్తూ తనిఖీలు చేశారు. మధ్యాహ్నానికి 4వేల వాహనాలు నిండిపో వడంతో ప్రైవేట్ వాహనాలను, ట్యాక్సీలను, భక్తుల వాహనాలను తిరుమలకు అనుమతించలేదు. అలిపిరిలోనే పార్కింగ్ చేయించారు.

## యుపిఐ, రైల్వే, ఎన్పీఎస్‌లో రానున్న మార్పులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** కొత్తనెల ప్రారంభం నుంచే ప్రతినెలా వచ్చే నిబంధనల్లో కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎల్పీజీ నుంచి యుపిఐ, రైల్వేలు, పింఛన్ వంటి వాటిల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మార్పులు సామాన్యుల జేబులపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తున్నాయి. ప్రతినెల 1న చమురు సంస్థలు ధరలపై సమీక్షిస్తాయి. కొత్తనెల ప్రారంభంతో ఎల్పీజీ ధరలు మారే అవకాశముంది. సిలిండర్ ధర చివరిగా గత ఏప్రిల్ 8వ తేదీ ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరా బాద్ నగరాల్లో సవరించారు. రైల్వే టికెట్ బుకింగ్‌లో కూడా మార్పులున్నాయి. రైల్వే టికెట్లలో మోసం అరికట్టేందుకు రైల్వేలు కీలక నిర్ణయం తీసాయి. కొత్త నిబంధన ప్రకారం వచ్చే నెల ఒకటినుంచి ఆధార్‌ధృవీకరణ పూర్త యిన వ్యక్తులు మాత్రమే వచ్చేనెలనుంచి రిజర్వేషన్ ఓపెన్ అయిన తర్వాత మొదటి 15 నిమిషాల్లో ఆన్‌లైన్ టికెట్లు బుక్‌చేసుకోడానికి వీలుంటుంది. యాప్, ఐఆర్‌సిటిసి రెండింటి ద్వారా కూడా టికెట్లు బుక్‌చేసుకోడానికి వర్తిస్తుంది. త త్కాల్‌కే ఉన్న బుకింగ్ ఇపుడు అన్నింటికీ వర్తి స్తోంది. ఇక అక్టోబరులో ఎన్పీ ఎస్, యుపిఎస్, అటల్ పెన్షన్ యోజన ఎన్‌పీ ఎస్ లైట్ చేరాయి. పిఎఫ్ రెగ్యులేటరీ ఫండ్ డెవలెప్ మెంట్ అథారిటీ సిఆర్ఎలు వసూలు చేసే రుసు ములను సవరించింది. ఈ మార్పులు అక్టోబరు ఒకటినుంచి అమల్లోకి వస్తాయి. కొత్త నియమాన్ని అనుసరించి ప్రభుత్వ ఉద్యోగులు ఇపుడు కొత్తప్రాన్ తెరవడానికి, ఈప్రాన్‌కిట్ కోసం రూ.18 చెల్లించాలి.

## ఈ వారం మార్కెట్‌లోకి నాలుగు ఫండ్స్, రెండు సిప్‌లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** మ్యూచువల్ ఫండ్స్‌తో పాటుగా రెండు స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈ వారం మార్కె ట్‌కు వస్తున్నాయి. ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ పోర్ట్‌ఫోలియోలోని ఖాళీలను భర్తీ చేస్తూ విభిన్న కస్టమర్లను ఆకర్షిం చేందుకు ఈ కొత్త స్కీమ్స్ తీసు కొస్తున్నట్లు తెలిపాయి. సెక్టోరల్ ఫండ్స్ కేటగిరీలో రెండు స్కీమ్స్ వస్తున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ కన్స ంప్షన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 1వ తేదీన మొదలవుతోంది. ఈ స్కీమ్ అక్టోబర్ 15వ తేదీ వరకు అందుబాటులోకి వస్తుంది. ఆ తర్వాత ఇన్వెస్కో ఇండియా కన్స ంప్షన్ ఫండ్‌సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 3వ తేదీన మొదలవుతుంది. అక్టోబర్ 17వ తేదీ వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతుంది.స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ నుంచి రెండు స్కీమ్స్ వస్తున్నాయి. అందులో అల్టివా హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్, మ్యాగ్నమ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 1వ తేదీ మొదలవుతున్నాయి. అక్టోబర్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. ఇటీవలి కాలంలో సంస్థలు ఎక్కువగా ఎస్‌ఐఎఫ్స్ తీసుకొస్తున్నాయి ఏఎంసీలు. కొత్త తరం ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా డైలీ రిటర్న్లు కోసం ఈ ఫండ్స్ తీసుకొస్తున్నారు. డెరివేటివ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తూ డైలీ రిటర్న్లు ఇచ్చేలా ఈ స్కీమ్స్ రూపొందించారు. థెమాటిక్ ఫండ్ కేటగిరీలో ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ కాంగ్లమరేట్ ఫండ్ వస్తోంది. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 3వ తేదీన మొదలవుతుంది. అక్టోబర్ 17వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఎడెల్వీస్ నిఫ్టీ 1డీ రేట్ లిక్విడ్ ఈటీఎఫ్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 30వ తేదీన మొదలై అక్టోబర్ 3వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకులకు కొన్ని స్కీమ్స్ ప్రభావితమవుతుంటాయి. అలాగే ఫ్యూచర్స్ అండ్ డెరివేటివ్స్‌లో హైరిస్క్ ఉంటుంది. ఎస్‌ఐఎఫ్ ఎంచుకునే వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. తమ రిస్క్ సామర్థ్యాన్ని బట్టి మ్యూచువల్ ఫండ్స్ ఎంచుకోవాలి. లేదంటే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఇన్వెస్ట్ చేసే ముందు నిపుణుల సలహాలు తీసుకోవడం బెటర్. అలాగే కొత్తగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారు న్యూ ఫండ్ ఆఫర్స్‌కి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.



## ఆసియా మోటార్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో మెహ్రోత్రా స్వర్ణం, తరుషికు రజతం

**న్యూఢిల్లీ:** ఎఫ్ఐఎ ఆసియా పసిఫిక్ మోటార్ స్పోర్ట్ ఛాంపియన్‌షిప్-2025, ఆసియా ఆటో జింఖానా ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు స్వర్ణం, రజతం లభించాయి. 35 ఏళ్ల అచింత్య మెహ్రోత్రా మెహ్రోత్రా అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించగా, మహిళల విభాగంలో తరుషి విక్రమ్ రజత పతకంతో భారత్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేశారు. ఆదివారం జరిగిన ప్రీఫైనల్ మరియు ఫైనల్స్‌కు చేరుకున్న క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్థిరమైన ప్రదర్శనతో కార్టింగ్ స్ప్రింట్ ఈవెంట్‌లో భారతీయులు మంచి ప్రదర్శన ఇచ్చారు. ఇక మెహ్రోత్రా సాంకేతిక లోపం కారణంగా ఆదేశించబడిన షూటౌట్ నుండి బయటపడిన తదుపరి కోన్‌ను పడగొట్టినందుకు రెండు సెకన్ల పెనాల్టీతో పాటు. చివరికి అతను ఉత్కంఠభరితమైన ముగింపులో కిర్గిజ్స్తాన్‌కు చెందిన వేదనేవ్ అలెక్సీని సెకనులో పదవ వంతు తేడాతో ఓడించాడు. అతని స్వదేశీయుడు బహదూర్‌గఢ్ నుండి ప్రతీక్ దలాల్ 13వ స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో, 21 ఏళ్ల తరుషి అంతర్జాతీయ పోటీలో తన తొలి పతకం కోసం రెండవ స్థానంలో నిలిచేందుకు ప్రారంభ పోరాటాలు ఎదుర్కొంది. ముంబైకి చెందిన కియాన్ షా హీట్ 1 గెలుచుకోవడంలో రాణించగా, క్యాడెట్ తరగతిలో 12 ఏళ్ల రెహాన్ ఖాన్ రషీద్, ఎనిమిదేళ్ల అర్షి గుప్తా, 12 ఏళ్ల బి. రాయన్ గౌడ అన్ని సెషన్‌లలో టాప్10 స్థానాల్లో నిలిచారు. సీనియర్ విభాగంలో ఆరవ్ దివాన్, థామస్ జాకబ్ జార్జ్, అక్షత్ మిశ్రా అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు.




## చైనా స్మాష్‌లో భట్టాచార్జీ మెయిన్ డ్రాకు అర్హత

### జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మనుష్ ఓటమి

**న్యూఢిల్లీ:** టేబుల్ టెన్నిస్ 2025, చైనా స్మాష్ మెయిన్ డ్రాకు భారత్ టీనేజ్ ప్యాడ్లర్ అంకుర్ భట్టాచార్జీ అర్హత సాధించగా, సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మనుష్ షా క్వాలిఫికేషన్ రౌండ్‌లలో ఓటమిచెందారు. బీజింగ్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లో భట్టాచార్జీ చైనాకు చెందిన జౌ కైపై 12-14, 11-6, 9-11, 11-8, 13-11 తేడాతో విజయం సాధించాడు. అర్హత రౌండ్ల నుండి పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాకు చేరుకున్న ఎనిమిది మంది ఆటగాళ్లలో భట్టాచార్జీ ఒకరు. అతను పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో భారత్ అత్యధిక ర్యాంక్ పొందిన పాడ్లర్ మానవ్ ఠక్కర్‌తో చేరనున్నాడు. అంతకుముందు, భట్టాచార్జీ తన అర్హత రౌండ్ ప్రచారాన్ని హాంకాంగ్‌కు చెందిన లామ్ సియు హాంగ్‌పై 3-2 తేడాతో ఓడించి ప్రారంభించాడు. ఆ తర్వాత రెండవ రౌండ్‌లో కెనడాకు చెందిన యూజీన్ వాంగ్‌ను 3-1 తేడాతో ఓడించి జౌపై విజయం సాధించాడు. కాగా క్వాలిఫికేషన్ రౌండ్‌లో టాప్ సీడ్ ప్యాడ్లర్ సత్యన్ జ్ఞానశేఖరన్ తన తొలి మ్యాచ్‌లోనే ఓడిపోయి పోటీ నుండి నిష్క్రమించాడు. హర్మీత్ దేశాయ్ కూడా మొదటి రౌండ్‌లో, మనుష్ షా రెండవ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ అర్హత రౌండ్‌లో, భారతదేశానికి చెందిన దియా చిటాలే మరియు స్వస్తిక ఘోష్ రెండవ రౌండ్‌లో, అయిహికా ముఖర్జీ, యశస్విని ఘోర్పడే ప్రారంభ రౌండ్‌లో ఓడిపోయారు.



### షూటింగ్ ప్రపంచ కప్ మహిళల ఈవెంట్‌లో

## అనుష్కకు స్వర్ణం

### అడ్రియన్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్-2025, మహిళల రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ అనుష్క థోకూర్ స్వర్ణం గెలుచుకోగా, పురుషుల విభాగంలో అడ్రియన్ రజతం దక్కించుకున్నాడు. ఈ పతకాలతో భారత్ 4 స్వర్ణాలు, 6 రజతాలు, 3 మూడు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది. తుగ్లకాబాద్‌లోని డాక్టర్ కర్ణి సింగ్ రేంజ్‌లో ఆదివారం జరిగిన జూనియర్ ప్రపంచ కప్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో అనుష్క 461.0 స్కోరుతో ఈ బంగారు పతకాన్ని సాధించింది. ఈ పోటీలో ఇది ఆమెకు రెండో స్వర్ణం, గతంలో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో ఆమె అత్యున్నత పతకాలు గెలుచుకుంది. వ్యక్తిగత తటస్థ అథ్లెట్లు అనస్తాసియా సోరికినా (454.9), మరియా క్రుగ్లోవా (444.0) వరుసగా రెండవ, మూడవ స్థానాల్లో నిలిచారు. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొన్న ఇతర భారతీయులు మహిత్ సంధు (422.7), ప్రాచి గైక్వాడ్ (399.3) వరుసగా ఐదు, ఏడవ స్థానాల్లో నిలిచారు. కాగా జూనియర్ పురుషుల విభాగంలో అడ్రియన్ కర్మాకర్ 454.8 స్కోరుతో రజత పతకాన్ని సాధించాడు. తటస్థ పోటీదారు డిమిత్రి పిమెనోవ్ (459.9) తర్వాత స్థానంలో నిలిచాడు. కమిల్ నురియాఖ్మెటోవ్ 441.0 స్కోరుతో పోడియంను చుట్టుముట్టాడు. భారత్‌కే చెందిన వేదాంత్ నితిన్ వాగ్మారే (420.9), సమీ ఉల్లా ఖాన్ (393.0) వరుసగా ఐదు మరియు ఏడవ స్థానాల్లో నిలిచారు. అడ్రియన్ స్వదేశీయులు వేదాంత్ నితిన్ వాగ్మారే (420.9) మరియు సమీ ఉల్లా ఖాన్ (393.0) వరుసగా ఐదు మరియు ఏడవ స్థానాల్లో నిలిచారు. ఈ పతకాలతో భారతదేశం నాలుగు స్వర్ణాలు, ఆరు రజతాలు మరియు మూడు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది.

## టి20 హిస్టరీలో వెస్టిండీస్ అతిపెద్ద ఓటమి

### నేపాల్ చేతిలో 19 రన్స్‌తో చిత్తు





**న్యూఢిల్లీ:** టీ20 చరిత్రలో అతిపెద్ద ఓటమిగా వెస్టిండీస్ నిలిచింది. 19 పరుగుల తేడాతో నేపాల్ చిత్తుగా ఓడించింది. పూర్తి సభ్య జట్టుపై నేపాల్ సాధించిన తొలి విజయం ఇది. రెండుసార్లు టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్స్ అయిన వెస్టిండీస్ జట్టు నేపాల్ చేతిలో దారుణమైన పరాభవానికి గురైంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నేపాల్ మరియు వెస్టిండీస్ మధ్య జరుగుతోంది. షార్జాలో ఆదివారం జరిగిన తొలి టీ20లో ఈ తొలి విజయంతో నేపాల్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పూర్తి సభ్య జట్టుతో నేపాల్ తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో నేపాల్ బ్యాటింగ్ మరియు బౌలింగ్ రెండింటిలోనూ అద్భుతాలు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో జట్టుకు మంచి ఆరంభం లభించలేదు. జట్టు కేవలం 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. కానీ దీని తర్వాత, కెప్టెన్ రోహిత్ పౌడెల్ మరియు కుసల్ మల్లా కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. రోహిత్ 38 పరుగులు, కుసల్ 20 పరుగులు చేశాడు. దీనితో పాటు, గుల్షన్ ఝా 22 పరుగులు, దీపేంద్ర సింగ్ 17 పరుగులు అందించారు. నేపాల్ చేసిన 148 పరుగులతో మ్యాచ్‌లో వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 129 పరుగులు మాత్రమే చేయగలిగింది. కొత్త జట్టుతో మైదానంలోకి దిగిన వెస్టిండీస్ దారుణమైన బ్యాటింగ్ వైఫల్యాన్ని ఎదుర్కొంది. నవీన్ బిదాసి 22 పరుగుల ఇన్నింగ్స్‌తో జట్టు తరఫున అత్యధిక స్కోరు సాధించాడు. బౌలింగ్‌లో కుశాల్ భూర్తెల్ 2 వికెట్లు పడగొట్టగా, దీపేంద్ర, కరణ్ కెసి, నందన్ యాదవ్, లలిత్ రాజ్‌వంశీ, రోహిత్ తలా ఒక వికెట్ తీసుకున్నారు.

## బిసిసిఐ నూతన సారథిగా మిథున్



### మహిళా సెలక్షన్ కమిటీ చైర్ పర్సన్‌గా అమిత



న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) కొత్త అధ్యక్షుడిగా అధికారికంగాను, మహిళా సెలక్షన్ కమిటీ చైర్‌పర్సన్‌గా అమిత శర్మ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో జమ్మూ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ నామినేట్ చేసిన మిథున్‌ను ఎంపికచేశారు. ఈ ఎన్నికతో, బోర్డు అత్యున్నత స్థానాన్ని చేపట్టిన సౌరవ్ గంగూలీ, బిన్నీతో సహా మాజీ క్రికెటర్ల ప్రత్యేక జాబితాలో మన్హాస్ చేరారు. కాగా 45 ఏళ్ల మాజీ ఆల్ రౌండర్ అయిన మన్హాస్ 1997-98 నుండి 2016-17 వరకు దేశీయ క్రికెట్ కెరీర్‌ను కలిగి ఉన్నాడు. అతను 157 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి, 45.82 సగటుతో 9,714 రన్స్ చేశాడు. వాటిలో 27 సెంచరీలు, 49 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. లిస్ట్ ఎ క్రికెట్‌లో 130 మ్యాచ్‌ల్లో 45.84 సగటుతో 4,126 రన్స్ సాధించాడు. 5 సెంచరీలు, 26 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అదనంగా అతను ఢిల్లీ డేర్ డెవిల్స్ (ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్), పూణే వారియర్స్ ఇండియా, మరియు చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీల తరఫున 55 మ్యాచ్‌ల్లో 109.36 స్ట్రైక్ రేట్‌తో 514 రన్స్ చేశాడు. ఇక మహిళల జాతీయ సెలక్షన్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ భారత బౌలర్ అమిత శర్మ నియమితులయ్యారు. ఆమె నీతు డేవిడ్ స్థానంలో ఎంపికయ్యారు. భారతదేశం తరఫున 116 వన్డే ఇంటర్నేషనల్స్, 5 టెస్ట్‌లు, 41 టి20లు ఆడిన అమిత మొత్తం 108 వికెట్లు పడగొట్టింది. కొత్త మహిళల సెలక్షన్ ప్యానెల్‌లో మాజీ క్రీడాకారిణులు శ్యామా డే, సులక్షణ నాయక్, జయ శర్మ, స్రవంతి నాయుడు కూడా ఉన్నారు. ఈ నెల 30 నుండి నవంబర్ 2 వరకు భారత్, శ్రీలంకలో జరగనున్న మహిళల ప్రపంచ కప్ తర్వాత వారి పదవీకాలం ప్రారంభమవుతుంది.

## 29న 'రాజా సాబ్' ట్రైలర్ రిలీజ్



**రెబల్ స్టార్ ప్రభాస్,** టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ "రాజా సాబ్" ట్రైలర్ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్ర ట్రైలర్ ను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మోస్ట్ అవేటెడ్ అనౌన్స్ మెంట్ తో రెబెల్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో ప్రభాస్, సంజయ్ దత్ కాంబో స్టిల్ ఆసక్తి కలిగిస్తోంది. "రాజా సాబ్" ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

'రాజా సాబ్' సినిమాను భారీప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ ఏర్పడుతోంది. 'రాజా సాబ్' సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు డైరెక్టర్ మారుతి.



## దోస డైరీస్ ప్రొడక్షన్ నంబర్ 1 టైటిల్ 'సరస్వతి'

**వెర్సటైల్ పాత్రలతో** అలరిస్తున్న వరలక్ష్మీ శరత్ కుమార్ తన కెరీర్‌లో మరో అడుగు ముందుకు వేశారు. నిర్మాతగా, దర్శకురాలిగా మారుతున్నారు. తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్‌ని ప్రారంభిస్తున్నారు. ఇది చిత్రనిర్మాణ ప్రపంచంలో సరికొత్త ప్రయాణానికి నాంది పలుకుతోంది. ఈ బ్యానర్‌పై తొలి చిత్రంగా 'సరస్వతి' టైటిల్‌తో ఆసక్తికరమైన థ్రిల్లర్‌ను ఈరోజు అనౌన్స్‌చేశారు. 'సరస్వతి' టైటిల్ 'ఐ'లోఅనేఅక్షరం ఎరుపురంగులో హైలైట్ చేయబడి, సినిమా ఇంటన్సిటీని ప్రజెంట్ చేస్తోంది. టైటిల్ ప్రేక్షకులలో క్యూరియాసిటీ పెంచింది. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందు తున్న ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించగా, ప్రకాష్‌రాజ్, ప్రియమణి, నవీన్‌చంద్ర ఇతర పాత్రల్లో కనిపించనున్నారు.


## 'పెద్ది' నుంచి బ్రాండ్ న్యూ పోస్టర్ రిలీజ్



**మెగా పవర్ స్టార్** రామ్ చరణ్ సినీప్రస్థానంలో 18 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంలో తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక పాత్రల్లో ఒకటిగా నిలిచే 'పెద్ది'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఉప్పెన ఫేమ్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం రగ్గడ్ రూరల్ బ్యాక్ డ్రాప్‌లో అద్భుతమైన కథతో వుండబోతోంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్నారు. ఐవివై ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రానికి కోప్రెజెంటర్‌గా, కోప్రొడ్యూసర్‌గా చేరింది. చిరుత సినిమాతో తన బ్లాక్‌బస్టర్ అరంగేట్రం చేసిన చరణ్ పరిశ్రమలో 18 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పెద్ది సినిమా నుంచి స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌చరణ్‌ని అద్భుతమైన మాస్, ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేస్తోంది. రైల్వే ట్రాక్‌పై ఒంటరిగా నిలబడి, భుజంపై బ్యాక్‌ప్యాక్ వేసుకుని, వేళ్ల మధ్య బీడీతో చరణ్ మాస్ వైబ్ అదిరిపోయింది. ఈ పోస్టర్ ఓ లేయర్ మాత్రమే. సినిమాలో చరణ్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపించబోతున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఎఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## అక్టోబర్ 1న 'జటాధర' నుంచి సాంగ్ రిలీజ్

**నవ దళపతి సుధీర్ బాబు,** బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధర' కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. విజయదశమి కానుకగా ఈ సినిమా నుంచి అక్టోబర్ 1న 'ధన పిశాచి' సాంగ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. మంచికి-చెడుకి, వెలుగుకి-చీకటికి, మానవ సంకల్పానికి- విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటాన్ని ఈ చిత్రం చూపించబోతోంది. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరించారు.



## 'కానిస్టేబుల్' ఎమోషనల్ పాటను ఆవిష్కరించిన ఆర్.నారాయణమూర్తి

తెర



**దేశ సరిహద్దులలో** జవానులు, దేశం లోపల పోలీసులు ప్రజలను రక్షించేందుకు ప్రాణాలను పణంగా పెట్టి అహర్నిశలు శ్రమిస్తుంటారని ప్రముఖ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి, హీరో హీరోయిన్లుగా జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఆర్యన్ సుభాన్ ఎస్.కె దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మిస్తున్నచిత్రం 'కానిస్టేబుల్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని ఓ ఎమోషనల్ పాటను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ పాటను రామారావు రచించగా, ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ ఆలపించడం ఓ విశేషం. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి స్పందిస్తూ, 'సమాజంలో పోలీసులు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయం. చట్టాన్ని కాపాడుతూ నిజాయితీగా పనిచేసే పోలీసులు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంటారు. అలాంటి నిజాయితీ కలిగిన ఓ కానిస్టేబుల్ ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని రూపొందించడం అభినందనీయం. ఈ రోజు నేను ఆవిష్కరించిన ఎమోషనల్ పాట మనసును ఎంతగానో హత్తుకుంటోంది. ఆస్కార్ గ్రహీత చంద్రబోస్ ఈ పాటను ఆలపించి రక్తికట్టించారు. నా కళ్లు చమర్చాయి. వరుణ్ సందేశ్‌కు ఇది కమ్‌బ్యాక్ చిత్రం కావాలి. కెప్టెన్ అఫ్ ది షిప్ దర్శకుడు. ట్రైలర్, ఈ పాట చూస్తుంటే దర్శక, నిర్మాతల అభిరుచి అర్థమవుతోంది" అని అన్నారు.

హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, 'నేను ఇంతవరకు నటించిన చిత్రాలకు భిన్నంగా ఈ చిత్రంలో నా పాత్ర ఉంటుంది. చక్కటి డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషనల్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను అలరింపజేస్తుంది. యూనిట్ సమష్టి కృషికి ఈ చిత్రం ఓ మంచి ఉదాహరణగా నిలిచిపోతుంది. అలాగే నా కెరీర్ కు మరో మలుపు అవుతుంది" అని అన్నారు చిత్ర నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, అక్టోబర్ 10న ఈచిత్రాన్ని విడుదల చేస్తున్నాం. నైజాంలో ప్రముఖ సంస్థ ఏషియన్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదలవుతుంది. దాదాపు 500 థియేటర్ల పైచిలుకు థియేటర్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. మేము ఏదైతే అనుకున్నామో, దానిని స్క్రీన్ పై తీసుకుని రావడంలో నూరుశాతం సక్సెస్ అయ్యాం. ఈ క్రెడిట్ మా టీమ్ అంతటికీ చెందుతుంది" అని అన్నారు.

దర్శకుడు ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ, "ట్రైలర్‌కి వస్తున్న స్పందన చిత్రంపై మా నమ్మకాన్ని మరింత పెంచింది. ఇప్పటికే 5 లక్షలకు పైగా వ్యూస్, ఒక లక్షకు పైగా లైక్స్ ఈ చిత్రం ట్రైలర్‌కు వచ్చాయి. ఈ రోజు విడుదల చేసిన ఎమోషనల్ పాటను చిత్రీకరిస్తున్నప్పుడు లొకేషన్‌లోని ప్రజలు నిజమైన సన్నివేశం అనుకుని కన్నీరు కార్చారు. సమాజానికి స్ఫూర్తిదాయకమైన ఇలాంటి చిత్రాలు రావాలని అందరూ కోరుకునేవిధంగా ఈ చిత్రం ఉంటుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ హాజరత్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, గీత రచయిత రామారావు, సహ నిర్మాత కుపేంద్ర పవార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మిట్టపల్లి జగ్గయ్య, నటీ నటులు దువ్వాసి మోహన్, నిత్య, భవ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.

## 'తారక్ మూవీ కోసం ఇప్పుడే చెప్పను': రుక్మిణి



**రుక్మిణీ వసంత్..** నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరు ఫుల్‌గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్‌తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్‌కు వచ్చి తన నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు. సినిమా కోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించిందని, తాను మూవీలో కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని చెప్పారు. షూటింగ్ టైమ్‌లో రిషబ్ శెట్టిని చూసి కొన్నిసార్లు షాక్ అయినట్లు తెలిపారు. హీరో, డైరెక్టర్‌గా ఆయన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత తాను ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. కెరీర్ లో ఏ ఆఫర్ కూడా వదులుకోలేనని చెప్పారు. ఫ్యూచర్‌లో రకరకాల క్యారెక్టర్స్ చేస్తానని, ఆడియన్స్ తన జర్నీ జడ్జ్ చేయాలని తెలిపారు. ఫ్యాన్స్ అంతా క్రష్ అంటున్నారని, లేబుల్స్ మాత్రం నార్మల్ అని తెలిపారు. వాళ్లంతా తన క్యారెక్టర్‌కు కనెక్ట్ అవ్వడం హ్యాపీ అని చెప్పారు.

# నవరాత్రుల్లో నవరంగులు !



అమ్మవారిని నవరాత్రుల్లో ఒక్కో అవతారంలో పూజిస్తుంటారు కదా! అయితే, కొన్ని ప్రాంతాల్లో రూపానికి తగినట్లుగా తొమ్మిది రోజులూ తొమ్మిది రంగుల దుస్తులను ధరించి భక్తులు దుర్గామాతను కొలుస్తారు. అవేంటంటే..

**మొదటి రోజు : శైలపుత్రి ..**
ఈ రోజు పర్వతపుత్రిని తెలుపురంగు దుస్తులు ధరిస్తారు. ఇది ప్రకృతికీ, సంతానానికీ, శాంతికీ, వృద్ధికీ, ప్రశాంతతకూ ప్రతీక ఆట.

**రెండోరోజు : బ్రహ్మచారిణి**
ఈ రోజు ఆకుపచ్చరంగు దుస్తులు ధరిస్తారు. ఇది ప్రకృతికీ, సంతానానికీ, శాంతికీ, వృద్ధికీ, ప్రశాంతతకూ ప్రతీక అట.

**మూడోరోజు : చంద్రఘంట ..**
నవరాత్రి మూడోరోజున చంద్రఘంట రూపంలో అమ్మ వారిని పూజిస్తారు. ఈ రంగు సమతుల భావోద్వేగాలకు ప్రతీక. మనలోని కోపం, బాధ, సంతోషం.. లాంటి భావోద్వేగాలు అదుపులో ఉండాలని దీని అంతర్థాం.

**నాలుగోరోజు: కూష్మాండ..**
దేవిని ఈ రోజు నారింజ రంగు దుస్తులు వేసుకుని పూజిస్తారు. ఈ రంగు మనలో ఉల్లాసాన్నీ, సానుకూల దృక్పథాన్నీ, ఉత్సాహాన్నీ నింపుతుంది.

**ఐదో రోజు: స్కందమాత..**
పసుపు రంగు సంతోషానికీ, ఆశకీ, కాంతికీ చిహ్నమట.

**ఆరోరోజు : కాత్యాయని..** ఎరుపు రంగు ధైర్యసాహసాలకు చిహ్నం. విజయమానికి ప్రతీక. మనలో అంతులేని శక్తిని నింపుతుందట.

**ఏడోరోజు: కాళరాత్రి,** నీలి వర్ణం ముక్తినీ, గాంభీర్యాన్నీ సూచిస్తుంది. ఈ రంగు దుస్తుల్లో అమ్మవారిని పూజించడం వల్ల మనలో స్థిరత్వం, ప్రశాంతత కలుగుతాయి.

**ఎనిమిదో రోజు : మహాగౌరి ,**
గులాబీరంగు ప్రేమ, ఆప్యాయత, సామరస్యాలను సూచిస్తుంది. మనోహరంగా ఉండి, బంధాలను మరింత దగ్గర చేస్తుంది.

**తొమ్మిదోరోజు : సిద్ధిధాత్రి..** ఊదా రంగు దుస్తులు ధరించడం ద్వారా జ్ఞానోదయం, విలాసం, వైభవం, శ్రేష్ఠత లభిస్తాయి. సకల సంపదలూ, ఐశ్వర్యాలూ కలుగుతాయని భావిస్తారు. ఇలా దుస్తులే కాదు, ఇంటినీ, మందిరాన్నీ ఈ రంగుల పూలు, ఆకులతోనూ ఈ తొమ్మిదిరోజుల పాటు అలంకరిస్తారట. తద్వారా మనసంతా సానుకూల ఆలోచనలతో ఉండాలన్నదే వీటన్నింటి పరమార్థమట. □

## కొబ్బరి పువ్వు



కొబ్బరి పువ్వు తినడానికి రుచిగా ఉండడమే కాకుండా ఎన్నో ఆరోగ్యకరమైన పోషకాలను కూడా కలిగి ఉంటుంది. □

# విద్యార్థుల ఉన్నతి కోసం కృషి

మెరికల్లాంటి విద్యార్థులను తయారుచేయాలన్నది ఒకరి తపనైతే ప్రత్యేక అవసరాలున్న పిల్లల అభివృద్ధే మరొకరి ధ్యేయం. మార్గమేదైనా గ్రామీణ, పట్టణ ప్రాంతాల పిల్లల ఉన్నతి వారి అంతిమ లక్ష్యం. అందులో విజయవంతమయ్యారీ టీచర్లు..

**ఉచితంగా చెబుతూ..**
నేర్పించాలని తపన ఉన్న టీచర్లే.. మెరికల్లాంటి విద్యార్థులను తయారుచేయగలరు. అలాంటి ఓ టీచరే... రోషిణీ ముఖర్జీ. ఓ మధ్య తరగతి బెంగాలీ కుటుంబంలో పుట్టిన ఈమె చదువుల్లో టాపర్. అంతకుమించి తనకున్న విద్యా పరిజ్ఞానాన్ని పిల్లలకు అందించాలనే బలమైన కోరిక టీచర్ అవ్వాలనే లక్ష్యంతో ఫిజిక్స్‌లో మాస్టర్స్ కూడా పూర్తి చేసింది. కానీ, తండ్రి ఆకస్మిక మరణం ఆమె దారి మళ్లించి, ఐటీ ఉద్యోగంలో చేరేలా చేసింది. కానీ, తన కలలను మాత్రం మర్చిపోలేదు. ఓరోజు.... వాళ్ల పని మనిషి, టీచర్లు సరిగా చెప్పకపోవటం వల్ల తన పిల్లలు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని చెప్పింది. దాంతో గ్రామీణ ప్రాంతాల పిల్లలకు, ట్యూషన్, కోచింగ్‌లకు ఫీజులు చెల్లించే స్తోమత లేనివారికి ఏదైనా సాయంగా చేయాలనుకుంది. ఉద్యోగం వదిలేసి, 2011లో 'ఎగ్జామ్ ఫియర్.కామ్' అనే వెబ్‌సైట్ ప్రారంభించింది. దాన్నే తరవాత లర్నబ్ మార్చి, 9-12 విద్యార్థుల కోసం ఉచితంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్... సబ్జెక్టుల ట్యుటోరియళ్లు అందులో




పెడుతున్నారు. పిల్లలకు అర్థమయ్యేలా యానిమేషన్లు, బొమ్మల ద్వారా వివరంగా చెప్పటం వల్ల ఎక్కువ మందికి చేరువైంది. నీట్, జేఈఈలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ ట్యూటోరియళ్లు వరంలా మారాయి. 'ఎడ్యుబర్ ప్రెసిడెంట్' అవార్డుతోపాటు 100 మంది విమెన్ అచీవర్స్ ఆఫ్ ఇండియాగా లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డనూ స్థానం దక్కించుకున్న రోషిణి టెడెక్స్ స్పీకర్ కూడా.

**ప్రత్యేకమైన టీచర్!**
దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకూ చదువుకునే హక్కుంది. కానీ, ఇప్పటికీ అలాంటి పిల్లలను కలుపుకొని పోయే విద్యా వ్యవస్థ లేదు. కారణం... వాళ్లతో ఎలా వ్యవహరించాలో తెలియకపోవటమే అంటారు విద్యావేత్త, కౌన్సెలర్ వసుధ ప్రకాష్, నాసిక్‌లో పుట్టి పెరిగిన ఈమెకు విద్యారంగంలో పనిచేయాలనేది లక్ష్యం. అందుకే, యూఎస్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ చేశారు. 2001లో 'వి-ఎక్సెల్' పేరుతో చెన్నై కేంద్రంగా ఎడ్యుకేష నల్ ట్రస్ట్‌ను ప్రారంభించింది. దీనిద్వారా ఆ పిల్లల్లో చదువుతోపాటు వైద్యపరంగా, ఇతర నైపుణ్యాలు మెరుగుపడే విధంగా శిక్షణ ప్రారంభించారు. 'టీచర్ ఎక్సలెన్స్' కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు స్పెషల్ చిల్డ్రన్‌కు నేర్పించటం గురించి ట్రెనింగ్ ఇస్తున్నారు. అంతేకాదు, మానసిక లోపాల కారణంగా తమ పిల్లల్ని స్కూలుకి పంపించడానికి వెనకాడే తల్లిదండ్రులూ ఎక్కువే అలాంటి వారిలో మార్పు తీసుకొచ్చి స్కూల్లో చేర్చేలా ప్రోత్సహిస్తున్నారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధి




కోసం కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రతినిధి, ఎన్జీవోలతోనూ కలిసి పనిచేస్తూ... వేలమంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారు వసుధ. మూడు దశాబ్దాల పైగా ఈ రంగంలో సేవలకు గానూ ప్రిన్సెస్ హయా ఫర్ ఎడ్యుకేషనల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రొవోక్ మ్యాగజీన్ నుంచి 'హ్యుమానిటేరియన్ ఆఫ్ ది ఇయర్' అవార్డులను అందుకున్నారు. □

## నేటి అలంకరణ

# శ్రీ సరస్వతి దేవి



" ఘంటాశూల హలాని శంఖమునలే చక్రం
ధనుస్సాయకం హస్తాబ్జైర్దధతీం ఘనాంత
విలసచ్ఛీతాంశు తుల్య ప్రభామ్ గౌరీదేహ సముద్భవాం
త్రిజగతామాధారాభూతాం మహా
పూర్వ మత్ర సరస్వతీ మనుభజే
శుంభాది దైత్యార్దినీమ్ ".

ఈ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎనిమిదవ రోజు మూలా నక్షత్రానికి ప్రత్యేక విశిష్టత ఉంది. చదువుల తల్లి సరస్వతీ రూపంతో దుర్గాదేవి దర్శనమిచ్చే రోజు. బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతిదేవి (వాగ్దేవి)ని పురాణాలు వర్ణిస్తున్నాయి. శ్వేత పద్మాన్ని ఆసనంగా అధిష్టించి వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి, అభయ ముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరాలను ఈ దేవి సంహరిస్తుంది. శ్వేత వర్ణంలో వుండే హంస ఈ తల్లికి వాహనం. ఆధ్యాత్మిక పరిభాషలో హంసను ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు ప్రతీకగా పేర్కొంటారు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఈ తల్లి మన మనో వికాసం, బుద్ధి, జ్ఞాన చైతన్యం కలిగించి మోక్షమార్గంలో పరమపద సోపానాన్ని కలిగిస్తుంది. వ్యాసుడు, వాల్మీకి, కాళీదాసు మొదలైన లోకోత్తర చరిత్రులకు ఈమె వాగ్వైభవాన్ని వరంగా ఇచ్చింది. శరన్నవరాత్రులంటే శరత్ రుతువు కాలంలో వచ్చే మొదటి 9 రోజులు. అలాగే శారదా మాతను ఆరాధనకు ముఖ్యమైన రోజులు. అలాంటి శారదా మాతకు ప్రియమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీ దేవిగా మనకు దర్శనమిస్తుంది. సరస్వతీదేవిని కొలిస్తే విద్యార్థులకు చక్కని బుద్ధి వికాశం కలుగుతుంది. త్రిశక్తి స్వరూపాలలో సరస్వతీదేవి మూడో శక్తి స్వరూపం. సంగీత, సాహిత్యాలకు అధిష్టాన దేవత. సకల జీవుల జిహ్వాగ్రంపై ఈమె నివాసం ఉంటుంది.

**అలంకారం:** తెలుపు లేదా క్రీమ్ వర్ణంతో కూడిన పట్టుచీర
**పుష్పములు :** తెల్లని పూలు
**నివేదన:** అమ్మవారికి దద్ధ్యోదనం, అటుకుల పాయసం
**మంత్రం:** "ఓం శ్రీం హ్రీం క్లీం మహాసరస్వత్యై నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. పిల్లలకు పుస్తకాలు పంచుతూ, సరస్వతీదేవి అష్టోతరం పఠించాలి.

- భట్టిప్రోలు నటరాజ కుమార్

ఫ్యాషన్ ఫ్యాషన్






# దాండియా ఆడదాం



దేశవ్యాప్తంగా నవరాత్రి సందడి మొదలైంది. ఓవైపు భక్తి భావన.. మరోవైపు నృత్యాలతో కోలాహలం. చిన్నాపెద్దా ఓ చోట చేరి నవరాత్రులన్నీ సందడిగా గడిచిపోతాయి. నవరాత్రి అనగానే గుర్తొచ్చేది దాండియా కూడా! ఈ గుజరాతీ జానపద నృత్యం మనకీ కొత్తేమీ కాదు. స్నేహితులతో సరదాగా అలా ఆడిపాడడానికి ఉత్సాహం చూపేవారూ ఎందరో! అయితే దాండియా అంటే సంగీతానికి తగ్గట్టుగా పాదం కదిపేయడమే కాదు. ఆహార్యమూ నృత్యం చేస్తున్నట్లే ఉంటుంది. అలలుగా కదిలే గాగ్రా.. ఆ సందడికి సవ్వడి చేసే గవ్వలూ, మువ్వలూ.. వెలుగులకు తళుక్కుమనే అద్దాలూ! ఇక పెద్ద జుంకీలు, పట్టీలు, నెక్లెస్‌లు, గాజులను జతచేస్తే పెరిగే అందమే వేరు. కానీ తొలి ప్రాధాన్యం మాత్రం రంగురంగులతో మెరిసిపోయే వస్త్రాలదే ! దాండియా నృత్యంలో మనది అందె వేసిన చేయి కాకపోయినా.. ఆ వస్త్రధారణలో నలుగురితో అలా అలా ఆడిపాడినా వచ్చే సంతృప్తే వేరు. మీరూ ఆ ఆనందాన్ని ఆస్వాదించాలనుకుంటే ఈ గాగ్రా లేదా చనియా చోలీలను చూసేయండి. కోట్‌తో, అటాచ్‌డ్ చున్నీతో వేగంగా సిద్ధమవడంలో సాయం చేయడమే కాదు.. సౌకర్యవంతంగానూ అనిపిస్తాయి. మనమూ వీటిని ప్రయత్నించి మురిసిపోదామా? సరదాగా చేద్దామా.. □



## పసిడి, వెండి బతుకమ్మ



తెలంగాణ ఆడబిడ్డల ఆనందంగా జరుపుకొనే పూల పండగ బతుకమ్మ. పూలన్నీ వరుసలో పేర్చి పైన గౌరమ్మను ప్రతిష్ఠించి ఆరాధిస్తారు. మారిన పరిస్థితుల వల్ల అన్ని సార్లూ, అన్ని రకాల పూలూ అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా దూరంగా నగరాల్లో, విదేశాల్లో బతుకమ్మ చేసుకునే వారికి పూలు దొరక్కపోవచ్చు. ఇలాంటివారికోసమే వెండి, బంగారు బతుకమ్మలు, తాజాగా దొరికిన పూలనే అందంగా అమర్చుకునే వీలుతో డిజైన్ చేసిన వెండి బతుకమ్మలు, తాజాగా దొరికన పూలనే అందంగా అమర్చు కునే వీలుతో మరికొన్ని రకాలూ వచ్చేశాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కొత్తకోడళ్లకు ఇచ్చే బతుకమ్మ వాయనంలో కాగితపు బతుకమ్మలకు బదులుగా ఈ వెండి బతుకమ్మల్ని చేరుస్తున్నారు. వీటికే పసిడి, ఎండి లోహాలతో చేసిన పువ్వులూ, రాళ్లూ, నవరత్నాలు. వంటి హంగులను చేర్చికళ్లు తిప్పుకొనివ్వకుండా చేస్తున్నారు. □

## ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# చుక్కకూర ప్రయోజనం

చుక్కకూర మొదట రష్యా, యూరోప్ నుండి ప్రపంచమంతట గృహవైద్యంగా తిన్న తర్వాత అరుగుదలకి, జ్వరాలకి, అల్సర్లకి, కాన్సర్లకి చిగుళ్ళనుండి రక్తం కారడం (స్కర్వీ) వంటి అనేక వ్యాధులకి ఔషధంగా వాడేవారు. దీని శాస్త్రీయనామం రూమెక్స్ వెసికారియస్. ఇది పాలీగొనేసియా ఫ్యామిలీకి చెందినది. రూమెక్స్ వెసికారియస్ ఇది పాలీగొనేసియా ఫ్యామిలీకి చెందినది. ఇది ఉష్ణమండల శీతోష్ణస్థితిలో ఏడాది పొడవునా త్వరితంగా పెరిగే ఆకుకూరమొక్క. ఇది వేసవిలో చలికాలంలో ఎక్కువ ఖర్చుతో ఎక్కవపోషకాలు అందించే విరివిగా దొరికే ఆకుకూర. చుక్కకూర ఆకులు మందంగా పెళుసుగా ఉండి సన్నని కాడలతో బాణం ఆకారంలో అధిక జిగురు పదార్థాన్ని కల్గి ఉండే పుల్లని ఆకుపచ్చని ఆకుకూర. ఇది ఆకృతిలో ముదురు ఆకుపచ్చ రంగులో బచ్చలిని పోలి ఉండడంతో పుల్లబచ్చలి ఉండడంతోపుల్లబచ్చని అంటారు. అలాగే పాలకూరలాగా మృదువుగా పెళ్లుసుగా ఉండడం వల్ల పాలకూర వద్దన్న, పాలకూర డాక్, స్పినాచ్‌డక్, నారో లీవ్ డక్ అని అంటారు. పులుపులో గోంగూర లాగా ఉండడంతో గ్రీన్ సోరెల్‌రెవీడ్ అని అంటారు. దీన్ని ఇంటి తటలో పెరట్లో, కూండీల్లో పొలాల్లో ఎక్కువగా పండించడం వల్ల గార్డెన్ సోరెల్ అని, షీప్ సోరెల్, సోరెల్ లీవ్స్, డక్ అనేది రూమెక్స్ జాతికి సాధారణ పేరు. దక్షిణ భారతదేశంలో, గ్రామీణ ప్రాంతాల్లోనివారు చుక్కకూరని ఎక్కువగా వినియోగిస్తారు. చుక్క, కూర అనే ఎండు తెలుగు పదాల చూకా, చుగ్రు, చుక్రికా, చుక్రం, చుకాసాక్ సుక్కంగీరై , లోలికా, శతవేధి, పొక్కుసోరెల్, దేశం, సోరెల్, రోజీడాక్, కట్టాపాలక్ బ్లీడర్ డక్, శక్కంకీరై, పుల్ల ప్రబ్బ, ఒన్‌పలుంగ్ కుక్కన్‌కీరై, చుక్కిసొప్పు, అంబట్ చుక్క, పచ్చిపుల్కలు అని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో వ్యవహరి స్తారు. దీన్ని సలాడ్స్‌లో ఎక్కువగా వినియోగించడం వల్ల దీన్ని సలాడ్ లీవ్స్, సోరెల్ లీవ్స్ అని అంటారు. ఇదికాక అటుఇటుగా గోంగూరలాగే పులుపుదనాన్ని కల్గి ఉండడానికి ముఖ్యకారణం ఆక్సాలిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడమే ఇది నిమ్మవాసనతో పుల్లని రుచితో ఉండి శరీరంలో వేడిని తగ్గించి చలువ చేస్తుంది. ఆహారానికి రుచిని కల్గించే రుచికరమైన ఆకుకూర ఇది. చుక్కకూర రెండు రకాలుగా దొరుకుతుంది.

1. పెద్దచుక్కకూర పుల్లగా తియ్యగా ఉంటుంది.
2. చిన్న చుక్కకూర పుల్లగా వగరుగా ఉంటుంది.

పోషకవిలువలు: 100 గ్రాముల చుక్కకూరలో ఉండే

**పోషకాలు :** తేమ: 95.2 కేలరీలు : 19 కేలరీలు. ప్రోటీన్: 1.6 గ్రా , కార్బొహైడ్రేట్స్: 1.4 గ్రా. మినరల్స్: 0.9, ఫైబర్.1.2 నరగా. కాల్షియం: 63 మి.గ్రా, ఫాస్పరస్ : 84 మిగ్రా, ఐరన్: 8.7 మిగ్రా, ఫాస్పరస్: 84 మిగ్రా విటమిన్ ఎ: 6100 గ్రా. విటమిన్ కె: 126 మి.గ్రా. మెగ్నీషియం : 137 మి.గ్రా. పొటాషియం: 519 మి.గ్రా. ట్యాటిన్: 2370 మి.గ్రా. బీటాకెరోటిన్ : 2754 మి.గ్రా.

**ఆరోగ్య ప్రయోజనాలు :** సరైన ఆరోగ్యానికి సమతుల్య ఆహారినికి చుక్కకూర చాలా మంచిది. లివర్ : చుక్కకూరలోని ఆంటీ కామెర్ల గునం వల్ల చుక్కకూర రసంని పాలు లేదా పెరుగతో కలిపి తీసుకుంటే తగ్గుతుంది. లివర్ వ్యాధుల తీవ్రతను తగ్గస్తుంది. తేలు కాటు వేసిన చోట చుక్కకూర రసం పోసినట్లయితే విషానికి విరుగుడై త్వరగా కోలుకుంటారు. శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ని తగ్గించి డిటాక్సిఫై చేస్తుంది.

**రక్తహీనత :** చుక్కకూరలోని ఐరన్ వల్ల హీమోగ్లోబిన్ శీతం పెరిగి ఎర్ర రక్తకణాల సమఖ్య మెరుగుపడుతుంది. ఎముక మూలుగ నుంచి శరీరానికి కావలసిన తెల్ల, ఎర్ర రక్తకణాల సంఖ్య సరైన నిష్పత్తిలో పెంచుతుంది. వేడి శరీరం వారికి వేడిని తగ్గించి మేలు చేస్తుంది. □

# క్రీములు ఫ్రిజ్‌లో..

చాలా వరకూ స్కిన్ కేర్ ఉత్పత్తులపై ఎండ తగలని, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉంచమనే ఉంటుది. చర్మానికి చల్లగా వేసే ప్యాక్‌లు ఎంత హాయిగా అనిపిస్తాయో! అలాంటప్పుడు వీటినీ ఫ్రిజ్‌లో పెట్టి వాడుకుంటే..? ఆహార పదార్థాలు త్వరగా పాడవకుండా ఫ్రిజ్‌లో పెడతాం కదా! అది స్కిన్ కేర్ ఉత్పత్తులకూ వర్తిస్తుంది. సహజ, సేంద్రియ ఉత్పత్తుల్లో నిల్వ కారకాలు వాడరు. దీంతో త్వరగా పాడయ్యే అవకాశమెక్కువ. ఇలాంటప్పుడు వాటిని ఫ్రిజ్‌లో పెడితే త్వరగా పాడవ్వవు. కళ్ల ఉబ్బడం, మంట పుట్టడం లాంటివి జిగిరితే చల్లని నీటిలో తడిపి, పిండేసిన వస్త్రాన్ని కళ్లపై ఉంచుతాం. కీర, బంగాళదుంప ముక్కల్ని చల్లగా ఉంచినా త్వరగా ప్రయోజన ఉంటుంది గమనించారా? ముఖం మంటగా ఉంచినప్పుడు, ఏవైనా అలర్జీలు వచ్చినా చల్లగా ఏదైనా ఉంచితే ఎంత హాయిగా ఉంటుంది? అన్నీ ప్రయోజనాలే. ఇంకెందుకు ఆలస్యం.. క్రీములన్నీ ఫ్రిజ్‌లో పెట్టేద్దాం అంటారా? ఆగండాగండి..చల్లదనం చర్మానికి మంచిదే!కానీ అన్నింటికీ ఒకే మంత్రం అంటేఎలా? ఐ క్రీములు అలసిన కళ్లను సేదతీరుస్తాయి. ఉబ్బు,గీతలు వంటివీ తగ్గస్తాయి. వీటిని పెడితే ప్రయోజనమే. జెల్ ఆధారిత, షీట్ మాస్క్‌లుకూడా చల్లగా ఉన్నప్పుడు మరింత ప్రయోజనాన్ని అందిస్తాయి. పైగా చర్మానికి తాజా లుక్‌ని ఇస్తాయి. వీటినీ పెట్టొచ్చు. ఇక సీరమ్‌లు.. ముఖ్యంగా విటమిన్ సి ఉన్నవి ఆక్సిడేషన్‌కి గురయ్యే అవకాశమెక్కువ.కాబట్టి, వీటికీ చోటివ్వొచ్చు. అలోవెరా జెల్, రోజ్‌వాటర్, మిస్ట్‌లు.. అన్నీ మేలు చేసేవే! అయితే ఆయిల్ బేస్డ్, క్లే ఆధారిత ఉత్పతత్తులను పెడితే వాడటానికి ఇబ్బందిగా మారతాయి. ఇక క్రీముల్లో బోలెడు పదార్థాలను వాడతారు. అవి వేటికవే విడిపోయేప్రమాదం ఉంటుంది. సన్‌స్క్రీన్‌దీ అదే పరిస్థితి. కాబట్టి, వాటిని గది ఉష్ణోగ్రతకే పరిమితం చేస్తే సరి. అయితే వాటి మూతలు గట్టిగా పెడుతున్నారా అన్నది గమనించుకోవడం మాత్రం తప్పనిసరి. □



# చిరుధాన్యాల మొలకలు

మహిళలు ఇంటిల్లిపాది ఆకలిని తీరుస్తారు కానీ, తమ శరీరానికి అవసరమయ్యే పోషకాలు తగినంతగా అందుతున్నాయా లేదా అన్నది గమనించండి. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తప్పవు. వీటిని సులువుగా అధిగమించాలంటే తృణధాన్యాలతో చేసిన మొలకలు చక్కగా ఉపయోగపడతాయి. అదెలాగో తెలుసుకుందామా! రాగి, సజ్జ, జొన్నలు, కొర్రలు... వంటి చిరుధాన్యాల మొలకల్లో ఫోలెట్, ఇనుము, విటమిన్ సి, జింక్, మెగ్నీషియం, ప్రొటీన్... ఎక్కువగా ఉంటాయి. ఇవి మొలకెత్తే ప్రక్రియ... ఫైటిక్ యాసిడ్ స్థాయులను తగ్గిస్తుంది. శక్తికి

దీనివల్ల శరీరం ఈ పోషకాలను సులువుగా గ్రహిస్తుంది. ఫలితంగా మహిళల్లో రోగనిరోధకశక్తి, శక్తి స్థాయులు పెరుగుతాయి. జీవక్రియా రేటు మెరుగుపడుతుంది. మొలకెత్తిన చిరుధాన్యాల్లో యాంటీ ఆక్సిడెంట్లు(ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు) అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గిస్తాయి. కొన్ని రకాల క్యాన్సర్ల నివారణలోనూ, ఈస్ట్రోజన్ స్థాయులను మార్పు చేయడంలోనూ సాయపడతాయి. మిల్లెట్ స్ప్రౌట్స్‌లో ఫోలెట్ పుష్కలంగా ఉంటుంది. గర్భస్థ శిశువు మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడుతుంది. అలానే మహిళల్లోని రక్తహీనతను నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఎంత తీసుకుంటే అంత మేలు. వీటిలో లభించే పీచు జీర్ణవ్యవస్థ పనితీరును పెంచుతుంది. మొలకల్లో జింక్, ఇనుము, కాల్షియం ఎక్కువగా లభిస్తాయి. ఇవన్నీ శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తాయి. ముఖ్యంగా జింక్ సంతాన సాఫల్య సమస్యలను దూరం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది.



## చెలి చిట్కా

- పాలలో పుదీనా ఆకులు వేస్తే విరగవు .
- మంచి టమాటాలు తడిగుట్టలో చుట్టివుంచితే ఫ్రెష్‌గా ఉంటాయి.
- గర్భిణీలు ఎప్పుడు ఎడమవైపు తిరిగి పడుకోవాలి. అలా పడుకొన్నప్పుడు రక్తప్రసరణ చక్కగా అవుతుంది.
- బొప్పాయి కొలస్ట్రాలను నియంత్రిస్తుంది. □




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.